వ్యవస్థాపకులు

**కీ||శే|| మునుగంటి శ్రీరామమూర్తి**

గౌరవ సంపాదకులు

**డా|| శ్రీమాన్ కొమాండూరి శేషాద్రి**

సంపాదకుడు

**మునుగంటి వెంకట్రావు**

63వ సంవత్సరపు ప్రచురణ

# గానకళ

సంగీత మాసపత్రిక

అంతర్జాతీయ సంగీత మాసపత్రిక

సంపుటి - 63 జూలై - సెప్టెంబర్ 2024 సంచిక - 2, 3, 4











63వ సంవత్సరపు ప్రచురణ

# గానకళ

అంతర్జాతీయ సంగీత మాసపత్రిక

30-1-29, రంగయ్యనాయుడువీధి, కాకినాడ - 533001, సెల్ : 9441488721

సహాయ సంపాదకులు

**శ్రీ వాసా గోపీనాథరావు**
విశ్రాంత ప్రిన్సిపాల్, సంగీత నృత్యకళాశాల, హైదరాబాద్

**శ్రీ కె.వి. బ్రహ్మానందం**
విశ్రాంతాచార్యులు, ప్రభుత్వ సంగీత నృత్యకళాశాల, విజయవాడ

**శ్రీ మండలీక సీతారాఘవరావు**, చెన్నై

**శ్రీ జయంతి సత్యనారాయణ శాస్త్రి**, కాకినాడ

సంపుటి - 63 | జులై - సెప్టెంబర్ 2024 | సంచిక - 2, 3, 4

**సంపాదకవర్గం :**
శ్రీ ఆకెళ్ల మల్లికార్జునశర్మ
శ్రీ మల్లాది సూరిబాబు
శ్రీ పి.వి.ఎస్. శేషయ్యశాస్త్రి
డా॥ శ్రీమతి ద్వారం వి.జె.లక్ష్మి
డా॥ వైజర్సు బాలసుబ్రహ్మణ్యం
డా॥ ఎమ్. పురుషోత్తమాచార్య
శ్రీ కె.ఎస్.ఆర్. బాలకృష్ణ శాస్త్రి
శ్రీ జొన్నలగడ్డ సూర్య ఈశ్వర ప్రసాద్
శ్రీ విష్ణుభట్ల శ్రీరామ చంద్రమూర్తి
విజయనగరం కుమారి డి. వర్ధని
డా॥ ఆర్. మాధురి దేవి
శ్రీమతి బురిడి అనూరాధ పరుశురాం
శ్రీ ఎమ్. వి. సింహాచల శాస్త్రి భాగవతార్
శ్రీ ఇ.వి.కృష్ణమాచార్యులు

**సారధ్య సంఘం :**
శ్రీ ఎం.ఎస్. శ్రీనివాస్
శ్రీ ఎన్.వి. రమణ
శ్రీ బి. మారుతీ రఘురామ్
శ్రీ ఎమ్. అచ్యుత రామయ్య
డా॥ శ్రీమతి టి. సూర్యకాంతం
శ్రీమతి నూలి వెంకట లక్ష్మీదేవి, M.A.,M.A.,M.A
శ్రీమతి వై. రమాప్రభ, M.A., (Music)
శ్రీమతి ఎస్. సుబ్బలక్ష్మి, M.A.,M.A.,M.A. (Music)
శ్రీమతి పి. రమాదేవి, హనుమకొండ
శ్రీమతి ప్రభల రాజేశ్వరి
శ్రీమతి ఎ. భారతీదేవి, గుంటూరు
శ్రీమతి ఎమ్.వై. శేషురాణి, గుంటూరు
కుమారి మండపాక నాగలక్ష్మి

## ఈ సంచికలో....

| | | | పేజీలలో |
|---|---|---|---|
| 1. | నా స్వగతం | - శ్రీ మల్లాది సూరిబాబు | 3 |
| 2. | మన చక్కని చిక్కని కర్ణాటక సంగీతం | - శ్రీ మోదుమూడి సుధాకర్ | 8 |
| 3. | సంకీర్తన సంగీతము | - స్వర్గీయ సత్తిరాజు వేణుమాధవ్ | 11 |
| 4. | సప్తగిరి సంగీత సప్తాహం | - శ్రీ పున్నమరాజు మురళీకృష్ణ | 17 |
| 5. | A Philatelic Tribute to Music | - Cdr G. Sriramarao, | 27 |
| 6. | సంగీత సభల కార్యకలాపములు | - 'విహారి' | 32 |

## ముఖచిత్రం

1. గురుపౌర్ణమి సందర్భంగా కాకినాడ చాగంటి సత్సంగం ఆధ్వర్యంలో శ్రీ చాగంటి కోటేశ్వరరావు గారి చేతుల మీదుగా గురుసత్కారం అందుకుంటున్న వైణిక విద్వాంసులు శ్రీ ద్విభాష్యం నగేశ్ బాబు.
2. 'కాకినాడ సంగీతసౌరభం' పుస్తకావిష్కరణ సభానంతరం శ్రీ ఆకొండి శ్రీనివాస రాజారావును సత్కరిస్తున్న శ్రీరామ సమాజ కార్యవర్గం.
3. రామనారాయణం, విజయనగరం "వాల్మీకి రామాయణ పరిశోధన" సంస్థ లో జరిగిన కార్యక్రమంలో పూర్వ ఉపరాష్ట్రపతి గౌరవ శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు గారిని సత్కరిస్తున్న నిర్వాహకులు నారాయణం కుటుంబ సభ్యులు.
4. 40 సంవత్సరాల సుదీర్ఘకాలం కార్యదర్శిగా పనిచేసి పదవీవిరమణ చేసిన విశాఖ మ్యూజిక్ అకాడమీ నిర్వాహకులు శ్రీ యం.యస్. శ్రీనివాస్ ను సత్కరిస్తున్న దృశ్యం.
5. శ్రీరామ సమాజం, కాకినాడ వారి 130వ వినాయక నవరాత్ర నృత్య సంగీత హరికథా మహోత్సవాలలో శ్రీ ఆకొండి శ్రీనివాసరాజారావు రచించిన "కాకినాడ సంగీత సౌరభం" పుస్తకావిష్కరణ దృశ్యం.

Email : ganakalamagazine@yahoo.co.in కు కళాకారులు, సంస్థలు వార్తలు, ఫోటోలు పంపవచ్చు.

ganakala.in వెబ్ పేజీలో గానకళ పూర్వ సంచికలు, కొత్త సంచికలు చూడవచ్చు.

# నా స్వగతం



- మల్లాది సూరిబాబు

## ఉత్తమ గురువులు :

సాధారణ స్థాయినుండి బ్రహ్మానంద స్థితి వరకూ సంగీతంలో కొన్ని సోపానాలున్నాయి. అందుకోవడంలో తేడాలుంటాయి. ఈ ఆనందం కొందరికి పుట్టుకతోనే సిద్ధిస్తుంది. మరికొందరు ఎంత ప్రయత్నం చేసినా దొరకదు. ఉన్నదానితో తృప్తి పడేవారు, అందుకోలేక భగీరథ ప్రయత్నం చేసేవారు ఉంటూనే ఉంటారు. త్యాగయ్యగారి కీర్తనలు నేర్చి పాడినంత మాత్రాన ఆయనకు లభించిన బ్రహ్మానందస్థితి పాడే విద్వాంసులందరికీ దొరుకుతోందా? చెప్పలేం. సంగీతం తపస్సుగా భావించి, అనుష్టానంగా భావించి పాడుకునే ఏ కొద్దిమందికో సిద్ధిస్తుంది. అలాంటివారు అరుదుగా జన్మిస్తారు. వారే ఉత్తమ గురువులు. వారిని అందుకోగల సంస్కారమున్నవారే శిష్యులవుతారు. వారివల్లనే సంగీతం పెరుగుతుంది.

ఏ విద్య లొంగాలన్నా, ఉబలాటం, ఉత్సాహం ఒక్కటే సరిపోదు. అర్హత ఉండాలి. భగవంతుడు మన నొసట సంగీతం రాసి పెట్టి ఉండాలి.

మనం అనుకుంటే సరిపోదు. దైవం కూడా అనుకూలించి నిర్ణయించాలి. గురువును కూడా ఆయనే చూపిస్తాడు – మార్గం సుగమం చేస్తాడు.

బోధకులకు తగు సాధకులుండాలి. సమర్థులైన గురువులుంటే ప్రతిభావంతులైన శిష్యులు తయారవుతారు అందుకే "సీతావర సంగీత జ్ఞానము, ధాత వ్రాయవలెరా!" అన్నారు త్యాగయ్య. ఎక్కడో తిరువయ్యార్ లో స్థిరపడిన త్యాగరాజు అంత పేరు ఎందుకు వచ్చింది? మహాగాయకుడు కాబట్టి. అదే సూదంటు రాయిలా ఆకర్షించి శిష్యుల్ని తయారుచేసి పెట్టింది. యిద్దరేశి శిష్యులకు కలిపి సంగీతం చెప్పేవారట. ఆయన సంగీత శిక్షణ చాలా కట్టుదిట్టంగా ఎంతో క్రమశిక్షణతో ఉండేది.

పూలచుట్టూ మధుపాలు తిరిగినట్లు ఆ సంగీత సద్గురువును శిష్యులు ఎలా ఆశ్రయించారో, అలాగే వోలేటి గురువుగారు కూడా, మునుగంటి వెంకట్రావు పంతులుగారిని ఆశ్రయించారు – సంగీతంపై శ్రద్ధా భక్తులే పెట్టుబడిగా గురు దక్షిణ కూడా కోరుకోని పంతులుగారి సాన్నిహిత్యంలోనే మెలిగారు.

పంతులుగారి తండ్రిగారు శ్రీరాములు గారు, ఆయన సోదరుడైన పానకాలరావు గారు సంగీతకోవిదులే కాదు, సంగీతవ్యాప్తికి జీవితాలను ధారపోసిన మహనీయులు. శ్రీరామసమాజం

పేరున ఒక సంస్థను స్థాపించి, అర్హులైన వారికి సదుపాయాలు కూడా కల్పిస్తూ – వారు చేసిన సంగీత సేవకు చేతులెత్తి జోహార్లు అర్పించాలి. ఆ శ్రీరాములు గారి కుమారులే వెంకట్రావు పంతులుగారు. గాయక సామ్రాట్ బిరుదాంకితులు. సంగీత విద్వాన్ పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారి చేతులుమీదుగా సన్మానింపబడ్డవారు. కొడుకులో ఉన్న సంగీతాభిలాషను చూసి, తండ్రి నరసింహరావు, కాకినాడలో వోలేటి గారిని చిన్నవయస్సులోనే వెంకట్రావు పంతులుగారి వద్ద చేర్చారు.

శిష్యునిలో నిజంగా సంగీతం నేర్చుకొనే శ్రద్ధ ఎంతవుందో ఎన్నో రకాలుగా, ఎన్నో రోజులు పరీక్షించి మరీ శిష్యుని చేసుకొన్నారు.

వోలేటి గారిలోని ప్రజ్ఞను గ్రహించిన పంతులుగారు, ఎంతో శ్రద్ధగా పాఠం చెప్పేవారు.

వోలేటి గారితో సంభాషంచే సమయంలో తెలిసిన విషయాలు పాఠకులకు, సంగీతార్థులకు, విద్యార్థులకూ చెప్పాలనే నా ఆశ.

సంగీతం విషయంలో ఎవరి గురువు వారి కెక్కువ.

ఒకరి సంగీతం మరొకరికి నచ్చాలని లేదు, లోకో భిన్నరుచిః'' కానీ గురువు చెప్పేది వింటూ యితర విద్వాంసులను వింటే లభించే ప్రయోజనం ఎక్కువ. కొందరు ఈ విషయాన్ని అంగీకరించక పోవచ్చు. కానీ సార్వజనీనమైన సత్యానికి మార్పుండదు. గురువు చెప్పేది కొంతవరకే. సంగీతానికి బుద్ధే ప్రమాణం. మనస్సే కొలతబద్ధ. ఏం నేర్చుకోవాలి? ఎలా నేర్చుకోవాలి? సాధనాక్రమం ఎలా ఉండాలి? నేర్చుకున్న విద్యను ఎలా ప్రదర్శించాలి? అనేది సద్గురువు మాత్రమే నిర్దేశించగలడు. మునుగంటి వెంకట్రావు పంతులు గారికి ఆ రోజుల్లోనే గట్టి అధ్యాపకుడనే పేరుంది.

ఈమని శంకరశాస్త్రి (వైతాళికులు) టి.కె. యశోదాదేవి, వింజమూరి సీత, అనసూయలు, ఆకెళ్ళ ప్రభాకరమూర్తి, అడ్డాల లలితాదేవి, అల్లంరాజు సోమేశ్వరరావు, కోటిపల్లి సూర్య ప్రకాశరావు, సంకిస రామశాస్త్రి, మద్దూరి బుచ్చన్నశాస్త్రి, చిత్తజల్లు సత్యవతీబాయి, డా. తోట కౌసల్యదేవి మొదలైన వారెందరో ఆయన శిష్యులు.

పంతులు గారు గురుముఖతః ఎవరిదగ్గరా నేర్చుకోకపోయినా, ఆయనకు ఆయనే గురువై, పుష్కలమైన జ్ఞానాన్ని సంపాదించారు.

అపారమైన సంగీత సాధనతో ఒక విశిష్టమైన శైలిని సొంతం చేసుకున్న విద్వాంసులు.

ఉన్నవి ఏడే స్వరాలు. త్యాగరాజుకు కనిపించే స్వరానికీ యిళయరాజా కు కనపడే స్వరానికీ తేడా లేదూ? చూసే దృష్టిని బట్టే సృష్టి.

సప్తస్వర సమ్మిళితమైన సంగీతమంతా ఒకే సంగీతమై 'word music'. దేశీయ ఆచారాలూ అభిరుచులు, ఆశయాల్ని బట్టి బాణీలు మారి, వివిధ సంగీత రీతులేర్పడ్డాయని, భిన్నత్వంలో ఏకత్వమే కనిపిస్తుందనేది ఆయన సిద్ధాంతం.

సంప్రదాయ సంగీతం పాడేవారు మడిగట్టుకుని, యితర సంప్రదాయాలను దగ్గరకు రానీయకూడదనే మూర్ఖపు వాదన చేశేవారు కాదు. అంత సంగీతం నేర్చుకున్న సీత అనసూయలు జానపద సంగీతం పాడి ప్రసిద్ధులయ్యారు. సంప్రదాయ సంగీతమే పాడాలనే నియమం పెట్టుకుంటే ఆలోచనా పరిధి సంకుచితమై పోతుందని నమ్మినగాయకుడు.

మా గురువుగారితో బాటు ఈమని శంకరశాస్త్రి, సీత, అనసూయల వంటి ఎందరో గాయనీ గాయకులు 'లలిత సంగీత బాణీలు చేయటంలో కూడా సిద్ధహస్తులవడానికి' యిదే కారణం.

పంతులు గారు స్వరపరచిన

**"ప్రియ భారతావనీ, విశ్వైకపావని జయశాలినీ!**
**మము కరుణింపవే జననీ..."**

అనే దేశభక్తిగీతం రేడియో కోసం పంపారు. గౌరీ మనోహరి రాగంలో స్వరం రాసి పంపితే ఈ మాసపు పాటగా రేడియో కోసం నేనూ, మల్లిక్, యన్.బి. కనకదుర్గా, ఎన్.సి.వి. జగన్నాధాచార్యులు కలిసి పాడాం. హిందుస్తానీ సంప్రదాయంలోని జారుగమకం, శ్రుతి సుఖంతో కొన్ని స్వరస్థానాలపై స్వేచ్ఛగా ఆగటం వంటివి వోలేటి గారికి అలవాటవడానికి కారణం వారి గురువు పంతులుగారే. వోలేటి గారి శంకరాభరణం, వరాళి, కల్యాణి, మోహన వంటి రాగాలు వింటే మీకే తెలుస్తుంది.

సంగీతానికీ సాహిత్యానికీ సమానమైన ప్రాధాన్యత ఉండాలనే వారు పంతులుగారు. కీర్తనలోని మాటలకు తొడిగిన స్వరసముదాయం (musical phrases) రాగాన్ని స్ఫురింపజేసేవే. తాళంతో పాడితే కీర్తనవుతుంది. తాళం తీసేసి విడిగా పాడితే అదే రాగం. అనుభవం పండిన సద్గురువులే దీన్ని identify చేస్తారు. పంతులుగారు కీర్తన పాఠం బోధించే సమయంలో ఈ అంశాన్ని ప్రత్యేకంగా చెప్పేవారు. జంటస్వరాలు, మూడేసి వరాలతో అకార, సాధన చేయించేవారు. కొమ్మిరెడ్డివారి నిర్వహణలో కాకినాడ సూర్యకళామందిరంలో జరిగే సంగీత కచేరీలలో ఉత్తరాది నుండి పెద్ద పెద్ద హిందూస్తానీ ఉస్తాదులు వచ్చి పాడేవారు. అదొక స్వర్ణయుగం. సంగీత రసికులు ఉత్సాహంగా హాజరై వినేవారని సంకిస తారకం గారి పుత్రుడు దీక్షితులు గారు నాతో చెప్పేవారు. ఓసారి వింజమూరి అనసూయ, విజయవాడవచ్చిన సందర్భంలో మాట్లాడుతూ ''మునుగంటి వేంకట్రావు పంతులుగారు పాడే విధానం ఒక మహాకావ్యం. విజృంభించి ఆయన రాగాలాపన చేస్తే ప్రకృతే పల్లవించిందా అనిపించేది. మంద్ర తారస్థాయిల మధ్య ఆయన వీరవిహారం చేస్తే, అనంతాకాశంలో సంగీతపుటూయలలో భూమి, ఆకాశాలమధ్య ఊగుతున్నారా యనిపించేది! ఆ పాట మన మధ్యలోనే ఉంటూ ఒక్కొక్కసారి అగాధపు లోతుల్లోకి, గంభీర శిఖరాలపైకి వెళ్ళి వస్తూండేది.

ఆయన పాడే శైలిలో కొన్ని రాగాల్లో సముద్రపు

ఘోష, మదగజగమనం, కొన్ని చోట్ల మందహాసం, మరికొన్ని సందర్భాలలో శృతి మెత్తని పలకరింపు వినబడేవి.

పదాలు బాగా పాడేవారు. క్షేత్రయ్య పదాలన్ని రాగాలకు ప్రతిరూపాలే. ఒకవైపు సంప్రదాయ సంగీతంపై సాధికారత, మరోవైపు సాహిత్యంపై మక్కువ, సమానంగా ఉన్నాయి ఆయనలో..'' అని ఎన్నో విషయాలు డాక్టర్ వింజమూరి అనసూయ విజయవాడ రేడియో కేంద్రానికి వచ్చినప్పుడు చెప్పారు. నాతో పంతులుగారి అనుభవాలు పంచుకున్నారు. సంగీతమంతా ఏడు స్వరాల్లోనే ఉంది. షడ్జ పంచమాలు మినహాయిస్తే మిగిలిన స్వరాలను శుద్ధంగా పాడాలంటే 'గురువు' సహాయం ఉండాలి. ఎవరికి వారు తెలుసుకోలేరు. ఒక్కో స్వరం ఒక్కో రాగంలో ఒక్కోలా పలకాలి. అనుస్వరం తెలియాలి.

'కోలాహల సప్త స్వరాల గుర్తే మోక్షం' అన్నారు త్యాగయ్య.

ఓసారి వోలేటి గురువుగారు 'రఘుప్రియ' రాగం పాడుతూంటే యింట్లో కూర్చుని మైమరచిపోయి వింటూ అలాగే ఉండిపోయాను – పాడేసి లేచి యింట్లోకి వెళ్తూ నాతో అన్నమాట. ''సంగీత జ్ఞానం బొత్తిగా లేని వారూ, రసికులు కానివారి ఎదురుగా యిలాంటి రాగాలు పాడకండి!'' అంటూండే వారు నా ఆదిగురువు పంతులుగారు. అన్నారు వోలేటి గారు.

మనం వాడే మందులమీద వైద్యుల సలహా మేరకు వాడండి అనే సూచన ఉంటుంది. సంగీతానికి సమర్థుడైన డాక్టర్ వంటి గురువుండాలి. ప్రాక్టీసు లేని డాక్టర్లు, పరిణితి లేని సంగీతం మాష్టర్లూ ఒకటే.

డాక్టర్లు మితంగానే మాట్లాడతారు. రోగితో కబుర్లు చెబుతూ కూర్చోరు. సంగీత సద్గురువు కూడా మితంగానే మాట్లాడాలి. అమితంగా పాడించాలి. చిన్న చిన్న రుగ్మతలు తట్టుకునే, రోగ నిరోధక శక్తి కలిగిన వారికి వైద్యం పనిచేస్తుంది. సాధనకు తట్టుకోగల వారికే సంగీతం లొంగుతుంది.

స్వరం, స్వర స్థానం రెండూ వేరు. కొన్ని స్వరాలు పక్క స్వరాలనుండి వస్తాయి. మరికొన్ని పొడి పొడిగా వినిపిస్తాయి. రెండింటికీ తేడా చెప్పగలిగే గురువుండాలి. పక్క స్వరంతో (అనుస్వరం) పాడే మాటకు బరువుంటుంది. పాడుతూ, చెప్పే గురువు దొరకాలి. అనుభవంలోకి వచ్చేవరకూ పాడాలి. పంతులుగారు చేసే సాధన యిలాగే వుండేది.

ఎదురుగా చాపమీద కూర్చుని వోలేటి గారు కీర్తన పాడుతోంటే భూమి అదురుతోందా? యనిపించేది నాకు. 'రేడియో కోసం ఓ లలిత సంగీతం ట్యూన్ చేసి సుశీల, సుబ్బలక్ష్మి అనే గాయనీ మణుల చేత పాడించాను. చలాకీగా, నిర్దుష్టంగా పాడే వారిలో ఈ యిద్దరూ చాలా ప్రముఖులు.

రికార్డింగ్ ముందు రోజు వెళ్లి గురువుగారికి, పాడి వినిపించాను.

మాటలు బరువుగా పలకండి. మీరే బరువుగా పాడకపోతే ఆ పాడేవారు కూడా పల్చగా, తేలికగానే పాడేస్తారు సుమా! అని ఆయన హెచ్చరించిన

సంగతి యిప్పుడూ, ఎప్పుడూ మర్చిపోను.

ఈ లక్షణం, వోలేటి గారి గురువుగారిలో పరిపూర్ణంగా ఉండేది. పుష్కలమైన స్వరజ్ఞానంతో లభించే అరుదైన అర్హత, బరువుగా పాడటం. వెంకట్రావు పంతులుగారి కీర్తనాపాఠం, చిట్టలు చాలా శుద్ధంగా, చక్కని గమకసౌందర్యంతో నిండుగా ఉండేవని అనసూయ గారు అన్నారు.

కాంభోజి, కల్యాణి, ఖరహరప్రియ, భైరవి వంటి రాగాల్లోని కీర్తనలు చిట్టలు చాలా ఓపికతో సిద్ధంచేసి (నోటేషన్) పొల్లు సంగతులు, రాగభావం బొత్తిగా లేని సంగతుల్ని తీసేసి, సారమైన రాగ భావం ఉట్టిపడేలా తయారు చేశారట.

కీర్తన చిట్టలు (పాఠం) బాగుంటే రాగం, నెరవు, రెండూ బాగుంటాయి అనేవారట.

ఈ మాటే వోలేటి గారూ అనేవారు రాగభావంతో ఉన్న సంగతులు గొంతులో స్పష్టంగా పలికించలేని వారు తేలికగా పాడేస్తే ఎలా? అనేవారు.

అనుస్వరంతో, రాగభావం వచ్చేలా స్వరం పాడలేని వారు, సంగీతానికి సగంలోనే స్వస్తిచెప్పేసి తేలికగా పలికే లలితసంగీతం వైపు ఆకర్షితులవడానికదే కారణం కావచ్చు. అందులోనే ఆనందమనుభవిస్తారు. ఆక్షేపణీయం కాదు.

ఉత్తమ సంగీతం, ఉత్త సంగీతం... రెండింటికీ తేడా తెలిసే సంస్కారంకూడా అవసరమేకదా?

యం.యస్. సుబ్బలక్ష్మికి తొలి సంగీత గురువు ఆమె తల్లి షణ్ముఖ వడివు.

ఆ తర్వాత ఎందరో గురువులను ఆశ్రయించారు. పాటలో చక్కని తూకం, నిర్దిష్టమైన లయ, కాలప్రమాణం, నెరవు రాగభావంతో పాడే విధానం, యిలా ఎన్నో అంశాలపై, సెమ్మంగుడి, అరయక్కుడి, ముసిరి సుబ్రహ్మణ్య అయ్యర్; నేదునూరి కృష్ణమూర్తి (అన్నమయ్య సంకీర్తనలు నేర్చుకున్నారు)

ఫాల్ఘాట్ కె.వి. నారాయణస్వామి, పాపా వెంకట్రామయ్యర్, అన్నా స్వామి భాగవతార్ బృందం యిలా ఎందరెందరో ఆమెను పరిపూర్ణ గాయనిగా తీర్చిదిద్దటంలో తోడ్పడ్డారు. నిన్నరాత్రి కచేరీలో మీరు పాడిన కీర్తన విన్నాను. ఆ కీర్తన నేనెరగను. 'మీకు వీలున్న సమయం చెబితే వచ్చి నేర్చుకుంటాను'' అని అర్థించే సంగీత విద్యార్థులే ఈ వేళ చాలా అరుదు. సంగీతాభ్యాసం చేసే రోజుల్లో శ్రీపాద పినాకపాణి ఎందరినో ఆశ్రయించి కొన్ని కీర్తనలు పాఠం చేశారు. సంగీతం కోసమే సంగీతం నేర్చుకుని, ఉపాసనా మార్గంలో సాధన చేసి, స్వాధీనం చేసుకుని ఆత్మానంద ప్రాప్తికోసం తహతహలాడే అలాటి సద్గురువులకు కీర్తికండూతి ఉండదు. సత్కారాలు సన్మానాలు అక్కరలేదు. ధనకాంక్షతో కనిపించి నమస్కరించిన వారందరినీ రమ్మని పిలిచి పాఠాలు చెప్పరు.

అర్హులైన వారికి, కష్టమైనా యిష్టంగా చెప్పవలసినదంతా చెప్పేస్తారు. శ్రద్ధాభక్తులతో నేర్చుకుని, అలాటి సద్గురువుల ఆశ్రయం పొందిన అదృష్టవంతులైన శిష్యులు మరో పదిమందిని తయారు చేసి, చరితార్థులౌతారు. దీనికి సాక్షులు మునుగంటి వెంకట్రావు పంతులు వంటి సద్గురువులే.

★ ★ ★

సుధా తరంగమ్

# మన చక్కని చిక్కని కర్ణాటక సంగీతం



- మోదుమూడి సుధాకర్
9885183988. విజయవాడ

కర్ణాటక సంగీతం, ప్రపంచ సంగీత రీతులన్నింటిలోకీ విశిష్టతను పొందటానికి, సంగీత రచనలు ఒక ప్రధాన కారణము. వాటిని రూపొందించిన వాగ్గేయకారులు మనకు సదా స్మరణీయులు.

సంగీత రచనలను రెండు విభాగాలుగా చెప్పుకోవచ్చు. 1.అభ్యాస రచనలు, 2.సభా గాన రచనలు.

అభ్యాస రచనలు అంటే,విద్యార్థులు తమ ఇళ్ళలో సాధనచేసుకోవలసినవి. సభా గాన రచనలు అంటే,ఒక స్థాయికి చేరుకొన్న కళాకారులు, సభలలో గానం చేయదగినవి..

1. అభ్యాస రచనలు : సరళీవరుసలు,జంట వరుసలు,దాటు వరుసలు, స్థాయి వరుసలు, గీతములు, శూళాదులు, చిట్ట తానములు,స్వర పల్లవులు, స్వర జతులు,వర్ణములు...మొదలైనవి.

**సరళీ వరుసలు**

ఆరోహణ, అవరోహణ తో ప్రారంభించి, సప్త స్వరాలను వివిధరకాలుగా అమర్చి, పాడే అభ్యాసం

**జంట స్వరాలు**

ప్రతి స్వరాన్ని రెండు సార్లు పలుకుతూ స్ఫురిత గమకంతో చేసే స్వర అభ్యాసం

**దాటు స్వరాలు**

స్వరాల క్రమంలో ఒకటి లేదా అంతకన్నా ఎక్కువగా వదలి, దాటుతూ చేసే అభ్యాసం

**స్థాయి వరుసలు**

స్వరాలను మంద్ర, మధ్యమ, తార స్థాయిలలో పాడే అభ్యాసం

(పైన తెలిపిన అభ్యాస రచనలను 'కర్ణాటక సంగీత పితామహులు' పురందరదసులవారు మాయామాళవగౌళ రాగంలో రూపొందించారు).

**గీతములు**

గీతములు సులభతరమైన సంగీత రచనలు. సరళీవరుసల నుండి స్థాయి వరుసల వరకూ ధాతు(స్వర) సాధన చేసిన సంగీత విద్యార్థికి, మాతు(సాహిత్యం) పరిచయం, గీతాల నుండే ప్రారంభమౌతుంది. వీటిలో పల్లవి, అనుపల్లవి, చరణం వంటి విభాగాలు ఉండవు. సంగతులుండవు. క్రియకు ఒక అక్షరం చొప్పున గమనముంటుంది.

గీతాలలో విఘ్నేశ్వర స్తుతితో కూడుకొన్న వాటికి 'పిళ్ళారి గీతాలు' అని పేరు. పురందరదాసులవారు ఇవి రచించారు.

రాగలక్షణాలను వివరించే గీతాలను లక్షణ గీతాలని, నాట, గౌళ, ఆరభి, వరాళి, శ్రీరాగము–ఈ

అయిదు రాగాలలో రచింపబడిన గీతాలను 'ఘనరాగ గీతాలని', వివిధ రాగాలు ఒకే గీతములో ప్రయోగించబడితే, వాటిని 'రాగమాలికా గీతాలని' పిలవటం కద్దు.

వెయ్యికి పైగా గీతాలను రచించిన కారణంగా, పైడాల గురుమూర్తి శాస్త్రిగారిని,' వేయి గీతాల శాస్త్రి' అని పిలిచేవారు.

**సూళాదులు**

గీతాలను పోలిన రచనలు ఇవి. పురందరదాసు, అన్నమయ్య వీటిని రచించారు. వీటిలో తాళమాలికలు కూడా ఉన్నవి.

**చిట్ట తానములు**

మనోధర్మ అంశమైన తాన సాధనకు ఉపకరించే రచనలు. వీణవాదకులు, ఈరచనలను వివిధ రాగాలలో సాధన చేస్తే, తానములోని మీటు చక్కగా పలుకుతుంది. వీటికే 'కటకములు' అనికూడా పేరు ఉంది. ఘనరాగ కటకాలు కూడా వాగ్గేయకారులచే రచింపబడ్డాయి.

**స్వరపల్లవులు**

వీటికే 'జతి స్వరములు' అని పేరు కూడా ఉంది. వీటిలో స్వరము మాత్రమే ఉంటుంది.పల్లవి, చరణాలను కలిగిన రచనలివి. సాధారణంగా ఇవి, క్రియకు ఒక అక్షర కాలము కాక, నాలుగు అక్షరకాలము నడుస్తాయి. కాల,పైకాలాలు పాడుకొనేందుకు అనుకూలంగా ఉంటాయి.

**స్వరజతులు**

వీటిలో పల్లవి, చరణాలు ఉంటాయి. మంచి రాగ, సాహిత్య భావములతో కూడి, కచేరీలలో సైతం పాడుకొనేందుకు అనుకూలంగా ఉంటాయి. సంగీత త్రిమూర్తులలో ఒకరైన శ్యామశాస్త్రిగారు స్వరజతులు వ్రాసినవారిలో ప్రసిద్ధులు.

**వర్ణములు**

సంగీత విద్యార్థికి, రాగాలను గురించిన సంపూర్ణ అవగాహన కల్పించేది వర్ణము. పల్లవి, అనుపల్లవి, చరణము, చిట్టస్వరాలతో కూడుకొని ఉంటుంది. తాన సాధనకు ఎంతో దోహదకారి కనుక, దీనిని 'తాన వర్ణం' అని పిలుస్తారు. ఆది, అట, ఝంపె తాళాలలో వర్ణరచన ఎక్కువగా జరిగింది. సంగతులతో కూడి,స్వర సాహిత్య సహితంగా ఉండే వర్ణాలను 'పద వర్ణాలు' అంటారు. మనోధర్మ సంగీత అంశాలైన రాగాలాపన, స్వర ప్రస్థారం, నెరవు, తానం, పల్లవి-వీటిని సాధించాలంటే, సంగీత విద్యార్థికి వర్ణ సాధన తప్పనిసరి. అభ్యాస రచనలైనప్పటికీ, కచేరీలో మొదటి అంశంగా వర్ణం తీసుకుంటే, గాయకుని గాత్రం సానుకూలమౌతుంది. వాదకునికి చేయి స్వాధీనమౌతుంది. స్వరజతులు, వర్ణాలు నృత్య ప్రదర్శనకు కూడా ఉపయుక్తంగా ఉంటాయి.

2. ఇక, సభాగాన రచనల విషయానికొస్తే.. అవి అసంఖ్యాకాలు. వాటిలో కొన్నింటిని గురించి క్లుప్తంగా తెలుసుకుందాం...

**కృతులు**

రాగప్రధానమైన రచనలు. అనేక సంగతులతో కూడుకొని, పల్లవి, అనుపల్లవి, చరణము/లు, అనుబంధము, వంటి విభాగాలతో ఉంటాయి. కొన్ని కృతులలో చిట్టస్వరాలు, సోల్కట్టు స్వరాలు(మృదంగ జతులతో కూడుకొన్నవి) కూడా కనిపిస్తాయి. సంగీత

త్రిమూర్తులైన త్యాగరాజు, శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులు కృతులు వ్రాసిన తొలి వాగ్గేయకారులు. వారు ముప్వురూ తమ కృతుల ద్వారా భగవదాకృతిని, తాము దర్శించి, మనకు దర్శింపచేశారు. వారి స్ఫూర్తితో ఎందరో మహానుభావులు కృతులు రచించారు.

**కీర్తనలు**

భక్తి ప్రధానమై, సంగీత జ్ఞానం పరిమితంగా ఉన్నవారు సైతం పాడుకోగలిగిన రచనలివి. సాధారణంగా కీర్తనలు పల్లవి, చరణాలను కలిగి ఉంటాయి. చరణలన్నీ ఒకే విధంగా పాడుకొనదగినవిగా ఉంటాయి. అన్నమయ్య తొలి సంకీర్తనాచార్యుడు.

**పదాలు**

శృంగార రస ప్రధాన రచనలు. రాగ నిధులైన పదాలు, విలంబ గతిలో పాడుకోవటానికి, నృత్యాభినయానికి కూడా అనుకూలంగా ఉంటాయి. క్షేత్రయ్య రచించిన పదాలు బహుళ ప్రసిద్ధాలు.

**జావళీలు**

పదాల వలెనే ఉండే, మరింత సులభ తరమైన శృంగార రచనలు. పల్లవి, అనుపల్లవి, చరణాలను కలిగియుంటాయి.

పదాలు, జావళీలు తెలుగువారి సొత్తు.

**తిల్లానాలు**

మృదంగ తాళ జతులతో నడిచే అద్భుత రచనలు. పల్లవి, అనుపల్లవి, చరణం, చరణానుపల్లవులతో కూడి, చరణములో సాహిత్యాన్ని కలిగి ఉంటాయి. నృత్యానికెంతో అనుకూలమైనవి.

**శబ్దములు**

నాట్య ప్రదర్శనకు మాత్రమే అనువైన రచనలు. సాహిత్యం, మృదంగ శబ్దం కలసి ఉండే రచనలు.

**దరువులు**

పదమును పోలియుండే నాట్య రచనలు. గేయ నాటకాలలో పాత్రధారి ప్రవేశిస్తున్నప్పుడు పాడేది ప్రవేశ దరువు, ఇద్దరు పాత్రధారుల సంభాషణను తెలిపేది సంవాద దరువు, పాత్ర స్వగతాన్ని తెలిపేది స్వగత దరువు, జతులతో ఉండేది జక్కిణ దరువు.. ఈ విధంగా అనేక రకాల దరువులున్నాయి.

**సంచారి**

రాగలక్షణాన్ని తెలిపే గీతము వంటి రచన.

**రాగమాలిక**

3 గాని, అంతకన్నా ఎక్కువ గాని, రాగాలతో కూడుకొన్న రచన.

**తాళమాలిక**

3 గాని, అంతకన్నా ఎక్కువ గాని, తాళాలతో కూడుకొన్న రచన.

**రాగతాళ మాలిక**

3 గాని, అంతకన్నా ఎక్కువ గాని, రాగ, తాళాల మాలికా రచన

**గుచ్ఛ కృతులు**

ఒకే రచనావస్తువుపై చేయబడిన సామూహిక కృతులు. ఉదాహరణ: దీక్షితుల నవావరణ కృతులు, త్యాగరాజ పంచరత్న కృతులు.

**అష్టపదులు**

జయదేవకవి రచించిన 'గీతగోవింద' కావ్యములోని ఎనిమిది చరణములను కలిగిన సంస్కృత రచనలు.

**తరంగాలు**

శివనారాయణతీర్థులు రచించిన 'శ్రీకృష్ణ లీలాతరంగిణి' లోని సంస్కృత రచనలు.

**ఆధ్యాత్మ రామాయణ కీర్తనలు**

మునిపల్లె సుబ్రహ్మణ్యకవి రచించిన తెలుగు ఆధ్యాత్మ రామాయణ కీర్తనలు. శివుడు పార్వతికి చెప్పినట్లు రచింపబడినాయి.

**తిరుప్పుగళ్**

తమిళ వాగ్గేయకారులైన అరుణగిరినాథర్ వంటివారు రచించిన భక్తి రచనలు.

**తేవారం**

అష్టపదుల కంటె పూర్వపు తమిళ రచనలు. తిరునావుక్కరసు స్వామి, సుందరమూర్తి స్వామి వంటివారు వ్రాసిన రచనలు.

దేవరనామాలు/దాసర పదగళు

కన్నడ భాషలో పురందరదాసు రచించిన భక్తి కీర్తనలు.

**భజన్**

హిందీ భాషలో రచింపబడిన భక్తి గీతాలు. కర్ణాటక సంగీత వాగ్గేయకారులలో స్వాతి తిరునాళ్ మహారాజు భజన్స్ రచించారు.

# సంకీర్తన సంగీతము

**– సత్తిరాజు వేణుమాధవ్**

కలియుగ ప్రత్యక్షదైవమైన వేంకటేశ్వరునికి 32,000 సంకీర్తనా కుసుమములను "భక్తి" అను దారముతో అనుసంధానించి కైంకర్యము గావించిన 'పరమ భాగవతోత్తముడు', 'తొలి తెలుగు వాగ్గేయకారుడు' శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్యులు.

అన్నమాచార్యుల కాలమునాటికి తెలుగులో పద్యరచనకు అధిక ప్రాధాన్యత కలదు. ఛందోబద్ధమైన పద్యరచన చేయువారినే ఉత్తమ కవులుగా, పండితులుగా గుర్తించెడివారు. అప్పటికే కవిత్రయము మహాభారతమును తెలిగించియున్నారు. కానీ ఈ పద్యరచనలు – పండితభాష సామాన్యులకు చేరువకాకుండినవి. వేదవేదాంగ, ఉపనిషత్, – పురాణ, ఇతిహాస, కావ్యాలలో గల ధర్మసూక్ష్మములను, సామాన్య ప్రజలకు చేరువచేయటం కోసం భగవంతుడు సృష్టించిన వాగ్గేయకారుడు అన్నమయ్య. వారి ద్వారానే 'పదము' అన్న రచన రూపుదిద్దుకున్నది. సంస్కృతాంధ్ర భాషలలో అద్వితీయ ప్రతిభ కల్గి, సంస్కృతమున 'సంకీర్తన లక్షణం', తెలుగులో 'శ్రీవేంకటాచలమహాత్మ్యము', 'శ్రీ వేంకటేశ్వర

శతకము' ఆదిగా 12 శతకములు (ఛందోబద్ధమైన పద్యరచనలు) చేసినప్పటికీ, సామాన్యులకొరకు వ్యావహారిక భాషలో (అప్పటి వాడుకభాష) పదరచనా ప్రక్రియకే ప్రాముఖ్యతనిచ్చి, 'పదకవితా పితామహుడు' గా కీర్తింపబడుతున్నాడు.

అన్నమయ్య రచనలు సాహిత్యప్రధానములై భావగర్భితములై భక్తి, శృంగార, వైరాగ్య మార్గాలలో కొనసాగినవి. అన్నమయ్య, పెదతిరుమలయ్య (కొడుకు), చినతిరుమలయ్య (మనుమడు) రచనలు కలుపుకొని మొత్తము 34,000 కాగా, ప్రస్తుతము లభ్యమవుతున్నవి రమారమి 14,000 గా, వీటిలో అన్నమయ్యవారి రచనలు 12,000 కాగా, మిగిలినవి కొడుకు, మనుమడు రచించినవిగను పెద్దలు నిర్ణయించినారు. ఈ రచనలను ముందు తరాలకు అందించుటలో వారి కుమారుడు, మనుమడు ఎంతో శ్రమించి సంకీర్తనలను రాగిరేకులపై చెక్కించి, కొందరికి నేర్పించి ప్రతిదినము స్వామిసన్నిధిలో వారిచేత పాడించి, స్వామివారి ప్రసాదమును వారికి ఇచ్చు ఒక సత్సంప్రదాయమును నెలకొల్పి, దానిని కొనసాగించుటకు వీలుగా ఒక వ్యవస్థను ప్రారంభించి, సంకీర్తనలను స్వామిసేవలో ఒక భాగంగా చేర్చినారు. దీనిని బట్టి చూస్తే 1978 లో 'అన్నమాచార్య ప్రాజెక్ట్' ఏర్పడినప్పటికీ దానికి బాటలు అన్నమయ్య వంశమువారే వేసినట్లు తెలుస్తోంది.

ప్రచారము చేయుటకొరకు సంగీతమును ఆలంబనగా అన్నమయ్యగారు పదసాహిత్యమును విస్తృతముగా చేసికొనినారు. త్యాగయ్యగారు సంగీతంలో గల ఉన్నత విలువలను ప్రచారము చేయుటకొరకు సాహిత్యమును ఆలంబనగా చేసికొనినారు. శ్రీ రాళ్ళపల్లివారి మాటలలో "అన్నమయ్య కవిగాయకుడే గానీ, త్యాగరాజువలె గాయకకవి కాదు". ఈ కారణముచేతనేమో ప్రస్తుతము మనకు లభ్యమవుతున్న 14,000 సంకీర్తనలకుగాను కేవలము 95 రాగములు మాత్రమే కనిపించుచున్నవి. రాగిరేకులపై రాగము, బహు అరుదుగా తాళముల వివరములు లభ్యమగుచున్నవి. కానీ స్వరలిపి లభ్యమగుటలేదు. రాబోవు తరాల వారికి ఆ సంకీర్తనలను స్వరపరచి పాడగలిగే భాగ్యమునందించి, వారి జన్మకు సార్థక్యమునందించుట ఆ శ్రీనివాసుని సంకల్పమయి వుండవచ్చు. అందువలననే స్వరలిపి లభ్యములో లేదేమో. సంకీర్తనలకు స్వరరచన చేసి జన్మ సార్థక్యము చేసుకునే అవకాశమును శ్రీ వేంకటేశ్వరుడు అసామాన్య ప్రతిభ గలిగిన వారినుండి అతి సామాన్యుడనైన నావంటివారి వరకు ఎందరికో కలిగించినాడు. 2010లో 'సుజనరంజని' వారు విడుదల చేసిన 'అన్నమయ్య పదమందాకిని' (108 సంకీర్తనల పుస్తకము, ఆడియో సి.డి.) లోని సంకీర్తనలు స్వరపరచి పాడగలిగే భాగ్యము నాకు కలుగుట ఆ శ్రీనివాసుని కృపయే.

అన్నమయ్య వారు సంకీర్తన, సంగీతము ఈ రెంటి లక్షణములు క్షుణ్ణముగా తెలిసిన వారగుటచే వాటి స్వరరచన శాస్త్రబద్ధమై వుండవలెనను వాదన ఒకవైపు, ఇవి సాహిత్య ప్రధానములగుటచే శాస్త్రముతో పనిలేదు భావప్రకటనకు మాత్రము ప్రాముఖ్యతనిస్తూ ఎటువంటి బాణీలైనా సమకూర్చవచ్చుననే వాదన

మరొకవైపు ఇప్పటికీ కొనసాగుతూనే వుంది. వీటిలో మొదటి వాదనకు ప్రాధాన్యతనిస్తూ సంగీత సాహిత్యములను సమపాళ్ళలో రంగరించి చేసిన బాణీలకు విశేష ఆదరణ వున్నదనుట నిర్వివాదాంశము. ప్రస్తుతము ప్రచారములో వున్న సంకీర్తనలలో ఎక్కువ శాతము ఇటువంటివే.

భారతీయ సాంప్రదాయము కట్టుబాట్లు, ఆచార వ్యవహారములు, చదువు సంస్కారము, సంస్కృతి కళలు, మన దినచర్యతో సహా ప్రతీదీ ధర్మముతో ముడిపడి భగవంతుని తెలుసుకునే మార్గమును చూపుతున్నాయనుట అతిశయోక్తి కాదు. మోక్ష సాధనకొరకు శివ పురాణములో 3 మార్గములను, భాగవతంలో 9 మార్గములను సూచించినారు. రెంటిలోనూ "శ్రవణం, కీర్తనం, స్మరణం" ఈ మూడూ చెప్పబడినవి. కలియుగములో నామస్మరణే ముఖ్యమైనది. వాగ్గేయకారులందరూ వారి రచనల ద్వారా భగవంతుణ్ణి స్మరించి తాము తరించటమే కాక విన్న వారిని కూడా తరింపజేసినారు. కావున శాస్త్రీయసంగీతము మోక్షమునకు అతి చేరువలోనున్న మార్గమనుట నిస్సందేహము. నాదబ్రహ్మయైన త్యాగబ్రహ్మ ఈ మార్గములోనే సిద్ధి పొందినారు. "స్వరరాగ సుధారసయుత భక్తి స్వర్గాపవర్గమురా....... మూలాధారజ నాదమెరుగుటే ముదమగు మోక్షమురా", "శోభిల్లు సప్తస్వర సుందరుల భజింపవే మనసా", "ప్రాణానల సంయోగమువల్ల ప్రణవనాదము సప్తస్వరములై బరగ" మొదలైన ఎన్నో కృతులలో నాదోత్పత్తి, ప్రయాణము, బహిర్ముఖత ఇవన్నియు వివరించి, నాదోపాసన ద్వారా మోక్షమందిన నాదయోగి, శాస్త్రీయ సంగీతము యొక్క ప్రాముఖ్యతను జగద్విఖ్యాతము చేసిన జగద్గురువులు శ్రీ త్యాగరాజస్వామి.

శాస్త్రీయ సంగీతమును అభ్యసించిన ప్రతివారూ నాదయోగులవ్వగలరా? అంటే, ప్రతిరోజు ఒక నిర్ణీత సమయంలో మాత్రమే భగవదారాధన చేసేవారు ఋషులు అవ్వగలరా? ఇదెంతో అదీ అంతే. భగవద్దత్తమైన ఈ విద్యను పొందిన కళాకారులు, విద్వాంసులు వివిధ ఆకర్షణలకు లోనై ఏ విధముగా భగవంతుడిచ్చిన అవకాశమును చేజార్చుకుంటున్నారన్నది కూడా త్యాగయ్య గారి కృతులలోనే చూద్దాం. "అత్తమీద కనులాసకు దాసులై సత్తభాగవత వేషులైరి దుత్తపాలరుచి తెలియు సామ్యమే ధురీణుడౌ త్యాగరాజనుతుడు ఎంతముద్దో ఎంతసొగసో", "వేగలేచి నీటమునిగి భూతిబూసి వెళ్ళనెంచి వెలికి శ్లాఘనీయులై బాగ పైకమార్జనలోలురైరేగాని త్యాగరాజనుత తెలియలేరు రామ భక్తిమార్గమును". సంగీతజ్ఞానము కలిగియుండికూడా మోక్షసాధనకు దూరమౌతున్నారే! ఇక ఆ అవకాశము లేనటువంటి వారి స్థితి యేమిటని త్యాగయ్యగారు రామునితో మొరపెట్టుకున్నారు "సాక్షాత్కార నీ సద్భక్తి సంగీత జ్ఞాన విహీనులకు మోక్షము గలదా". ఇంతగా సమాజమును వ్యక్తులను చదివియుండటం వల్లనేమో ముందటి తరాలవారు నాదసాధన చేయగలరో లేరో అని ఆ మర్మములన్నీ తన సాహిత్యముద్వారా తెల్పుతూ ఆయా కృతుల సాధనలోనైనా సరే నాదసాధన మార్గమును కొంతవరకైనా చేరుకుంటారనే వుద్దేశ్యముతో

ఆ మహానుభావుడు శాస్త్రమును విశదపరచి మనకందించినాడు. 'సనాతనధర్మమునకు ఆదిశంకరు లెటువంటివారో సంగీతధర్మమునకు త్యాగరాజస్వామి అటువంటివారు'.

ఉన్నత విలువలు కలిగిన ఇటువంటి శాస్త్రీయ సంగీతమునే సంకీర్తనా స్వర రచనకు వుపయోగించినచో ఒక క్రమశిక్షణ కలిగిన సంగీత పద్ధతి అందరికీ అలవడుతుంది. అందుకే భగవంతుడు నాకిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవటానికి అన్నమయ్య పదమందాకిని లోని 108. సంకీర్తనలకు శాస్త్రీయ సంగీత బాణీలనే ఉపయోగించటం జరిగింది. ఒకే కథావస్తువును పలుభావాలలో వ్యక్తపరచుట అన్నమయ్య వారి ప్రత్యేకత. కావున అన్ని సంకీర్తనలకు పూర్తి గమకపుష్టి కలిగిన బాణీలను సమకూర్చలేము.

ఉదాహరణకు....

భక్తి : అతివరో శ్రీవేంకటగిరి (సంపు. 26, పీఠిక / అన్నమయ్య పదమందాకిని సంకీ.1)

తినరాని కొనరాని దేవలోకపు పండు (సంపు. 7 సం. 284 / అన్నమయ్య పదమందాకిని సంకీ. 58)

కొంగుపట్టకంత నీవు గొల్లబోయిడా (సంపు. 22, సంకీ. 98/ అన్నమయ్య పదమందాకిని సంకీ. 45)

శృంగారం: ఇంకానేల చలము (సంపు. 25, సంకీ. 162 / అన్నమయ్య పదమందాకిని సంకీ. 13)

తానేడో మనసేడో తత్తరములవి యేడో (సంపు. 20, సంకీ. 121 / అన్నమయ్య పదమందాకిని సంకీ. 57)

తిరుమలయ్య విందు మంచిదే (సంపు 26, (పీఠిక) పుట. 12,13 / అన్నమయ్య పదమందాకిని సంకీ. 59)

వైరాగ్యం: ఒకటి సుజ్ఞానము ఒకటి అజ్ఞానము (సంపు. 2, సంకీ. 357 / అన్నమయ్య పదమందాకిని సంకీ. 1)

ఎన్ని బాధలు బెట్టి (సంపు. 1, సంకీ. 284 / అన్నమయ్య పదమందాకిని సంకీ. 30)

పంచేంద్రియమనే (సంపు. 3, సంకీ. 324 / అన్నమయ్య పదమందాకిని సంకీ. 75)

(పూర్తిసాహిత్యము కొరకు అన్నమయ్య పదమందాకిని చూడవలసినదిగా మనవి)

పైన ఉదహరించిన సంకీర్తనలలో ప్రతి విభాగములో మొట్టమొదటి సంకీర్తన పూర్తి గమకపుష్టితోనూ, రెండవ సంకీర్తన గమకము యొక్క తీవ్రతను కొంచెము తగ్గించి, మూడవ సంకీర్తన జానపద శైలిలో నుండుటవలన అవసరమైనప్పుడు మాత్రమే గమకమునుపయోగిస్తూ, పాడతగిన సంకీర్తనలు. మూడింటినీ శాస్త్రీయ సంగీతమునాధారము చేసికొని స్వరపరచవచ్చును. పాడవచ్చును కూడా. శాస్త్రీయ

సంగీతమునాధారము చేసుకొని స్వరపరచుట వల్ల సాహిత్యభావమును పూర్తిగా ఆవిష్కరించలేము అని అనుకోవటం కేవలం అపోహ మాత్రమే. త్యాగరాజస్వామి కృతులు ఖచ్చితమైన శాస్త్రనిబద్ధత గలవి అనునది నిర్వివాదాంశము. ఎవరు పాడినా అదే స్వరలిపిననుసరించి పాడతారు, పాడాలి కూడా. కానీ కొందరు పాడితే రాగము వినిపిస్తుంది కొందరు పాడితే రాగముతో పాటు సాహిత్యము దాని భావము కూడా వినిపిస్తుంది. వ్యత్యాసమెక్కడుందీ అంటే ఒక స్వరమునుండి మరొక స్వరమునకు ప్రయాణం చేసేటప్పుడు మధ్యనున్న కాలప్రమాణములో పలికే అనుస్వరము, దానిననుసరించి పాడే గమకము మీద ఆధారపడి వుంది.

అన్నమయ్య రచనలలో పదాల వాడుక ఎక్కువ. అందువల్ల ఒక ఆవర్తములో అక్షరముల సంఖ్య ఎక్కువగా వుంటుంది ప్రతి అక్షరమునకు ఒక స్వరము చొప్పున రావలసిన అవసరమేర్పడి, స్వరమునకూ స్వరమునకూ మధ్య నిడివి తగ్గుతుంది దానితో గమకముయొక్క తీవ్రత కూడా తగ్గుతుంది. కావున త్యాగయ్య గారి కృతులలో వలె రాగభావమును ఆవిష్కరించే అవకాశము తక్కువ, కానీ రాగస్వరూపమును చూపవచ్చును.

సంకీర్తనల్లోని విషయం భక్తియైనా, శృంగారమైనా, వ్యక్తిత్వ వికాసమైనా, సమాజోద్ధరణైనా ప్రతీదీ వేంకటేశ్వరునకే అంకితమిచ్చి, మకుటంగా స్వామినామమే వుపయోగించినాడు. అన్నమయ్య. విషయమేదైనప్పటికీ అంతర్లీనంగా ప్రవహించే భావం, అన్ని సంకీర్తనలలోనూ ఒకటే అదియే 'భక్తి'. భక్తిభావాన్ని ప్రస్ఫుటంగా ప్రకటన చేయగలిగేది శాస్త్రీయ సంగీతమే. శాస్త్రీయ సంగీతమునాధారముగా చేసుకొని సినిమాలలో పలు భక్తిగీతాలు వచ్చినవి. వాటిలో కొన్ని ఇప్పటికీ, ఎప్పటికీ నిలిచిపోయే రీతిలో వున్నవనుట సత్యము. కానీ అవి శాస్త్ర "ఆధారముగా" చేయబడినవే కానీ శాస్త్రీయ సంగీతము కాదని గమనింపవలెను. ఇటువంటి పాటలు కేవలం ఒక భాషావర్గమునకు మాత్రమే పరిమితమై వుంటాయి. ఏ విధముగానంటే తెలుగేతరుల వద్ద ఒకటి, రెండు కంటే ఎక్కువ లలిత / సినీగీతాలు పాడలేము. వారు వెంటనే "ఏమండీ మా భాషలో పాటలు తెలిస్తే పాడండీ" అని అడుగుతారు. కానీ శాస్త్రీయ సంగీత కచేరీ ఎక్కడైనా సరే ఎన్ని త్యాగరాజస్వామి కీర్తనలు పాడినా సరే తెలుగు రానివారుకూడా తలలూచుతూ వింటారు. ఇక్కడ భాషతో సంబంధం లేదు వారు సంగీతాన్ని విని ఆనందిస్తారు ఎందుకంటే అది శాస్త్రీయ సంగీతం కనుక. శాస్త్రీయ సంగీతమునకు పరిమితులున్నవి. "ఫలానా రాగములో ఫలానా స్వరములు ఫలానా వరుస క్రమములోనే రావాలి" లాంటివి. కానీ ఎల్లలు లేవు. ఎంత దూరమైనా వెళ్ళగలదు. ఏ భాష వారినైనా పలుకరించగలదు, మురిపించగలదు, మరపించగలదు. కానీ లలిత, సినీ గీతాల విషయము వేరు. వీటికి పరిమితులు లేవు. కానీ ఎల్లలున్నవి. ఇవి పూర్తిగా భాషమీద ఆధారపడినవి భాషతెలియని వారిని అంతగా రంజింపజేయగలవా అన్నది ప్రశ్నార్థకమే.

సంకీర్తనా స్వరరచనకు భగవంతుడు నన్ను నియమించినది మొదలు సంగీత సాహిత్యములలో

నిష్ణాతులు, కేవలం సంగీత ప్రేమికులు, కేవలం సాహిత్యపిపాసులు, సామాన్య శ్రోతలు, సంగీత సాహిత్యములలో పరిణతి చెందిన శ్రోతలు ఇటువంటి విభిన్న దృక్కోణములు, మనస్తత్వములు గలిగిన వారి వ్యాసములు చదువుట, ఉపన్యాసములను వినుట ద్వారా సంకీర్తనా స్వరరచనకు శాస్త్రీయ సంగీతమే ఉపయుక్తమైనదనీ, అదియునూ సాహిత్యముయొక్క సొబగును హరించనిదిగా వుండవలెననీ, భక్తి భావము చెడనటువంటిదై వుండవలెననీ, అటువంటి సంకీర్తనలు ఎక్కువకాలము నిలిచి విస్తృత ప్రచారమును పొందగలవనీ, ఇటువంటి విలువైన విషయములెన్నో యెరుకపరచిన శ్రీనివాసునికి శతకోటి వందనములు.

పెద్దల వ్యాసములు చదివి, ఉపన్యాసములు విని, నా మనోధర్మమును కూడా జోడించి శ్రీనివాసానుగ్రహముతో ఈ వ్యాసమందు విశదపరచినాను. ఇది ఈ ప్రకారముగనే వుండాలి అని శాసించగలిగిన అర్హత కలవాడను కాను. సంకీర్తనలు భగవత్ స్వరూపములు. వాటిని క్షుణ్ణముగా చదివి కొంతవరకైనా అర్థము చేసుకొనిన తరువాత కానీ, ఒక భావనకు రాలేము (కొంతవరకు అనుటలో నా భావము అన్నమయ్య సాహిత్యమును పూర్తిగా అర్థము చేసుకున్నవారు గలరా యనునది ఇప్పటికీ సందేహమే. ఈ సందేహము నాదికాదు సాహిత్యమును ఔపోసన పట్టిన మహామహులు వ్యక్తపరచినది). అలా కలిగిన భావము నుండే సాహిత్యమునకు తగిన సంగీతం ఉద్భవిస్తుంది. సంకీర్తనపై స్వరకర్తకు గల భావనేమిటో దానికి సమకూర్చబడిన సంగీతమే విశదపరుస్తుంది. అది సరియైనదా కాదా అనుదానికి న్యాయనిర్ణేత ఆ సంకీర్తనే. భగవంతునివలె సంకీర్తనలు కూడా "యద్భావం తద్భవతి".

అన్నమయ్య సంకీర్తనలు ధర్మప్రబోధకాలు. నిత్య జీవితంలో ఆచరించవలసిన ఎన్నో విషయములను తన సంకీర్తనల ద్వారా ప్రజలకందించి అత్యుత్తమమైన జనజీవన విధానాన్ని మనకు తెలియపరుస్తూ, తన సాహిత్యము ద్వారా సమాజమును ఉద్ధరించిన సంఘసంస్కర్త అన్నమయ్య ఆ మహానుభావుడి సంకీర్తనలను ముందు తరాలకు అందించ వలసిన కర్తవ్యము మనందరిదీ. పూర్తి గమకపుష్టి కలిగిన ఒక సంకీర్తనను కచేరీలో ప్రధాన లేక ఉపప్రధాన అంశముగా, కొంచెము గమకపుష్టి కలిగిన ఒక సంకీర్తనను కచేరి మధ్యలో, జానపద లేదా హిందూస్థానీ సంగీత సాంప్రదాయములలో స్వరరచన గావింపబడ్డ ఒక సంకీర్తనను కచేరీ చివరలో విధిగా పాడటమును అలవాటుచేసుకొనిన యెడల, తరువాతి తరము వారికి ఇదొక సంప్రదాయమై అన్నమయ్య సాహిత్యము అజరామరమై నిలిచిపోతుంది. ఇప్పుడిప్పుడే ఇటువంటి సాంప్రదాయము తొంగి చూస్తున్నది. ఇది దినదిన ప్రవర్ధమానమై ఆ మహనీయుని పదాలు దిద్దిగంతాలు వ్యాపింపజేయవలెననీ, దానికి శ్రీవేంకటేశ్వర, అన్నమయ్యల అనుగ్రహము మనందరిపైనా పరిపూర్ణముగా వుండవలెననీ ప్రార్థిస్తున్నాను.

ఉపయుక్త గ్రంథము : అన్నమయ్య పదమందాకిని, ప్రచురణ సుజనరంజని, 2010

# సప్తగిరి సంగీత సప్తాహం

## ఒక చారిత్రక ఘట్టం జూన్ 16 – 23, 2024

– పున్నమరాజు మురళీకృష్ణ

ఇదోక అసాధారణ ఘట్టం!! సంగీత చరిత్రలో ఇదొక మైలురాయి!! ఒక అతి కష్టతరమైన సాహసం!!

కానీ, అది సాధ్యమైంది. కర్ణాటక శాస్త్రీయ సంగీత చరిత్రపుటల్లో ఒక పేజీని నింపుకుంది!!

ఏడు పగళ్ళు ఏడు రాత్రుళ్ళు.... నిరంతరాయ సంగీత మహా ప్రవాహం! వచ్చే కళాకారులు వస్తూనే ఉన్నారు. తిరిగి వెళ్ళే కళాకారులు వెళ్తూనే ఉన్నారు. వీరందరికీ, వసతి, రవాణా తదితర సౌకర్యాలు ఎప్పటికప్పుడు వాటికవే అందుతున్నాయి. 24 గంటలూ... కాఫీ, టీ, బాదంపాలు అందుతూనే ఉన్నాయి. సమయపాలన ఎప్పుడూ తప్పలేదు.

ప్రతీ ప్రోగ్రాం చివర, ప్రారంభంలో ఎనౌన్సుమెంట్లూ, మెమెంటోలూ, శాలువాలూ, స్వర్ణ వర్ణ పుష్పాలూ, శ్రీవారి ప్రసాదాలూ కళాకారులకు సాధ్యమైనంత వరకూ నేనే అందించాను!! ఈ ఏడు రోజులూ పడుకోలేదు. అస్సలు ఇంటికే వెళ్ళలేదు! మా ఆశ్రమానికీ వెళ్ళలేదు! ఒక అదృశ్య శక్తి అని! కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వర స్వామివారే ఆ అదృశ్యశక్తి అని నమ్మకం. వారు తలుచుకుంటే కానిదేముంటుంది??

ఎప్పుడు ఆలోచన మొలకెత్తిందో తెలియదు కానీ, ఏదో ఒక అతీత శక్తి ఈ మహోన్నత యజ్ఞానికి నన్ను కర్తగా ఎంచుకుందన్నది మాత్రం నిజం. ఆలోచన రాగానే, నాకు సన్నిహితులైన ఇద్దరు ముగ్గురికి చెప్పి చూశాను. ఇంత పెద్ద కార్యక్రమం నిర్వహణ చాలా కష్టం. ఆర్థిక భారంతో కూడుకున్నది. ఏదో అదృశ్య శక్తి నన్ను ప్రేరేపిస్తోందని. అది నన్ను నిద్రపోనివ్వలేదు. కంప్యూటర్ ముందు కూర్చుని ప్రణాళికా రచన ప్రారంభించాను. అంతే!! ఒక రెండు మూడు గంటల్లో మొత్తం కార్యక్రమ బాహ్య రూపకల్పన వచ్చేసింది. మరి డబ్బులు?? ఏమో!! ఒక పెద్ద గాత్రకళాకారుడికి మొదటగా ఫోన్ చేశాను. వారు ఎంతిస్తారు అని అడగకుండా ఓకే చెప్పేశారు. అదే! నాకు మరింత ఊపు కలిగించింది. ఆరోజే సుమారు 30 మందితో మాట్లాడి ఖరారు చేసేశాను. ఇంతకీ ఈ ప్రోగ్రాం ఎక్కడా?? ఎక్కడో తెలియకుండానే కళాకరులందరి నుండి అనుమతి తీసేసుకున్నాను. ఈలోపు ఎన్నికలు వచ్చాయి. మేలో జరపాలనుకున్న కార్యక్రమం జూన్ కి మారింది. వేమన విజ్ఞాన కేంద్రం ఈ మహా సంగీత సంతర్పణకి వేదికగా నిలిచింది.

అతి సామాన్య మృదంగ కళాకారుణ్ణైన నేను అనన్యసామాన్యమైన, మహోత్కృష్టమైన ఇంత పెద్ద కార్యక్రమం చేయగలగడం నిజంగా ఆశ్చర్యమే!

2024 ఫిబ్రవరిలో మదిలో మెదిలిన ఒక ఆలోచన కార్యరూపం దాల్చి, ఘన విజయం సాధించి, సంగీత ప్రియుల, అభిమానుల, కళాకారుల మన్ననలు పొందిందంటే, దాని వెనక ఎంతో మంది సహాయం

ఉంది. మరెంతో మంది తోడ్పాటు వుంది. స్వచ్ఛందంగా నిస్వార్థసేవలందించిన చాలామంది శ్రమ దాగివుంది.

**ఈ సంగీత సప్తాహంలో ప్రత్యేకతలు ఏమిటంటే...**

1. సుమారు 168 గంటల నిర్విరామ సంగీత సుస్వర ప్రవాహం

2. సుమారు 600 మంది వివిధ రంగాలకు చెందిన కళాకారులు ఇందులో పాల్గొన్నారు.

3. ప్రపంచ ప్రఖ్యాత సంగీత విద్వాంసులు ఈ కార్యక్రమంలో పాల్గొని నాద రసానందాన్ని అందించారు. హిందుస్తానీ సంగీత విభాగానికి చెందిన కుమారి లలిత శర్మ (పండిట్ జస్రాజ్‌గారి శిష్యురాలు), శ్రీ జయాతీర్థ్ మెవుండి (శ్రీ భీమ్‌షేన్ జోషిగారి ప్రియశిష్యులు), అనంత్రాజ్ మిస్త్రే వంటి ఉద్దండులు పాల్గొన్నారు.

4. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర ప్రాంతాల నుండే కాకుండా, సింగపూర్, అమెరికా, శ్రీలంక నుండి కూడా సంగీత విద్వాంసులు ఈ కార్యక్రమంలో తమ సంగీత నీరాజనాన్ని అందించారు.

5. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, చెన్నై, బెంగుళూరు నుండి సుమారు 30 మందివరకు శ్రోతలుగా విచ్చేసి, ఏడురోజులూ సంగీత ఆనంద సాగరంలో మునిగి తేలారు.

6. కళాకారులకే కాకుండా శ్రోతలకు కూడా ఉచిత వసతి, భోజన సదుపాయాలను కూడా అందించగలిగాము.

7. సుమారు 22 లక్షల రూపాయల ఖర్చుతో కూడుకున్న ఈ భారీ కార్యక్రమానికి పెద్ద పెద్ద సంస్థలేవీ తోడ్పాటు అందించడానికి ముందుకు రానప్పటికీ, ఎందరో సామాన్య భక్తులు, కళాకారులు ఇతోధికంగా ఆర్థిక సహకారం అందించారు. ఉదాహరణకు, తిరుపతిలో పాస్ మనోవికాస్‌సంస్థలో డ్రైవరుగా పనిచేస్తున్న శ్రీ శేఖర్ 2500 రూపాయలు అందించారు. అదేవిధంగా అదే సంస్థలో అటెండరుగా పనిచేస్తున్న శ్రీ టి. నాగ హనుమంతరావు 1116 రూపాయలు అందించారు (అతని జీతం 6,500 రూపాయలు నెలకు)

8. ఏ ఒక్క ప్రోగ్రాం కూడా నిర్దేశించిన సమయాన్ని మించలేదు. (ఒక్కొక్క ప్రోగ్రాం 55ని॥లు) అంతర్జాతీయ స్థాయి కళాకారులు కూడా ఈ విషయంలో ఎంతో సహకరించారు.

9. రోజుకొక సంగీత విభాగం, ప్రతిరోజూ గోష్ఠిగానం. మొదటిరోజు శాస్త్రీయ సంగీత సౌరభం, రెండవ రోజు సంప్రదాయ నామ సంకీర్తనా వైభవం, మూడవరోజు హరికథా వైదుష్యం నాల్గవరోజు కన్నడ వాగ్గేయకారుల కీర్తనలు, ఐదవ రోజు భద్రాచల రామదాసాది అపురూప వాగ్గేయకారుల సంకీర్తనలు, ఆరు, ఏడు.. రెండురోజులూ అన్నమాచార్య కీర్తనల గానం.. ఇలా ఒక్కోరోజు ఒక్కొక్క వెరైటీ సంగీత విందు.

10. ఇంకోక విశేషం ఏమిటంటే, ప్రధాన కళాకారులైన వారు ఈ ఏడు రోజుల్లో ఒక్కసారి మాత్రమే వేదికనలంకరించారు. తద్వారా ఎక్కువ మంది గాయకులు, హరికథకులు పాల్గొనే వెసులుబాటు కలిగింది.

2024, జూన్ 16 ఉదయం ఎనిమిది గంటలకు ప్రముఖ వయోలిన్, గాత్ర విద్వాంసులు శ్రీమాన్ కొమాండూరి శేషద్రిగారి అమృత హస్తాలతో శ్రీ వేంకటేశ్వర స్వామివారి చిత్రపటం చెంత అఖండ దీపారాధన ప్రజ్వరిల్లింది. సరిగ్గా అప్పుడే స్వామివారు నేనున్నాను అన్నట్లుగా తనకు వేసిన దండను జార్చి ఆశీర్వచనం అందించారు. అనంతరం అతిథులు శ్రీ మోదుమూడి సుధాకర్ తదితరులు అభినందనలు అందించారు.

వెంటనే మంగళధ్వని. తిరుపతికి చెందిన ప్రముఖ డోలు విద్వాంసులు, ఎస్వీ సంగీత నృత్య నాదస్వర కళాశాల అధ్యాపకులు శ్రీ వై ఎల్. శ్రీనివాసులు నేతృత్వంలో ఒక గంట పాటు నాదస్వర విన్యాసాలతో సభికులను కట్టిపడేశారు. ఆవెంటనే వేదస్వస్తి. ఎస్వీ వేద విశ్వవిద్యాలయం అధ్యాపకులు వేదమూర్తులు, శ్రీవికాస్‌శర్మ వారి అనుచరులు సామవేద గానం, స్వస్తి వచనములు వినిపించారు. తరువాత, నాదసుధా రస ప్రవాహానికి నాందిగా సద్గురు శ్రీ త్యాగరాజస్వామివారి ఘనరాగ పంచరత్నకృతుల గోష్ఠిగానం సాగింది. ప్రధాని ముందు గానంచేసి, ఘన సన్మానం పొందిన శ్రీమతి కొత్తపల్లి వందన కచేరీ అద్భుతంగా సాగింది. అఠాణ రాగంలో శ్రీమహాగణపతిం భజేహం కీర్తనతో ప్రారంభించి సభలో ఒక ఉత్తేజాన్ని తీసుకువచ్చారు. వీరికి సుప్రసిద్ధ వయోలిన్ విద్వాంసులు శ్రీ కొమాండూరి వేంకట కృష్ణ, సుప్రసిద్ధ మృదంగ విద్వాంసులు శ్రీ కోటిపల్లి రమేష్, సుప్రసిద్ధ ఘటం విద్వాంసులు శ్రీ సరస్వతుల హనుమంతరావు ఎంతో అనుగుణంగా సహకరించి కచేరీని ఆద్యంతం రక్తికట్టించారు. అనంతరం.. ఎస్వీ సంగీత నృత్య కళాశాల అధ్యాపకురాలు శ్రీమతి బి. చిన్నమదేవి గాత్రకచేరీ సభికులను అలరించింది. వీరికి చిరంజీవి జె. ధీరజ్, శ్రీ పారుపల్లి బాలసుబ్రహ్మణ్యంగారలు సహకరించారు. ఆ వేంటనే చెన్నైకి చెందిన శ్రీమతి అనువ్రతా నరసింహన్ గాత్రకచేరీ ఆహూతులను అలోచింపజేసింది. వీరికి తిరుపతికి చెందిన శ్రీసంకీర్త్, హైదరాబాద్‌కి చెందిన శ్రీ పి. విద్యాసాగర్ సహకారమందించి కచేరీ స్థాయిని ఇనుమడింపజేశారు. అటుపిమ్మట విజయవాడకు చెందిన శ్రీమతి అంజన సుధాకర్ గాత్ర కచేరీ సుస్వర బద్ధంగా సాగింది. వీరికి వయోలిన్‌పై శ్రీ ఎల్. జయరామ్, మృదంగపై శ్రీ కె. భాస్కర్ సహకరించారు. ఆ తరువాత పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం సంగీత విభాగాధిపతి డా॥ శ్రీమతి ఆర్.ఎన్.ఎస్. శైలేశ్వరి సంప్రదాయబద్ధంగా సుస్వర గాత్రాన్ని అందించారు. వీరికి హైదరాబాద్‌కి చెందిన శ్రీ కొమాండూరి అనంత శౌరి రాజన్, తిరుపతికి చెందిన శ్రీ పారుపల్లి బాలసుబ్రహ్మణ్యం, శ్రీ ఎల్. ప్రసాద్ సహకరించారు. జూన్ 16వ తేదీ సాయంత్రం 4గంటల 5 నిమిషాలకు ప్రారంభమైన కాకినాడ వాస్తవ్యులు శ్రీ ఆకొండి శ్రీనివాస రాజారావు గాత్ర కచేరీ సభాసదులను అబ్బుర పరచింది. తనే స్వయంగా బాణీలు కట్టుకున్న తన స్వీయ రచనలను భావ స్ఫూరకంగా గానం చేసి రస సృష్టి చేశారు. వీరికి వయోలిన్‌పై శ్రీ జి చక్రపాణి, మృదంగంపై విజయవాడకు చెందిన శ్రీమంగళగిరి శ్రీధర్ సహకరించారు.

తిరుపతి ఎస్వీ సంగీత నృత్య కళాశాల వీణ విభాగాధిపతి శ్రీమతి యాళ్ళ శ్రీవాణి వీణా వాదనాన్ని ప్రారంభించగానే హాలు అంతా ఒక రకమైన వాతావరణ నెలకొంది. వీరికి శ్రీ కోటిపల్లి రమేష్, శ్రీ సరస్వతుల హనుమంతరావు ధీటుగా సహకరించి సభికుల మన్ననలు పొందారు. ఆ వెంటనే సాయంత్రం 6గంటల 5 నిముషాలకు ప్రపంచ ప్రఖ్యాత గాత్ర విద్వాంసులు చెన్నై వాస్తవ్యులు శ్రీ సాకేతరామన్ సంగీత రస ఝరి సభికులను మత్తెక్కించింది. వీరికి ప్రపంచ ప్రఖ్యాత వయోలిన్ విద్వాంసులు, చెన్నై ఆకాశవాణి విశ్రాంత నిలయ విద్వాంసులు శ్రీ వి.ఎల్. కుమార్ వయోలిన్‌పై, అంతేవాసి అయిన విశాఖపట్నంకు చెందిన డా॥ వంకాయల వేంకటరమణమూర్తి మృదంగంపై, గుంటూరు వాస్తవ్యులు శ్రీఎం. హరిబాబు ఘటంపై సహకరించి ఆనందింపజేశారు.

అనంతరం జరిగిన వాయులీన త్రయం కచేరీ హృద్యంగా సాగింది. సంగీత విద్యా ప్రవీణులు శ్రీ కొమాండూరి శేషాద్రి, వారి సుపుత్రులు శ్రీ వేంకట కృష్ణ, శ్రీ అనంత శౌరి రాజన్ నాద వర్షం కురిపించారు. వీరికి విజయనగరానికి చెందిన శ్రీ ఎం. ఏడుకొండలు, రాజమహేంద్రవరానికి చెందిన శ్రీ బాలదినకర్, తిరుపతికి చెందిన శ్రీ ఎల్. ప్రసాద్ గారు అద్భుతమైన సహకారాన్ని అందించారు. ఆ వెంటనే, విజయవాడ ఆకాశవాణి విశ్రాంత కళాకారుడు, శ్రీ మోదుమూడి సుధాకర్ సంగీత సుధా స్రవంతి ప్రారంభ మయింది. చాలా ప్రశాంతంగా సాగిన ఈ కచేరీకి డా॥ కొమాండూరి వేంకట కృష్ణ వయోలిన్‌పై, తిరుపతి శ్రీ ఎం. సుధాకర్ మృదంగంపై సహకరించారు. తదనంతరం రాత్రి 9గంటల 5 నిముషాలకు శ్రీ వి.ఎల్ కుమార్ వాయులీన కచేరీ ప్రారంభమైంది. తన కమాను విన్యాసాలతో, అపురూప గమకాలతో సభికులకు నిద్రను మరిపించారు. డా॥ వంకాయల వేంకట రమణమూర్తి లయవిన్యాసంతో, వారికి తోడుగా శ్రీ సరస్వతుల హనుమంతరావు ఘట లయలతో హాలు మొత్తం చైతన్యలోకి వచ్చేసింది. ఒక ముక్తాయి తాను పొరపాటుగా వాయించానని తనకు తానుగా శ్రీ వేంకటరమణ మూర్తి ప్రకటించి కళ పట్ల తన ఔన్నత్యాన్నీ, తన మానసిక గొప్పతనాన్నీ చాటుకున్నారు. ఇలాంటి విద్వాంసులు చాలా అరుదు అని ఎందరో వారిని కొనియాడారు.

అఖండాలు జరిపే చాలా సందర్భాల్లో... రాత్రి 10 దాటిన తరువాత కచేరీలు కొంచెం చప్పగా సాగుతాయి. నువ్వు పాడంటే, నువ్వు వాయించు అని బ్రతిమాలుకోవలసిన పరిస్థితి ఉంటుంది. ఎప్పుడు తెల్లారుతుందా అనిపిస్తుంది.

ప్రఖ్యాత గాత్ర కళాకారులు శ్రీ జొన్నలగడ్డ శ్రీరామ్ సభను ఒక ఊపు ఊపేశారు. వీరికి శ్రీ మహావాది వాసూ విశ్వనాధ శాస్త్రి వయోలిన్‌పై, శ్రీ ఎ.ఎస్. శంకర్ మృదంగంపై సహకరించి కచేరీ ఆద్యంతం రక్తికట్టించారు. ఆవెంటనే ప్రంచ ప్రఖ్యాత వయోలిన్ గాత్ర విద్వాంసులు, తిరుపతి ఎస్వీ సంగీత నృత్య కళాశాల అధ్యాపకులు డాక్టర్ కొమాండూరి వేంకట కృష్ణ గాత్ర కచేరీ స్వర ఝరిలా సాగింది. వీరికి శ్రీ కొమాండూరి అనంత శౌరిరాజన్ వయోలిన్‌తో సహకరించారు. కాంభోజిలో ఎవరిమాట.. అద్భుతమైన లెక్కలతో తాళ

విన్యాసాలకు తోడు రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ మృదంగ విద్వాంసులు శ్రీ కె. యోగీష్, శ్రీ ఎం. హరిబాబు లయవిన్యాసాలతో సభలో చప్పట్ల మోత మ్రోగింపజేశారు. రాత్రి సరిగ్గా 12 గంటలకు ప్రారంభమైన సింగపూర్‌కి చెందిన శ్రీమతి కాపవరపు విద్యాధరి గాత్రకచేరీ అబ్బురపరచింది. వీరికి కర్నూలు వాస్తవ్యులు శ్రీ బి. రమణయ్య, శ్రీకాకుళంకు చెందిన శ్రీ కవిరాజు, తిరుపతి శ్రీ కె. సూర్య రమణీయమైన సహకారాన్ని అందించి సభికుల మెప్పుపొందారు. ఇప్పుడు అసలైన రసకందాయంలో పడింది. ఇప్పటివరకు జరిగిన కచేరీలకు భిన్నంగా.. విభిన్న శైలిలో భారతీయ సంగీతంలో మరో బాణీ... హిందుస్తానీ సంగీత కచేరీ రాత్రి ఒంటిగంటకు ఎంతో ప్రశాంతంగా మొదలై, ఉవ్వెత్తున ఎగసిన కెరటాల్లా సాగి, ప్రేక్షకులను పరవశింపజేసింది. ప్రపంచ ప్రఖ్యాత గాత్ర విద్వాంసులు స్వర్గీయ పండిట్ జస్రాజ్ శిష్యురాలు, చెన్నైకి చెందిన కుమారి లలితాశర్మ హిందుస్తానీ శాస్త్రీయ సంగీత కచేరీలో జోగ్, భాగదీశ్వరి, మిశ్రయమన్ రాగాల్లో నాద వృష్టికురిసింది. వీరికి హార్మోణియంపై శ్రీ శ్రీకృష్ణన్, తబలాపై శ్రీ ప్రవీణ్ నారాయణ్ ఎంతో ప్రతిభతో సహకరించారు. అర్ధరాత్రి రెండు గంటలకు తిరుపతి ఎస్వీ సంగీత నృత్య కళాశాల అధ్యాపకులు డా॥ పరమేశ్వరయ్య గాత్ర కచేరీతో సభికులు హిందుస్తానీ స్వర సమ్మోహనం నుండి కర్ణాటకానికి వచ్చారు. వీరికి శ్రీ కొమాండూరి అనంత శౌరిరాజన్, శ్రీ బుద్ధవరపు మారుతీ రఘురామ్, శ్రీ ఆర్. రామకృష్ణ వయోలిన్, మృదంగం, ఘటంపై సహకరించి రక్తికట్టించారు. తెల్లవార ఝామున 3గంటలకు విజయవాడకు చెందిన శ్రీ వేమూరి విశ్వనాథ శాస్త్రి చాలా చురుకైన కీర్తనలు ఎంచుకుని అలరించారు. వీరికి తిరుపతి ఆర్. రవిశంకర్, విశాఖపట్నం శ్రీపురాణం రవీంద్రుడు అంతే ధీటుగా సహకరించారు. ఉదయం 4గంటలకు ప్రముఖ గాత్రవిద్వాంసులు, అన్నమాచార్య ప్రాజెక్టు నిలయ విద్వాంసులు, శ్రీ గురజాడ మధుసూదనరావు గాత్ర కచేరీ మలయమారుతంలా, ఉదయ రవికిరణంలా సాగింది. వీరికి వయోలిన్‌పై తిరుపతి శ్రీ జి. చక్రపాణి, శ్రీ పురాణం రవీంద్రుడు మృదంగంపై పాకాల ఎస్. వేణుగోపాల్ మోర్సింగ్‌పై సహకరించారు. ఆవెంటనే ఉదయం 5 గంటలకు అనంతపురానికి చెందిన ప్రముఖ గాత్రవిద్వాంసులు శ్రీ మొదలి మురళీకృష్ణ గాత్ర కచేరీ శ్రోతలకు ప్రాతఃకాల ఫిల్టర్ కాఫీలా సాగింది. వీరికి తిరుపతి శ్రీ జి. చక్రపాణి, హైదరాబాద్‌కి చెందిన శ్రీ పలివెల విద్యాసాగర్, రాజమహేంద్రవరానికి చెందిన శ్రీ బాలదినకర్, సహకరించారు. అనంతరం, ఉదయం 6 గంటలకు శ్రీవేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల అధ్యాపకులు, శ్రీమతి జి. శారదా సుబ్రమణ్యం శిష్యురాలు శ్రీమతి పి. శైలజ కచేరీ అత్యద్భుతంగా సాగింది. వీరికి శ్రీ జి. వేంకటరమణ వయోలిన్‌పై, శ్రీ కోటిపల్లి రమేష్ మృదంగపై సహకరించారు. ఉదయం 7గంటలకు ఎస్వీ సంగీత నృత్య కళాశాల పూర్వాధ్యక్షులు, శ్రీమతి చల్లా ప్రభావతి వయోలిన్ సోలో కచేరీ అత్యంత రమణీయంగా సాగింది. మలయమారుతంతో మొదలై, భాగేశ్వరి రాగంతో సుసంపన్నమైన ఈకచేరీకి వారి శిష్యులు శ్రీ బి.

నరసింహస్వామి సహకార వయోలిన్, విజయనగరం శ్రీ ఎం. ఏడుకొండలు మృదంగంపై, బోడపాడుకు చెందిన సరస్వతుల హనుమంతరావు ఘటంపై సహకరించి వన్నెతెచ్చారు. ఈ శాస్త్రీయ సంగీత కచేరీ విభాగంలో చివరి గాత్రకచేరీ మహామహోపాధ్యాయ, సంగీత లక్షణకర్త, గాత్ర, జంత్ర విద్వాంసులు శ్రీ కొమాండూరి శేషాద్రి గాత్రకచేరీ అత్యంత ప్రతిభావంతంగా సాగింది. వీరికి వారి కుమారులు శ్రీ అనంత శౌరి రాజన్ సహకార గాత్రం, డా॥ వేంకట కృష్ణ వయోలిన్‌పై రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ మృదంగ విద్వాంసులు శ్రీ కె. యోగీష్ మృదంగంపై, తిరుపతి శ్రీ బుద్ధవరపు మారుతీ రఘురామ్ ఘటంపై సహకరించి కచేరీని సుసంపన్నం చేశారు.

ఎంతో మహోన్నతంగా మొదటిరోజు కార్యక్రమాలను అత్యంత రమణీయంగా పరిసమాప్తం చేసుకున్న సప్తగిరి సంగీత సప్తాహం, రెండవ రోజులోకి హృద్యంగా అడుగుపెట్టింది. సంప్రదాయ నామసంకీర్తనలు, నాదస్వర విన్యాసాలూ ఈ రోజు ప్రత్యేకతలు. ప్రపంచ ప్రఖ్యాత మహా విద్వాంసులు, భాగవతులు ఈ రోజును భక్తి రసానందం చేశారు. డా॥ జొన్నలగడ్డ ఈశ్వర ప్రసాద్ నృత్య సంకీర్తన ఆహూతులను సమ్మోహనం చేసింది. 2024, జూన్ 17వ తేదీన ఉదయం 9గంటలకు సద్గురు శ్రీ త్యాగరాజస్వామి వారి ఉత్సవ సంప్రదాయ కీర్తనల గోష్ఠిగానంతో మొదలైన ఈ కార్యక్రమంలో తమిళనాడు తిరువవణైక్కవల్‌కి చెందిన మహిళామణుల బృందం తమ నామసంకీర్తనతో సుమారు 2గంటలపాటు సభికులను భక్తిరసవాహినిలో పయనింపజేశారు. 16 మంది పాల్గొన్న ఈ బృందంలో ఇద్దరు కేరళ రాష్ట్రం కొచ్చికి చెందినవారున్నారు. అనంతరం చెన్నైకి చెందిన శ్రీ లీలా రామానుజ దాస్ బృందం నామసంకీర్తనా కుసుమాలను స్వామివారికి సమర్పించారు. సమారు 22 మందితో కూడిన ఈ బృందం భద్రాచల రామదాస కీర్తనలను భక్తిభావంతో వినిపించారు. తదనంతరం జరిగిన చెన్నైకి చెందిన శ్రీ జ్ఞాన సురభి సంగీత అకాడమీ వారి నామ సంకీర్తన అలరించింది. ఈ బృందంలో 9 మంది కళాకారులు పాల్గొన్నారు. తమిళనాడు వడలూరుకు చెందిన శ్రీ జి. చంద్రమౌళి బృందం నామసంకీర్తన ఎంతగానో ఆకట్టుకుంది. 16 మంది ఉన్న ఈ బృందంలో మహారాష్ట్రకు చెందిన వారు ఇద్దరున్నారు. రాజమహేంద్రవరానికి చెందిన శ్రీ నిడుదవోలు సత్యనారాయణ మూర్తి బృందం హిందుస్తానీ బాణీలో శ్రీ సత్యసాయి భజన కీర్తనలను వినిపించి ఆహూతుల మన్ననలను పొందారు. వీరికి తిరుపతి శ్రీ బి.కె. భరద్వాజగారు కీబోర్డుపై, శ్రీ జి. నటరాజ తబలాపై, శ్రీ పి. జయచంద్రయ్య రిథమ్ ప్యాడ్స్‌పై సహకారం అందించి ఆకట్టుకున్నారు. రాత్రి 8గంటలనుండి, 10 గంటలవరకు సభాసదులందరూ వేరే లోకాల్లోకి వెళ్ళిపోయారు. తాము ఎక్కడ ఉన్నారో మరచిపోయారు. విరలా... విరలా అంటూ.. అప్రయత్నంగా చేతులు పైకెత్తి భక్తిపారవశ్యంలో మునిగితేలారు. సుమారు 74 సంవత్సరాల యువకుడైన హైదరాబాద్ వాస్తవ్యులు డా॥ జొన్నలగడ్డ ఈశ్వర ప్రసాద్ ప్రదర్శించిన నృత్య సంకీర్తన అపూర్వం. అనిర్వచనీయం.

ముఖంలో హావభావాలు, అవయవ కదలికలు అత్యద్భుతం. ఇంతవరకూ తిరుపతి ప్రజలు ప్రత్యక్షంగా చూడని ఒక మహోన్నత నృత్య కళా వైదుష్యాన్ని వారు ప్రదర్శించి, సభికులు 5 నిముషాలపాటు నిలబడి కొట్టిన చప్పట్లద్వారా ప్రశంసలు అందుకున్నారు. ఈనృత్య సంకీర్తనలో శ్రీ ఈశ్వర ప్రసాద్ కుమారులు శ్రీ జొన్నలగడ్డ శ్రీరామ్ తో కలిసి సుమారు 11 మంది కళాకారులు పాల్గొన్నారు. సరిగ్గా రాత్రి 10గంటల ఐదు నిముషాలకు తూర్పుగోదావరి జిల్లా రాజానగరంకు చెందిన శ్రీ ఆచంట లక్ష్మీశ్రీనివాస్ బృందం నామసంకీర్తన చాలా ప్రశాంతంగా ప్రారంభమై, స్వరఝురిలా సాగింది. సుమారు 11 మంది ఈ బృందంలో పాల్గొన్నారు. రాత్రి 12 గంటలకు నెల్లూరు జిల్లా సూళ్ళూరుపేటకు చెందిన శ్రీ ఎం. పురుషోత్తం భాగవతార్ బృందం రాత్రి 2గంటల వరకు సంకీర్తనల వరద పారించారు. ఎక్కడా పస తగ్గకుండా ఆద్యంతం భక్తిపారవశ్యంతో నామస్మరణ చేశారు.

అర్ధరాత్రి సరిగ్గా రెండు గంటలకు మరో అంకం ప్రారంభం అయింది. అదే!! నాదస్వర నీరాజనం.

తిరుపతికి చెందిన ఐదు నాదస్వర బృందాలు ఒక్కొక్కరూ సుమారు గంటన్నరపాటు వారి నాదస్వర సొగసులు, డోలు లయవిన్యాసాలతో జూన్ 18వ తేదీ ఉదయం 9గంటలవరకూకచేరీవేదికనదద్దరిల్లించేశారు. సప్తాహ ప్రాంగణంలో ఎక్కడో ఒకచోట కునుకుతీస్తున్న వారందరూ, కళా ప్రాంగణంలోకి వచ్చేశారు. ఎవరి ప్రతిభ వారిదే!! ఎవరికి వారే ప్రఖ్యాతి చెందిన వారే!! ఇందులో.. తిరుపతికి చెందిన శ్రీవి. కార్తీక్, శ్రీటి. మురళీ గార్ల బృందం, శ్రీవి.హెచ్. శ్రావణ్‌కుమార్ బృందం, శ్రీ ఎన్. చంద్రశేఖర్ బృందం, కదిరిమంగళంకు చెందిన శ్రీ పి. మీరయ్య బృందం, గాజుల మాండ్యంకు చెందిన శ్రీ పూడి సుబ్రహ్మణ్యం బృందం పాల్గొని నాదస్వర నీరాజనాన్ని స్వామివారికి అర్పించారు.

ఎంతో మనోజ్ఞంగా, నాదస్వర స్వరఝురులతో రెండవ రోజు కార్యక్రమాలను అత్యంత రమణీయంగా పరిసమాప్తం చేసుకున్న సప్తగిరి సంగీత సప్తాహం, మూడవ రోజులోకి ముచ్చటగా అడుగుపెట్టింది.

హరికథా గాన వైదుష్య దినంగా ఈరోజు ప్రత్యేకతను సంతరించుకుంది. హరికథా ప్రపంచంలో దిగ్దంతాలుగా విరాజిల్లుతున్న అత్యున్నత స్థాయి, అత్యుత్తమ హరికథా భాగవతులు పాల్గొని, ఈరోజును సుసంపన్నం చేశారు. ప్రఖ్యాత హరికథకులు శ్రీ ధూళిపాళ శివరామ కృష్ణశర్మ, శ్రీ కట్టా జేజి నారాయణ, శ్రీ ఎస్.వి. శ్రీరామ్ భట్టర్, శ్రీమతి జంధ్యాల కృష్ణకుమారి, శ్రీమతి మందూరి లక్ష్మీకుమారి, శ్రీమతి టి. లక్ష్మీరాజ్యం, శ్రీమతి యండమూరి శిఖామణి, శ్రీమతి కావూరి శారద, శ్రీమతి పి. శివకుమారి, శ్రీమతి పసుపులేటి వరలక్ష్మి, శ్రీమతి సి.హెచ్. శివపార్వతి, శ్రీమతి గుండ్లూరు మునిలక్ష్మి, శ్రీవై వేంకటేశ్వర్లు, శ్రీఎం. రాముడు, శ్రీ కన్నెమడుగు చంద్రశేఖర్, శ్రీమతి ఎం. పూర్ణ, శ్రీమతి టి.ఎం. నాగమణి, శ్రీమతి. ఎం. మాధవి, శ్రీమతి గుళ్ళపల్లి గీతావాణి, శ్రీ ఎడవల్లి రమేశ్‌బాబు, శ్రీ నూకల యజ్ఞనారాయణ, శ్రీమతి వి. విజయకుమారిగారు, శ్రీ వై. సుబ్రహ్మణ్యంగారు, శ్రీమతి జి.ఎన్.కె. సీతాలక్ష్మి వంటి ఉద్దండులైన హరికథా భాగవతులు ఒక్కొక్కరూ

సుమారు 55 నిముషాల నిడివితో తమ హరికథా పటిమను, కథా గాన వైదుష్యాన్ని 24 గంటలపాటు సభికులను అలరించారు. ముందుగా ఉదయం 9 గంటలకు హరికథా పితామహులు శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణదాస వర్యులు విరచించిన హరికథా కీర్తనల్లో బహుళ ప్రాచుర్యమైన 9 కీర్తనలను గోష్ఠిగానంలో హరికథా భాగవతులు అందరూ ఆలపించి శ్రీదాసుగారికి నివాళులు అర్పించారు. ఈకథలకు వయోలిన్‌పై శ్రీయుతులు టి. గిరినాథ రెడ్డి, కె. దేవానంద, ధూళిపాళ శ్రీనివాస శాస్త్రి, జె. ఠాగూర్‌నాథ్ రెడ్డి, ఆర్. రవిశంకర్, ఇ. నరేంద్ర, జి. ఉదయ్ కుమార్, టి. జగదీశ్వర రావు, పూడి నాగూర్ గార్లు, కీబోర్డుపై శ్రీయుతులు ఆర్. శ్రీనివాసులు, కె. కుప్పుస్వామి, చల్లా యుగంధర్, బి.కె. భరద్వాజ, ఎస్. మురళీ, జె. భరత్ కుమార్, ఎం. కిరణ్ కుమార్, ఎస్. చంద్రశేఖర్, టి.ఎం. విజయ్ కుమార్, వై. శ్రీనివాస రాజు, ఎం. పురుషోత్తంగార్లు, మృదంగంపై శ్రీయుతులు నారగంటి విద్యాధర్, ఎం. మధుసూదన్, బి. గోపాల్, ఎస్. హొన్నూరుస్వామి, బుద్ధవరపు మారుతీ రఘురాం, పురాణం రవీంద్రుడు, ఎన్. హరికృష్ణ, పున్నమరాజు మురళీకృష్ణగార్లు, తబలాపై శ్రీయుతులు జి.ఎం. బాబూరావు, మోతి పవన్ కుమార్, జి. నటరాజ, కే. సిద్ధేశ్వరరావు, పి. ఆనందబాబు, జి.వి. మోహన కృష్ణ, బి.ఎం. శివకుమార్, జె. గణపతి శంకర్, వి. సీతారామయ్య, జి. రెడ్డిశంకర్, పి. జయచంద్రయ్య, వి. దేవశర్మ, ఇ. మునికన్నయ్య, కె. గోపాల్ గార్లు ఎంతో ప్రతిభావంతంగా సహకరించి హరికథకులకు ఉత్సాహం ఇవ్వడంతో పాటు కార్యక్రమాలకు వన్నె తెచ్చారు. ఒకే రోజు సుమారు 25 హరికథలను విన్న మధురానుభూతి శ్రోతలకు కలిగింది.

**– పున్నమరాజు మురళీకృష్ణ,**
పాస్ మనోవికాస్, తిరుపతి.
9247118447, 9182988692










SAPTAGIRI SANGEETHA SAPTAHAM


సప్తగిరి సంగీత సప్తాహం






















SAPTAGIRI SANGEETHA SAPTAHAM


సప్తగిరి సంగీత సప్తాహం



















# A PHILATELIC TRIBUTE TO MUSIC



**Cdr G. Sriramarao,** I.N(Retd)

ఈ శీర్షికలో రాబోయే సంచికలలో గానకళ పాఠకులకు ప్రముఖ సంగీత విద్వాంసులపై భారతదేశంలో వెలువడిన తపాలా బిళ్ళలు మరియు కవర్లు, ఇతర ముఖ్యమైన అంశాలను సచిత్రమాలికగా మనకు అందజేయబోతున్న Cdr G. శ్రీరామారావు (విశ్రాంత ఉద్యోగి) జాతీయ స్థాయిలో పేరొందిన స్టాంపులు, నాణేలు తదితర అమూల్యవస్తువుల సేకరణాభిలాషి.

ప్రత్యేకంగా భారతీయ సంగీతానికి సంబంధించిన కళాకారులపై వెలువడిన పై విషయాలను సేకరించి, పలు పట్టణాల్లో ప్రదర్శనలను ఏర్పాటు చేసిన ఔత్సాహికులు. భారత నావికాదళంలో కమిషన్డ్ అధికారిగా 1967 నుండి 1993 వరకూ కమెండర్ హోదాలో పనిచేసినవారు. సంగీతాభిరుచి కలిగి 1990-96 ప్రాంతాలలో కులపతి ఐ.వి.యల్. శాస్త్రి గారి మార్గదర్శకత్వంలో గురువులు శ్రీ వి.వి. వి. శంకరం వద్ద సంగీత విద్యనభ్యసించి, డిప్లమో పొందారు.

ఈ సేకరణ క్రమంలో 4000 స్టాంపులు, 200 నాణేలు, 180 కాగితపు కరెన్సీ, సంగీతానికి సంబంధించినవి సంపాదించుటయే కాకుండా ప్రపంచవ్యాప్తంగా 13 దేశాలలో సంగీతవిద్వాంసుల పేర నిర్వహించబడుచున్న 76 పోస్టాఫీసుల విలువైన సమాచారం కూడా వీరివద్ద ఉంది. విశాఖ మ్యూజిక్ అకాడమీ, విశాఖపట్నం వారి సంగీత కార్యక్రమాల్లో వీరి సేకరణ ప్రదర్శనను తిలకించిన పద్మవిభూషణ్ శ్రీమంగళంపల్లి బాలమురళీకృష్ణ నుండి ప్రసంశలు అందుకున్నారు. ప్రఖ్యాత మద్రాసు మ్యూజిక్ అకాడమీలో కూడా 2014వ సంవత్సరంలో వీరి సేకరణాంశాలు 4 రోజుల పాటు ప్రదర్శనకు ఉంచబడ్డాయి. లిమ్కాబుక్ ఆఫ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో వీరి సేవకు గుర్తింపు లభించింది.

గానకళ ద్వారా ఆ విశేషాలను అందిస్తున్న శ్రీ రామారావు గారికి ధన్యవాదాలు.

---

I define MUSIC as Magnificent Universal Systematic Incredible Creation.

Music is the language of emotion. It is one of the fine arts and the finest of fine arts. The system of Music is developed by the genius of man himself, and therefore among the other, Music is ranked as the greatest of fine arts. Music is Universal. It influences alike the scholar the lay person, the old and the young and the man and the animal. The Cow, the Infant and Serpent, all living beings feel the charm of Music. This and the subsequent articles are a Philatelic tribute to the Great Musicians, Musical instruments, Musical Scores and various types of Music which enthrals the Whole Universe.

'Sisurvethi Pasurvethi Veethi Ganarasam Phani'

'Music is the language of Gods. Shiva plays Damaru(drum), Krishna plays the Flute, and Saraswathi plays Veena. Celestials like Narada and Tumburu are associated with Musical Instruments. Music gives divine Ananada. It is priceless

treasure.

As a lover of Music and Philately, in the subsequent articles I tried to bring out the origin and development of Music, Great Composers, Musicians Musical Instruments, Various types of Music, National Anthems, Musical Scores, Musical Theatres etc through the medium of Philately i.e. with stamps, First Day Covers, Special Covers, Miniature sheets, Sheetlets, Special cancellations and other philatelic elements issued by various countries. Special types of stamps depicting Gramophone Records, CD's, DVDs, Joint issues of stamps an First day covers with other countries, Musicians honoured with great awards, and finally errors on Musical stamps are covered. In the present day lot of research is being carried out to cure diseases by Music Therapy.

**Steam Horns, whistles and Bells**

With Robert Fulton's Invention of Steam Engine in 1807 Steam Horns and Whistles Proliferated. The arrival of trains and boats, was often announced by special rhythmic musical pattern of sound.




**Bells**

The bells which are of various types, made with different metals, when rung give a melodious rhythmic sound.



## The Indian Music

From the muladhara of the human body, the 'prana vayu' originates as 'Sukshmagni', and through the umbilical cord, heart, throat, head and face comes out as 'Nada' which is responsible for the creation of Music.



Lord Siva is considered To be Nada Swarupa

Also as per Vedas all sounds emerge from the sound of 'Omkara' or "pranava Nada' which came from the Nabi of Sri Maha Vishnu when Brahma was born. Amongst the Vedas 'Sama Veda' is the basis of Music.

'Sankh' is considered to be one of the oldest of Musical Instruments. In Sankh, different tunes cannot be produced, but when it is properly blown, we get the Sound of 'Om' or 'Omkara'.



Goddess Saraswathi presides over all the learning and intellectual pursuits considered to be the Goddess of Music in Hindu Tradition. The Musical Instrument Veena is played by Saraswathi.

Saints and Poets who brought Bhakthi Movement by Ganam and Bhajans – Singing in praise of God



**Tulsidas (1533-1634)**

Regarded as an incarnation of Valmiki. The author of Ramayana in Sanskrit. Wrote Ramacharithamanas, an epic devoted to Rama in verse form called Chaupai



**Meerabai (1547-1614)**

A saint of 15-16 Centruy. Her devotional songs have been enchanting generations of Indians even today.




**Kabir (15the Century)**

Adovcated the unity of Hindu and Muslim Religions by his songs. A part of his poetry was into 'Adi Granth' the sacred book of Sikhs.




**Surdas (1479-1586)**

Medieval poet, singer of Braj. Left master piece 'Sur Sagar' containing 1,00,000 songs.



**Sant Ravidas (1450-1520)**

Wrote a number of songs with Similes in formlessness




**Basaveswara (Dob uncertain died 1196)**

Teachings written in Kannada Language embodied in simple verse form known as vachanas set later to Music

## The Carnatic Music

### Purandara Das(1484-1564)




Known as the father of Carnatic Music. Composed many songs/ Keeratanas in Kannada known as Das Padagalu which are simple to understand and created many ragas. He formed the basic rules/ system of Carnatic Music for teaching and singing. Composed nearly 4,75,000 songs.

### Annamacharya (May 9, 1408 - Feb 23,1503)




Tallapaka Annamacharya, telugu song writer and carnatic composer. Ealiest known to compose sankeeratanas in praise of Lord Venkateswara The deity of seven hills of Tirumala. Widely known as Pada Kavita Pita- maha of Telugu language. Contemporary to Purandaradasa and met him in Tirumala. Composed nearly 32,000 sankeertanas.

## The Golden era of Carnatic Music


Was during 18th and 19th century when the ‘Sangita Trimurthis’ or’The Musical Trinity’ Tyagaraja Swamy, Muthuswamy Dikshitar and Syama Sastri lived.

### Tyagaraja(1767-1847)





A renowned saint Musician, poet and great bhaktha of the 19th century. He composed many devotional songs in praise of Lord Rama in Telugu and also in Sanskrit.

### Muthuswamy Dikshitar (1775-1835)




One of the greatest composers of Carnatic Music, mainly composed On Goddess Durga Calling her ‘my mother’ in many keertanas.

### Syama sastri (1762-1827)




A highly creative artist of Carnatic Music. His compositions are in prise of Goddess Kamakshi and Meenakshi, are original and have a style of their Own, and unconventional and free, rich in emotional content. Composed in Sanskrit, Tamil and Telugu. The only one from Trinity to compose in Tamil.

### Swati Tirunal (16.4.1813-25.12.1846)




Was the Maharaja of the State of Tranvancore. Patron of music and musician Himself, encouraged and composed over 400 both in Hindustani and carnatic music. Fluent in 10 languages.

## Other Musicians both Old and Modern era


### Amer Khusrau (1253-1325)




Enriched Qawali, Qawl Tarana and Sitar




### Sant Namdeo (1270-1350)



**Sant Ravidas (1450-1520)**

His devotion was like Hanuman to Rama




**Mahakavi Magh**




**Sant Eknath (1533-1599)**

Inspired by Jnaneshwar Namdeo,Tukaram, Ramdas




**Narasimha Mehta**

17th Century



**Swami Ramanand (1738-1802)**

Guru of Swaminaryan Sanskrit poet singer




**Ghalib**

1797-1869

## బహుముఖ ప్రజ్ఞాశాలి భాస్కరభట్ల కు "నంది అవార్డు పురస్కారం"



తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖ జిల్లా వడ్లపూడి శ్రీ గణేష్ నగర్ వాసి బ్రహ్మశ్రీ భాస్కరభట్ల సత్యప్రసాద్ శర్మ కు కాళోజి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ నేషనల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆఫ్ న్యూఢిల్లీ, తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త నిర్వహణలో జాతీయ నంది పురస్కారాలు విజయవాడ బాలోత్సవ్ భవన్ లో తెలుగు వెలుగు సంస్థ వారు నంది అవార్డ్" ఇవ్వడం జరిగింది... బ్రహ్మశ్రీ భాస్కరభట్ల సత్యప్రసాద్ శర్మ కు బహుముఖ ప్రజ్ఞాశాలి గా గుర్తించి సంస్థ వారు" నంది అవార్డ్ "ఇచ్చారు... ఇందులో భాగంగా సంస్థ జాతీయ చైర్మన్ పోలోజు రాజ్ కుమార్, మండలి కృష్ణబాబు ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ యూత్ అధ్యక్షులు అద్దంకి నాగరాజు – జాతీయ మహిళా అధ్యక్షురాలు శ్రీమతి శాంతాబాయి, భారత స్వాతంత్ర్య సంగ్రామ యోధురాలు ఝాన్సీ లక్ష్మీబాయి వారసురాలు, కవి కోకిల గుర్రం జాషువా వారసురాలు అమృతపురి రేవతి, పూర్వ నాసా శాస్త్రవేత్త కత్తి వేంకటేశ్వర్లు తదితర ప్రముఖులు పాల్గొన్నారు...

# సంగీత సభల కార్యకలాపములు - 'విహారి'

## విశాఖ మ్యూజిక్ అకాడమి, విశాఖపట్నం యువకళాకారుల సంగీతోత్సవాలు

విశాఖ మ్యూజిక్ అకాడమి తన లక్ష్యాలలో "వర్ధిష్ణు కళాకారులకు తగిన విధంగా ప్రోత్సహించడం" కూడా ముఖ్యమైనదేనని భావిస్తూ, ప్రతి సంవత్సరం కేవలం యువకళాకారుల కోసమే జూన్ నెలలో మూడురోజులపాటు ఆరుగురు కళాకారులను దేశంలో నలుమూలలనుండి ఎంపికచేసి వారి సాధనను ప్రదర్శించేందుకు ప్రతిష్ఠాకరమైన వేదికనందించి, బాధ్యతను నిరాఘాటంగా నిర్వహిస్తూవస్తోంది.

ఆ ఒరవడిలో ఈ యేడు జూన్ 14,15,16 తేదీలలో స్థానిక కళాభారతి(ఏ.సి) ఆడిటోరియంలో ఈ ఉత్సవాలను నిర్వహించి రసజ్ఞుల ప్రశంసలను యువకళాకారులకు అందించింది.

చాలాసంవత్సరాలుగా ఈకార్యక్రమనిర్వహణా భారాన్ని అకాడమితో పంచుకుంటూన్న స్థానిక "సద్యోజాతం ట్రస్టు", ఈ యేడాదికూడా సంయుక్త నిర్వహణకు ముందుకు వచ్చినందుకు సంస్థ అధినేత, అకాడమి కోశాధికారి, శ్రీ వీరఘంట చంద్రశేఖర్ మరియు శ్రీమతి లలిత చంద్రశేఖర్ గారలకు అకాడమి ధన్యవాదాలు తెలియజేసింది.

మొదటి రోజైన 14.06.24 సాయంత్రం సరిగ్గా 6.15ని శ్రీ వి.యస్.యన్.మూర్తిగారి గళంనుండి "నితాంతకాంత దంతకాంతి మంతకాంత కాత్మజం" అంటూ గణేశప్రార్ధన, తొలిపలుకులతో ఆరంభమైన ఉత్సవాలకు శుభారంభాన్ని కలుగజేస్తూ, కార్యదర్శి శ్రీ యమ్మెస్ శ్రీనివాస్, సహకార్యదర్శులు, శ్రీ టి.క్రిష్ణారావు, శ్రీ ఏ. భుజంగరావు, కమిటీ సభ్యులు శ్రీ సి.హెచ్.దుర్గాప్రసాద్ మరియు శ్రీ వి.యస్.యన్. మూర్తి గారలు "జ్యోతిప్రజ్వలన" కార్యక్రమంలో పాల్గొన్నారు. తరువాత ప్రథమార్ధభాగంలో జరిగిన కుమారి కె. గాయత్రి వరేణ్య (విశాఖ) వాయులీన సంగీతసభ సునాదభరితంగా సాగింది. కాంభోజిరాగ అటతాళవర్ణంతో ధాటిగా సభను ఆరంభించిన గాయత్రి, గౌళరాగంలో "ప్రణమామ్యహం" అంటూ వినాయకుని ప్రార్థించి, దీటైన స్వరకల్పనను వినిపించింది. మాళవి రాగంలో "నెనరుంచినాను" అంటూ కమానును, వ్రేళ్ళను వేగంగా పరుగెత్తించి, మనం అరుదుగావినే కుముదక్రియరాగంలో, "అర్ధనారీశ్వరం" అన్న కీర్తనను స్వల్పస్వరకల్పనతో అందించి, ముఖ్యాంశంగా శంకరాభరణరాగంలో "స్వరరాగసుధా" అన్న కీర్తనను "రసయుతభక్తి" తత్పరతతో వినిపించి రాగాలాపన స్వరకల్పనలతో రసికులను రంజింపజేసింది. మృదంగంపై యువకిశోరంశ్రీ సాయికేశవ్ సబేశన్ తన సహజమైన వాద్యపటిమతో, చిక్కని లయవిన్యాసంతో సభను రక్తికట్టించాడు. తాళసహకారం కుమారి యివటూరి కృష్ణశృతి అందించి తనపాత్ర చక్కగా పోషించింది.

రెండవ అర్ధభాగంలో కుమారి ఘట్టి

శ్రీవిద్య భక్తిసంగీత కార్యక్రమం భక్తిరసభరితంగా ఆకట్టుకుంది. "ఆదినాట" అన్న పద్ధతి ననుసరిస్తూ నాటరాగంలో "జయ జయ జానకి" అన్న పురందరదాస రచనతో ఆరంభించి, వరుసగా భైరవి రాగంలో నారాయణతీర్థులవారి "కలయత" అన్న తరంగం, జయదేవుని "ధీరసమీరే" అన్న అష్టపదిని రాగమాలికగాను, కాంభోజిరాగంలో "ఏమయ్యరామా" అన్న రామదాసు రచన, బృందావని రాగంలో "బృందావనమధునా", ఆభేరి రాగంలో "రామనామ పాయసకే", ధన్యాసి రాగంలో "తారకమంత్రము", కల్యాణి రాగంలో రాగాలాపనతో "అలిమేలుమంగా" యిలా వివిధాంశాలను వరుసగా ఒకదానివెనుక ఒకటి ఆలపించి, శ్రీ పేరాల భరతశర్మగారు రచించిన "ఇయం స్వతంత్ర భారతితో" దేశభక్తినికూడా జోడించి ముగించింది కుమారి ఘట్టి శ్రీవిద్య. వాయులీనంపై సహకరించిన శ్రీ ఎ.వి.కె.ఆదిత్య, చల్లగా హాయిగా వెన్నంటినడుస్తూ, శ్రోత్రపర్వంగా అనుసరించగా, మృదంగంపై శ్రీ ఆర్.ప్రీతమ్ సుమధురమైన వరుసలతో భక్తిసంగీతానికి అనుగుణంగా సహకరించి లయవిన్యాసంలో ప్రతిభకనబరిచాడు. సీనియర్ ఆర్టిస్టు ప్రఖ్యాత తబలా కళాకారుడు శ్రీ బండారు రమణమూర్తి, తనదైన శైలిలో లలితంగా తబలాపై అనూసరిస్తూ, మృదంగ కళాకారుని ప్రోత్సహిస్తూ కచేరీని ఆసాంతం రక్తికట్టించాడు.

రెండవరోజు అనగా 15.06.24 నాటి సాయంత్రం ప్రథమార్ధభాగంలో బెంగుళూరుకు చెందిన వర్షిష్ణ వాయులీన యువకళాకారిణి కుమారి శ్రీవిద్యదవులూరి రసభరితమైన వాయులీనవాద్యంతో ప్రేక్షకుల కరతాళధ్వనులనందుకుంది. చక్కనైన చారుకేశి వర్ణంతో ఆరంభించి, హంసధ్వని రాగంలో "వాతాపి గణపంతిం" అంటూ గణేశుని ప్రార్థించి, భైరవిరాగ స్వరజతిని రాగభావంతో వినిపించింది. కీరవాణిరాగంలో "దేవి నేయతునై" అన్న తమిళ సాహిత్యం – అంటే "అమ్మా! నీ కరుణలేనిదే నేనేమీ చేయలేను" అన్న భావం కలిగిన కీర్తన వినిపించి, అన్నమయ్య రచన బేహాగ్ రాగంలో "నారాయణతే నమోనమో" అని కీర్తించి, కల్యాణి రాగం ముఖ్యాంశంగా "కమలాంబాం భజరే" అన్న దీక్షితులవారి రచనతో రంజింపజేసింది.

భక్తరామదాసు రచన "పలుకే బంగారమాయెనా" అంశంతో ముగించిన ఈ సభకు బెంగుళూరుకు చెందిన శ్రీ బి.కె.శ్రీనివాస్ లలితమైన మృదంగ నాదంతో మంచి ముందుచూపుతో ముక్తాయిలనందుకుంటూ, నాదభరితమైన లయవిన్యాసంతో సహకారం అందించాడు. శ్రీవిద్య బెంగుళూరులోనున్నా, మనప్రాంతానికిచెందిన ప్రజాసేవకులు స్వర్గీయ భాట్టం శ్రీరామమూర్తి గారి మునిమనుమరాలు కావడం విశేషం.

ఇక రెండవ అర్ధభాగంలో విశాఖకు చెందిన "నామతీర్థాల సోదరీమణులు" కుమారి ఎన్.లక్ష్మీప్రసన్న మరియు ఎన్. కృష్ణప్రియ గాత్రయుగళం తమ మధురమైనగాత్రంతో అలరించారు. "శశివదన" అంటూ చంద్రజ్యోతి రాగకీర్తనతో ఆరంభించి "అమ్మా నిను కోరిన కోర్కెలనిమ్మా" అన్న ఖమాస్ రాగ బాలమురళీకృష్ణ రచనతో, ముందుకేగి, హంసనాదం రాగాలాపన

అనంతరం "కల్యాణరామా" అన్న కృతిని ఆలపించి రంజింపజేశారు. "ఎంతని నే వర్ణింతును" అంటూ ఆర్తితో ముఖారి రాగరచన అనంతరం ముఖ్యాంశంగా, బేగడ రాగంలో "నీవేరా కులధనము" కీర్తన వినిపించారు గాయనీమణులు. గుర్జరీరాగంలో "వరాలందుకొమ్మని", జోన్పురి రాగంలో "పాహిపాహిమాం పరమకృపాళో" అంశాల అనంతరం మంగళంపల్లివారిదే బృందావని రాగ తిల్లానాతో సభను రసవత్తరంగా ముగించారు. వాయులీనంపై కుమారి యివటూరి కృష్ణశృతి, సమయానుకూలమైనట్టుగా గాయనీమణుల మనోభావాన్ని గ్రహిస్తూ అందించిన సహకారం గమనించదగినది. శ్రీకాకుళంకు చెందిన శ్రీ కుమార్ విఘ్నేశ్ మంచి సహకారం అందించడమేకాక సొంపైన లయవిన్యాసంతో ఆకట్టుకున్నాడు.

చివరిరోజైన 16.06.24 నాటి సాయంత్రం ప్రథమార్ధంలో ముంబయికి చెందిన కుమారి అదితి సుదర్శన్ మధురమైన తన మురళీగానంతో ప్రేక్షకులను తన్మయులను చేసింది. చక్రవాక రాగంలో "గజాననయుతం" అంటూ గజాననుని స్తుతించి, బేగడరాగంలో రామస్వామి శివన్ రచనను వినిపించి, చిక్కనైన పంతువరాళి రాగాలాపన స్వరకల్పనలతో "శంభో మహాదేవ" అంశంతో శ్రోతలను పరవశింపజేసింది. తదుపరి శుద్ధధన్యాసి రాగంలో "సుబ్రహ్మణ్యేన" కీర్తన అందుకొని ముఖ్యాంశంగా కాంభోజిరాగ కీర్తన "మాజానకి చెట్టబట్టగ" వినిపించింది. అనంతరం సుబ్రహ్మణ్యభారతి రచనను రాగమాలికలోనూ, దర్బారీకానడ రాగ తిల్లానతో సభను ముగించింది కుమారి అదితి. వాయులీనంపై కుమారి కె. గాయత్రి వరేణ్య సహకారవాద్య ధర్మాన్ని అనుసరిస్తూ తక్కువ సమయంలో తన ప్రతిభను ప్రదర్శిస్తూ, అనుసరణలో వెనువెంటనే నడుస్తూ ప్రశంసలనందుకుంది. మృదంగంపై శ్రీ బాలాజీ యువరాజ్ సహజమైన తన మృదువైన నాదంతో సహకరిస్తూ చిక్కని లయవిన్యాసంతో కరతాళధ్వనులందుకున్నాడు.

చివరిరోజు ద్వితీయార్ధంలో విశాఖకు చెందిన కుమారి ఎన్. భవ్యశ్రీ గీతిక, కుమారి జ్ఞాన శివకీర్తన, తమగానంతో ఉత్సవాలకు మంచి ముగింపును సమకూర్చారు. ముందురోజే తనగానంతో శ్రోతలను ఆకట్టుకున్న కుమారి ఎన్. లక్ష్మీప్రసన్న వాయులీన సహకారం అందించగా, శ్రీ జి. చరిత్ మృదంగసహకారం సమకూర్చి యిరువురూ సభను రక్తికట్టించడంలో తోడ్పడ్డారు. గాయనీమణులు తమగానాన్ని మంగళంపల్లి బాలమురళీకృష్ణ రచన "అమ్మా ఆనందదాయిని" అన్న గంభీరనాటరాగ వర్ణంతో ధాటిగా ఆరంభించి, షణ్ముఖప్రియ రాగంలో "సిద్ధి వినాయకం" అంటూ గణేశుని నుతించి, ఆనందభైరవి రాగంలో "మరివేరెగతి" అన్న కృతితో రసజ్ఞులను ఆనందపరిచారు. బిలహరి రాగ కీర్తన "పరిదానమిచ్చితే" కీర్తనకు మంచి స్వరకల్పన జోడించి వినిపించి ముఖ్యాంశంగా తోడిరాగాలాపన స్వరకల్పనలతో "కద్దను వారికి" అన్న అంశాన్ని సశాస్త్రీయంగా రాగ సాహిత్యభావాలు మేళవించి వీనులకు విందొనర్చారు. చక్కనైన చరిత్ మృదంగ లయవిన్యాసం అనంతరం ఖరహరప్రియ రాగంలో "శ్రీరామ నీనామ మేమిరుచిరా" అన్న భద్రాచల రామదాసు కీర్తన, రాగేశ్రీ రాగంలో "రాధా మాధవ"

అన్నమయ్యరచనతో మంగళంపాడి వేడుకలకు ముక్తాయింపు పలికారు.

మూడురోజులలో ఆరుసభలలో పాల్గొన్న కళాకారులను సర్వశ్రీ వీరఘంట చంద్రశేఖర్, డా. పేరాల బాలమురళీకృష్ణ, బి.ఏ.రాజారావు మరియు శ్రీమతి లలితా చంద్రశేఖర్ గారలు సత్కరించారు. ప్రతిదినం శ్రీ వి.యస్.యన్. మూర్తి, ప్రార్థనాపూర్వకంగా స్వాగతవచనాలు పలికి కళాకారులను ఆహ్వానించగా, శ్రీమతి సునీతాకుమార్ గారు కళాకారుల పరిచయం చేశారు. సభానంతరం ప్రతిదినం డా. పేరాల సమీక్ష కళాకారులకు సంతృప్తిని కలిగించి ప్రోత్సాహమందించింది. నిర్వహణావిభాగాన్ని కార్యదర్శి యమ్మెస్ శ్రీనివాస్ ఎప్పటిలాగే సమర్థవంతంగా పోషించగా, సహకార్యదర్శులు శ్రీ టి.కృష్ణారావు, శ్రీ ఏ భుజంగరావు, కార్యవర్గసభ్యులు, శ్రీ సి.హెచ్. దుర్గాప్రసాద్ శ్రీ జ్వాలాప్రసాద్ తదితర బృందం క్రమశిక్షణతో, సమయపాలనకు సహకరించి కార్యక్రమాలను నడిపించారు. సంయుక్తనిర్వహణలో అకాడమీకి చేయూతనిచ్చిన సద్యోజాతం ట్రస్టుకు అకాడమీ ధన్యవాదాలు తెలుపడంతో యువకళాకారుల సంగీతోత్సవాలు ఘనంగా ముగిశాయి.

**వియెస్సెన్మూర్తి**

విశాఖ మ్యూజిక్ అకాడమి

## విశాఖ మ్యూజిక్ అకాడమి
## పద్మవిభూషణ్ డా. మంగళంపల్లి బాలమురళీకృష్ణ రచనలపై పోటీలు

విశాఖమ్యూజిక్ అకాడమీ గతకొన్ని సంవత్సరాలుగా, మహావాగ్గేయకారుడైన పద్మవిభూషణ్ డా. మంగళంపల్లి బాలమురళికృష్ణ జన్మదినం పురస్కరించుకొని ప్రతియేటా కేవలం ఆయన రచనలగానంతోనే లబ్ధప్రతిష్ఠులైన సంగీత కళాకారుల సభలను యేర్పాటుచేస్తూ వస్తోంది.

అయితే అంతటి అసమానప్రతిభావంతుడైన మహా వాగ్గేయకారునికి అంతమాత్రంతోనే సరియైన ఘనమైన నివాళి కాజాలదని అకాడమి భావించింది. కర్ణాటకసంగీత సభలలో యేవిధంగా దేశవిదేశాలలో సంగీతజ్ఞులు, వాగ్గేయకారత్రిమూర్తుల రచనలను వేదికలపై ప్రదర్శిస్తున్నారో, అదేవిధంగా ప్రతికళాకారుడు తన సంగీతసభలో ఒక్కటైనా


న్యాయనిర్ణేతలు

బాలమురళీకృష్ణ రచనను వినిపించిననాడే, అంతటి తెలుగు వాగ్గేయకారునికి దీటైన నివాళి అవుతుందని అకాడమి నిర్ణయించుకుంది.

ఆ లక్ష్యం సాధించేదిశలో మొదటి ప్రయత్నంగా మూడేళ్ళక్రితమే బాలమురళీకృష్ణ




సంగీతరచనలపై పోటీ నిర్వహించడం ఆరంభించి మొదటి సంవత్సరం కేవలం ఆంధ్రరాష్ట్రానికే అదీ ప్రత్యక్షంగా పాడడానికే పరిమితమైన పోటీని, రెండవయేడు రెండు తెలుగురాష్ట్రాలకు ప్రత్యక్షంగా, అంతర్జాలమాధ్యమంలోనూ పాల్గొనే విధంగా నిర్ణయించి, మూడవసంవత్సరమైన ఈయేడు దేశమంతటా విస్తరింపజేయగా, అనుకోనివిధంగా UAE నుండికూడా పోటీదారులు పాల్గొనడంతో పోటీ మరింత ఆసక్తికరమైంది.

గతంలో జరిగినట్లే యీ పోటీలు యీ సంవత్సరంకూడా అకాడమికోశాధికారి,శ్రీవీరఘంట చంద్రశేఖర్ గారి సౌజన్యంతో వారి స్వగృహంలోనే జూన్ 29–30తేదీలలో ఉత్కంఠభరితంగా సాగాయి. సంగీతవిద్వన్మణులైన డా. గౌరిరామ్మోహన్, డా. ఆర్. మాధురిదేవి, శ్రీమతి లలితచంద్రశేఖర్ గారలు గురుతరమైన న్యాయనిర్ణయ బాధ్యతను స్వీకరించి అకాడమీకి తమవంతు సహాయం కల్పించారు

మొదటిరోజు పోటీల ప్రారంభసూచకంగా శ్రీ వి.యస్.ఎన్.మూర్తి గారి ప్రార్ధన, న్యాయనిర్ణేతలకు, పోటీదారులకు, ప్రేక్షకులకు ఆహ్వానపూర్వక పలుకుల అనంతరం, అకాడమి అధ్యక్షులు డా. యస్వీ రంగరాజన్ తమ అంతర్జాల సందేశంలో పోటీల పూర్వాపరాలను తెలియజేస్తూ, లాంఛనప్రాయంగా పోటీలను ప్రారంభించారు.

నాలుగు విభాగాలలో జరిగిన ఈ పోటీలలో మొదటిదినం రెండు విభాగాలు, రెండవదినం రెండువిభాగాలుగా విభజించి, నిర్వహణను క్రమ పద్ధతిలో వరుసగా కొనసాగించడం జరిగింది.

సరిగ్గా ఉదయం 10.00 గం.కు ఆరంభమైన మొదటి విభాగంలో 12–18సం.ల వయోపరిమితితో బాలమురళి రచనల నుండి ఒకవర్ణం, ఒక కీర్తన 10ని.ల వ్యవధిలో గానంచేయాలన్న నియమంతో పోటీదారులు ముందుకు వచ్చారు.

ఈ మొదటి విభాగంలో 7మంది ప్రత్యక్షంగా పాల్గొనగా 10మంది అంతర్జాల మాధ్యమంద్వారా పాల్గొన్నారు. వీరు వరుసగా గానం చేసిన వర్ణాలలో బాలమురళి – శంకరాభరణం, షణ్ముఖప్రియ, గంభీరనాట, ఖరహరప్రియ, నాట, ఖమాస్, రామప్రియ, తోడి, అమృతవర్షిణి రాగాలలో రచించినవి ఉన్నాయి. అలాగే వీరు పాడిన కీర్తనలలో వరుసగా– బహుదారి, ఖమాస్, కనకాంగి, మనోరమ, పున్నాగవరాళి, ఆరభి, నాట, సావేరి, కామవర్ధిని, కల్యాణి, హంసధ్వని, గణపతి, షణ్ముఖప్రియ రాగాలలో బాలమురళి రచించిన అద్భుతమైన సాహిత్యంగలిగిన రచనలు చోటు సంపాదించుకున్నాయి. వీరిలో కొందరు

పోటీదారులు సాయంత్రం నాలుగు గంటలవేళ కాలేజీనుండి నేరుగా అంతర్జాలంలో పాల్గొనడం వీరి శ్రద్ధకు సాధనకు ఉత్సాహానికీ నిదర్శనం.

అదేరోజు భోజన విరామానంతరం జరిగిన రెండవ విభాగంలో 18-25సం.ల వయోపరిమితితో బాలమురళి రచనలనుండి ఒక కీర్తన, ఒకతిల్లాన, 15.ని.ల వ్యవధిలో గానం చేయాలన్న నియమంతో 6గురు పోటీదారులు పాల్గొన్నారు. యిందులో చారుకేశి, షణ్ముఖప్రియ, ధర్మవతి, నాటకప్రియ, యిత్యాది రాగాలలో కీర్తనలు, అహీర్ భైరవి, కుంతలవరాళి, బృందావని, రాగమాలిక తిల్లానాలు వినిపించారు పోటీదారులు.

రెండవరోజు సరిగ్గా 10.00గం.కు మూడవవిభాగంలో 18-25సం.లవయోపరిమితితో బాలమురళి రచించిన కీర్తనను మనోధర్మంతో పాడి, ఒకతిల్లానాను 20ని.ల వ్యవధిలో పాడాలన్న నియమంతో 7గురు పోటీదారులు పోటీపడ్డారు. ఈ విభాగంలో బాలమురళి షణ్ముఖప్రియ, తోడి, కల్యాణి, కానడ, పంతువరాళి రాగాలలో రచించిన కీర్తనలు, రాగతాయమాలిక, గతిభేదప్రియ, బేహాగ్, ద్విజావంతి, అహీర్ భైరవ్ రాగాలలో తిల్లానాలను, మంచి మనోధర్మంతో, రాగాలాపన స్వరకల్పనలతో వీనులవిందుగా వినిపించారు పాల్గొన్నవారు.

భోజనవిరామానంతరం కష్టతరమైన నాల్గవ విభాగంలో కూడా 20-35సం.ల వయోపరిమితితో బాలమురళి సృష్టించిన ఏదో ఒకరాగంలో రాగం-తానం-పల్లవి ని 30ని.ల వ్యవధిలో గానం చేయాలన్న నియమంతో గొప్పసాధన చేసిన నలుగురు పోటీదారులు పాల్గొనడం విశేషంగానే చెప్పుకోవాలి. ఎందుకంటే ఈమధ్యకాలంలో మనం చూస్తున్న సంగీతసభలలో అనుభవజ్ఞులే ఈ అంశం సమర్పించడానికి వెనుకంజ వేస్తున్నారు. ఈ విద్యార్థులు తమ గురువుల శిక్షణలో చక్కనైన పల్లవులను ప్రస్తుతపరిచారు.

లవంగి రాగంలో "లలితలావణ్య లవంగి శుభాంగి", గురుప్రియ రాగంలో "శంకరం శివంకరం సతతం భజరే", లవంగి రాగంలోనే "నీరజదళలోచని నిఖిలలోకజనని", మహతి రాగంలో "భావరాగ లయ పదవిన్యాసమే పల్లవి" అన్న సాహిత్యాలతో మనోరంజనమైన మనోధర్మంతో, వివిధ తాళాలలో సమకూర్చుకున్న పల్లవులను చిక్కనైన స్వరకల్పనలతో న్యాయ నిర్ణేతలకు పరీక్షపెట్టేవిధంగా కళాకారులు గానం చేయడం చాలాగొప్పవిషయం.

సమయాన్ని పాటిస్తూ సరిగ్గా సాయంత్రం 4.00గం.కు ముగిసిన పోటీ ఫలితాలను న్యాయనిర్ణేతలు కొద్దిసేపటి తరువాత తాము ఆనందిస్తూ, విజేతలకు ఆనందాన్ని పంచుతూ, ఉత్సాహాన్ని రెట్టింపుచేస్తూ ఫలితాలను ఈ విధంగా ప్రకటించారు.

విభాగము - 1

ప్రథమ - ఓరుగంటి కాత్యాయని

ద్వితీయ - జోషిక మునగాల, అనఘ శాంతంరాజు, శిష్ట్లా శ్రీనిధి

తృతీయ -శిష్ట్లా సంస్కృతి, సి.హెచ్.శరత్ చంద్ర, పొత్తూరి దుర్గ సాహితి

కన్సొలేషన్ - హరిశరణ్య

విభాగము – 2

ప్రథమ – కనిష్క యార్ల

ద్వితీయ – లక్ష్మీ శైలజ

విభాగము – 3

ప్రథమ – కర్రా నాగవైష్ణవి

ద్వితీయ – గొర్లి అపర్ణ, ప్రణతి బాలానందన్

విభాగము – 4

ప్రథమ – ఎన్.వి.యస్.యల్.ప్రసన్న, విష్ణుప్రియ యిందిర, వడ్లమాని శ్రీవిద్య

ఈ విజేతల వివరాలు ప్రకటిస్తూ, ముగ్గురు న్యాయనిర్ణేతలు పలికిన ప్రోత్సాహపు మాటలు ఇక్కడ చెప్పవలసిన అవసరముంది. ముఖ్యంగా నాల్గవ విభాగంలో రాగం–తానం–పల్లవి వినిపించిన వారిలో ముగ్గురి విషయంలో విభేధం చూపించడం అన్యాయమని పించిందనీ, వారి సాధన వారి ప్రదర్శన స్థాయి పరిణతి చెందిన సంగీతకళాకారులను తలపించి, ముగ్గురినీ ఒకే స్థాయిలో నుంచడంవలన, వారి సాధన గుర్తిస్తూ ముగ్గురినీ ఒకే స్థాయిలోనుంచి ప్రథమ బహుమతినే అందించాలని ముువ్వరూ ఒకేమాటపై నిలవడం విశేషం. డా. గౌరి రామ్మోహన్ గారు పిల్లలందరికీ యిది "స్టార్టింగ్ పాయింట్" గానే భావించి సాధన కొనసాగించ వలసినదిగా ఉద్భోధించారు. అప్పుడే మంచి సంగీతవిద్వాంసులుగా ఆంధ్రదేశానికి పేరుతేవాలని ఆశీస్సులందించారు. డా. మాధురిదేవిగారు తన సందేశంలో, బాలమురళి సాహిత్యం చాలాగొప్పదనీ, గాయకులు శ్రద్ధగా పలకడం ఎంతముఖ్యమో శ్రోతలు అంతే శ్రద్ధగా వింటేకాని ఆ మహా వాగ్గేయకారుని భావం పట్టుకోలేమన్నారు. సాహిత్యం కేవలం స్వరం అనుగుణంగానే కాక భావానుగుణంగా పదాలను పలకాలన్న గొప్ప సూచన చేశారు. అలాగే స్వరంవేసేటప్పుడు బాలమురళి రచనలకు వారిముద్ర ప్రతిష్ఠించిన చోట వేస్తే చాలా బాగుంటుందన్నారు. నాల్గవ విభాగంలో వారు ఎన్నుకున్న తాళాలు చాలా క్లిష్టమైనవైనా సంపూర్ణ న్యాయం చేయగలిగారన్నారు. శ్రీమతి లలిత చంద్రశేఖర్ గారు కూడా ఈ చిరంజీవులు మద్రాసు మ్యూజిక్ అకాడమి నిర్వహించే RTP పోటీలలో బాలమురళిగారు సృష్టించిన రాగాలను ఎన్నుకొని గానంచేయమని సూచించారు. పిల్లల సాధనంతా వారి గానంలో తెలిసిందని వారి సాధనకు మంచి ప్రోత్సాహమిచ్చారు.

బహుమతులను ప్రకటించిన అనంతరం, అకాడమి కార్యక్రమనికి అన్ని సదుపాయాలతో వేదికను సమకూర్చిన అకాడమి కోశాధికారి, శ్రీ వీరఘంట చంద్రశేఖర్ గారికి, అధిక శ్రమకోర్చి న్యాయనిర్ణయం చేసిన విదుషీమణులు డా.గౌరి రామ్మోహన్, డా. ఆర్.మాధురిదేవి, శ్రీమతి లలిత చంద్రశేఖర్ గారలకు, మంచి ప్రణాళికను రూపొందించిన సహకార్యదర్శి శ్రీ ఏ.భుజంగరావు గారికి, ఆ ప్రణాళికను కచ్చితంగా పాటిస్తూ, సమయంపాటిస్తూ నిర్వహణలో సహకారం అందించిన సహకార్యదర్శి శ్రీ టీ.కృష్ణారావు, శ్రీ ఎమ్.జ్వాలాప్రసాద్, శ్రీమతి సునీత కుమార్ గారలకు, మొదటినుంచి చివరివరకూ తనదైన శైలిలో సమయపాలనతో ప్రోత్సాహపరుస్తూ

పర్యవేక్షించిన కార్యదర్శి శ్రీ యమ్మెస్ శ్రీనివాస్ గారికీ, తన ముగింపు సమీక్షతోపాటు ధన్యవాదాలను తెలిపారు శ్రీ వి.ఎస్.ఎన్.మూర్తి. అనంతరం అంతర్జాలమాధ్యమంలో అకాడమీ అధ్యక్షులు డా. యస్వీ రంగరాజన్ గారు పోటీల విజయం వెనుక శ్రమించిన కార్యవర్గాన్ని, పోటీదారుల క్రమశిక్షణను, మెచ్చుకుంటూ పలికిన ప్రశంసావాక్కులతో కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి.

పోటీదారులకు ధనరూపేణ అందించనున్న బహుమతులకు ముందుకువచ్చి ఆర్థికసహాయం అందించిన కార్యవర్గ సభ్యులకు అకాడమి ధన్యవాదాలు తెలుపుకుంటోంది. ఈ పోటీల ఘనవిజయంతో వచ్చేయేడు మరింత ఉత్సాహంగా అకాడమి ముందడుగు వేస్తుంది.

**వియెస్సెన్మూర్తి**

విశాఖ మ్యూజిక్ అకాడమి

## విశాఖ మ్యూజిక్ అకాడమి, విశాఖపట్నం

పద్మవిభూషణ్ చెవలియర్ డా. మంగళంపల్లి బాలమురళీకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని తేది 06.07.2024 నాటి సాయంత్రం 06.00గం. కు స్థానిక కళాభారతి (ఏసి) హాలులో సంగీత కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది.

జూన్ 29-30 తేదీలలో అకాడమి నిర్వహించిన "బాలమురళీకృష్ణ సంగీత రచనలపై పోటీ" లలో ప్రథమ విజేతలుగా నిలచిన అభ్యర్థుల గానం ముందుగా వినిపించడం జరిగింది.

6.00 కు అయిదునిముషాలముందే "శుక్లాం బ్రహ్మవిచారసార పరమాం" అంటూ సరస్వతీ ప్రార్థనతో ఆహూతులకు ఆహ్వానం పలికి కార్యక్రమవివరాలను శ్రీ వి.ఎస్.ఎన్.మూర్తి గారు అందించారు.

మొదటగా గానంచేసిన కుమారి జి.కనిష్క యాళ్ళ సింహేంద్రమధ్యమం రాగంలో చిక్కనైన బాలమురళిరచన "మరకత సింహాసన నరసింహా" అన్న కీర్తన, అనంతరం కుంతలవరాళి రాగంలో తిల్లానాను వినిపించి ప్రేక్షకుల కరతాళ ధ్వనులందుకున్నది.



**మొదటి విభాగము – ప్రథమ బహుమతి**

**కుమారి కనిష్కా యడ్ల**

తరువాత మనోధర్మవిభాగంలో ప్రథమ బహుమతి నందుకున్న కుమారి కర్రా నాగవైష్ణవి కల్యాణిరాగాలాపన స్వరకల్పనలతో బాలమురళి రచన "గతినీవే" వినిపించి అనంతరం అహీర్ భైరవి రాగతిల్లానాను జనరంజకంగా గానంచేసి ప్రశంసలనందుకుంది.




తృతీయ విభాగము – ప్రథమ బహుమతి
కుమారి కర్రా నాగ వైష్ణవి

తరువాత కష్టతరమైన ప్రతిభకు నిదర్శనమైన "బాలమురళికృష్ణ సృష్టించిన రాగంలో రాగం–తానం–పల్లవి" విభాగంలో ప్రథమ బహుమతి నందుకున్న అభ్యర్థులలో మొదటగా కుమారి ఎన్వి.ఎస్.ఎల్.ప్రసన్న లవంగి రాగంలో రాగం, తానం, అనంతరం, "లలితలావణ్య లవంగి– సకలశుభాంగి" అన్నపల్లవిని మాధుర్యభరితంగా గానంచేసి తన సాధనను తెలియజేసి రసజ్ఞులను ఆనందపరిచింది.



నాల్గవ విభాగము రాగం, తానం, పల్లవి – ప్రథమ బహుమతి : కుమారి ఎన్.వి.యస్.ఎల్. ప్రసన్న

లతాంగి, పూర్ణషడ్జం, లలిత రాగాలలో రాగమాలికగా స్వరకల్పనచేయడం విశేషం. తరువాత మరొక ప్రథమ బహుమతి గ్రహీత కుమారి విష్ణుప్రియ ఇందిర "గురుప్రియ" రాగంలో, రాగం తానం పాడి, తరువాత "శంకరం శుభంకరం సతతం భజరే – శివ" అంటూ వైవిధ్యమైన తాళంలో పల్లవిని నడిపించి ప్రతిభను కనపరచింది. ఈ మధుర గాయనికూడా సుషమ, గణపతి, రోహిణి రాగాలలో స్వరకల్పన జోడించి రాగమాలికగా పాడడం విశేషం.



నాల్గవ విభాగము రాగం, తానం, పల్లవి – ప్రథమ బహుమతి : కుమారి విష్ణుప్రియ ఇందిర

అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో అకాడమి అధ్యక్షులు డా. యస్వీ రంగరాజన్, ఉపాధ్యక్షులు డా. పేరాల, సహకార్యదర్శులు శ్రీ టి. కృష్ణారావు, శ్రీ ఎ. భుజంగరావు, కోశాధికారి శ్రీ వీరఘంట చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు శ్రీ కె.వి.రామమూర్తి, శ్రీ యమ్. జ్వాలాప్రసాద్, అకాడమికి ఆర్థిక సహాయం ఇతోధికంగా అందించిన శ్రీమతి యమ్. సుభద్ర, యిత్యాదులు విజేతలకు వారివారి స్థానాలను బట్టి నగదు బహుమతులను, సుందరమైన జ్ఞాపికలను, వరుసగా అందించారు.

నగదు బహుమతులలో ప్రథమ

బహుమతులన్నిటికీ అకాడమి అధ్యక్షులు డా. యస్వీ రంగరాజన్ గారే ప్రాయోజకతను చేకూర్చడంతో ఆయనకు, న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన డా. వి.గౌరి రామ్మోహన్, డా.ఆర్. మాధురిదేవి, శ్రీమతి లలిత చంద్రశేఖర్ గారలకు, అకాడమి ధన్యవాదాలు తెలుపడంతో బహుమతి ప్రదానోత్సవకార్యక్రమం సరియైన సమయానికే ముగించడం జరిగింది.

తరువాత ఆరంభమైన శ్రీ పోపూరి గౌరినాథ్ గారి గాత్ర సంగీత సభ రసజ్ఞులైన ప్రేక్షకులకు సంతృప్తినిచ్చింది. కళాకారుల పరిచయం శ్రీ వి.ఎస్.ఎన్.మూర్తి చేయగా కళాకారులను అధ్యక్షులు డా.యస్వీ రంగరాజన్ ఫలప్రదానంతో సత్కరించారు.




అన్నీ మంగళంపల్లి వారి రచనలనే ఆ మహా వాగ్గేయకారునికి నివాళిగా గానం చేసిన శ్రీ గౌరీనాథ్ గంభీరనాట వర్ణంతో గంభీరమైన గళంతో ఆరంభించారు. తరువాత వరుసగా ఆరభి రాగంలో "శ్రీ సకల గణాధిప" అంటూ ఒకేకీర్తనలో గణపతిని, హనుమను, అమ్మవారిని ప్రార్థించిన వైవిధ్యభరిత సాహిత్యాన్ని వినిపించి, కానడ రాగంలో "బృహదీశ్వర మహాదేవ, లవంగి రాగంలో "ఓంకారకారిణి", "గానలోల నీలీల లెన్నజాలరా" అన్న రాగమాలిక, సరసాంగి రాగంలో "మ"కారం స్వరాక్షరంగా గలిగిన "హనుమ అనుమ ఓ మనమా" అన్న కీర్తనల అనంతరం ముఖ్యాంశంగా లతాంగి రాగంలో "తామ్రలోచని" అన్న "మ" ప్రాసాక్షరంగా గలిగిన రచనను వినిపించి బాలమురళి గానంచేసిన తత్వం "మాయాలోకముల", రామదాసు కీర్తన "శ్రీరామ నీనామ మేమిరుచిరా", బృందావని రాగ తిల్లానాలతో సభను ముగించారు శ్రీ గౌరీనాథ్. వాయులీనంపై సమయానుకూలంగా మనోరంజికమైన సహకారం అందించిన శ్రీమతి బి.వి.దుర్గభవాని, మృదంగంపై మృదుమధురంగా వెంటనడుస్తూ లయవిన్యాసంలో తనప్రతిభను కనపరచిన శ్రీ పారుపల్లి ఫల్గుణ్ సభను రక్తికట్టించడంలో తమపాత్రను ఘనంగా పోషించి శ్రోతల మన్ననలనందుకున్నారు.

డా.పేరాల సభాసమీక్షతో కార్యక్రమం రసవత్తరంగా మంగళంపల్లి వారికి ఘనమైన నివాళిగా ముగిసింది. ఏ కార్యక్రమానికైనా సమయపాలన చాలా ముఖ్యమైనది. అకాడమి కార్యక్రమాలకు సరియైన ప్రణాళికను సమకూర్చడమేకాక, సమయపాలనను గమనిస్తూ అందరూ అనుసరించేలా చేయగలిగిన కార్యదర్శి శ్రీ యమ్మెస్ శ్రీనివాస్ అభినందనీయులు. ఈ పోటీలు యువ సంగీత కళాకారులకు డా.మంగళంపల్లి బాలమురళీకృష్ణ రచనల గొప్పదనాన్ని తెలియజేయడమేకాకుండా, వారి సభలలో ఆ రచనలను పాడేవాధంగా తీర్చిదిద్దుతున్నాయంటే అతిశయోక్తి కాదు.

**వియెస్సెన్మూర్తి**

విశాఖ మ్యూజిక్ అకాడమి

## ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్, విజయనగరం



ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్, విజయనగరం 679వ కార్యక్రమం నారాయణతీర్థ 349వ జయంతి, తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం రాజానగరం కి చెందిన ఆచంట లక్ష్మి శ్రీనివాసు బృందం నామసంకీర్తనం శ్రీమన్నార్ రాజగోపాలస్వామి దివ్యక్షేత్రం లో భక్తిశ్రద్ధలతో జరిగిన కార్యక్రమం అందరినీ అలరించింది. బాల గోపాలకృష్ణ పాహి పాహి ఇత్యాది నారాయణ తీర్థ తరంగాలతో పాటు వివిధ వాగ్గేయకారుల రచనలతో నామ సంకీర్తనం జరిగింది. బ్రహ్మానందం రావు, మూర్తి, రమణ, భీమేష్ వీరబాబు,రాజేష్ వంతలుగా పాడగా, శివరామకృష్ణ హార్మోనియంపై, పూరుషోత్తం డోలు పై సహకారం అందించారు .. సంస్థ అధ్యక్షులు ధవళ సర్వేశ్వర రావు, దూసి శివరామ శర్మ, సన్యాసిరావు, మహేశ్వర రావు సమర్పించగా సభ్యులు సుబ్బారావు, సన్యాసిరావు,ఆలయం తరపున గంటి సరోజ, వీరభద్రరావు, ప్రసాద్ గారు విద్వాంసులను సత్కరించారు. కార్యదర్శి డాక్టర్ మండపాక రవి విద్వాంసులను పరిచయం చేసి కార్యక్రమం నిర్వహించారు.

**డాక్టర్ మండపాక రవి**
కార్యదర్శి –FFA

## అలరించిన "లయానందలహరి" కార్యక్రమం.



తిరుమల తిరుపతి దేవస్థానముల శ్రీవేంకటేశ్వర భక్తిచానల్ లో ప్రపంచ వ్యాప్తంగా 2-07-2024 శనివారం సాయంత్రం ప్రసారమైన ప్రముఖ మృదంగ విద్వాంసులు ఆకాశవాణి టాప్ గ్రేడ్ కళాకారులు, కంచికామకోటిపీఠ ఆస్థాన విద్వాంసులు డాక్టర్ మండపాక రవి బృందం సమర్పించిన లయానందలహరి అందరినీ అలరించింది. ముఖ్యంగా రవి మృదంగం పై సహకరించగా, కె.వి.రామకృష్ణ ఘటం పైన, ఆనందకుమార్ తబలా పైన, వంశీకృష్ణ వీణ పైన, శైలజ తాళం పైన, పద్మావతీ శారద తంబురపై సహకారాన్ని అందించారు. అభోగి రాగ వర్ణం, మిశ్రచాపు తాళంలో శ్రీ మహాగణపతి, రూపక తాళం లో సొగసుగా మృదంగం తాళం, డాక్టర్ యనమండ్ర శ్రీనివాస శర్మ రచించిన ఆదితాళం లో దర్మవతి రాగ పల్లవి ప్రధాన అంశంగా జరిగింది. అన్నమాచార్య కీర్తన చక్కని తల్లికి ఇత్యాది విశేషాలతో అద్భుతంగా సాగింది... దేవస్థాన ప్రతినిధులు రవి బృందాన్ని సత్కరించారు...

**డాక్టర్ మండపాక రవి**

# సంగీతవిద్వత్ గానసభ, వరంగల్లు గురుపౌర్ణిమ ఉత్సవ దృశ్యాలు - జూలై 7వ తారీఖు






















# "స్వరఝురి" మరియు "స్వరతరంగిణి" సంస్థలు, విజయవాడ




విజయవాడ రామకోటిలో 2024 జూలై 27వ తేదీ "స్వరఝురి" మరియు "స్వరతరంగిణి" సంస్థలు సంయుక్తంగా అమెరికాకు చెందిన తెలుగు తేజం చిరంజీవి శశాంక గాత్రకచేరి ఏర్పాటు చేయడం జరిగింది. కుమారి అంబటిపూడి కామాక్షి వయొలిన్ తోను, శ్రీ కుందుర్తి అరవింద్ మృదంగంతోను చక్కగా సహకరించారు.

18 సంవత్సరాల వయసులోనే చిరంజీవి శశాంక అద్భుతమైన పాండిత్యాన్ని ప్రదర్శించి, శ్రోతలను మైమరిపించాడు. ముందుగా 'సకల కళాధిప'.. అంటూ ఆరభి రాగంలో బాలమురళీకృష్ణ గారి కృతి వినిపించాడు. అనంతరం ముత్తుస్వామి దీక్షితులు వారి ద్విజావంతి రాగ కృతి 'అఖిలాండేశ్వరి' మనోహరంగా గానం చేశాడు. ఉప ప్రధాన అంశంగా తోడి రాగంలో 'కొలువమరె గదా' అనే త్యాగరాజస్వామి వారి కృతిలో నెరవు, స్వర కల్పన ఎంతో ప్రతిభావంతంగా సాగాయి.

కచేరిలోని ప్రధాన అంశం అయిన పంతువరాళి రాగంలో రాగం– తానం– పల్లవి – 'పాలించు బంగారు కామాక్షి! భగవతి! గుణవతి! ధర్మవతి!' అంటూ మిశ్రజాతి త్రిపుట తాళం(త్రిశ్ర గతి) లో,అనులోమ,విలోమ గతుల్లో విద్వత్తు ప్రదర్శించే విధంగా గానం చేశాడు చిరంజీవి శశాంక. రాగమాలికగా శహన, ధర్మవతి, భాగేశ్వరి రాగాలు తీసుకొని, స్వరప్రస్తారం కూడా చక్కగా చేశాడు.

చివర్లో విజల్ తో 'నారాయణతే నమో నమో'.. కీర్తన వినిపించాడు.బహుముఖమైన ప్రజ్ఞ కలిగిన ఈ చిరంజీవి వయొలిన్ వాద్యంలోనూ దిట్ట.అటు చదువులో కూడా ప్రథముడిగా నిలుస్తూ, రాష్ట్రపతి పథకం అందుకోవడం అభినందనీయం. ప్రస్తుతం బయో మెడికల్ ఇంజనీరింగ్ చేస్తూ ఉన్నాడు.

కుమారి అంబటిపూడి వయొలిన్ పై వినిపించిన పంతువరాళి, తోడి రాగాలాపనలు, కుందుర్తి అరవింద్ మృదంగంపై ఆదితాళంలో చేసిన లయ విన్యాసం.. శ్రోతలను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి అధికంగా శ్రోతలు హాజరయ్యారు.



**వరంగల్ సంగీత విద్వత్ సభలో**
**శ్రీమతి తాండ్ర మాధవి గాత్రసభ**

## కృతజ్ఞతలు

ఈశ్వర వరప్రసాద పరిషత్తు, గుంటూరు వారు గానకళ సంగీత మాసపత్రిక పురోభివృద్ధిని కోరుతూ రూ. 5,000/– లు విరాళంగా అందించారు. వారికి ధన్యవాదాలు

**– సంపాదకుడు, ప్రచురణకర్త**

# శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం - గుంటూరు




గుంటూరు వారి నెలవారీ కార్యక్రమంలో భాగంగా జులై 28 వ తేదీ ఆదివారం బెంగుళూరుకు చెందిన శ్రీ అభిరామ్ బోడే గారి గాత్ర కచేరి జరిగింది. వాయులీనం పై విశాఖకు చెందిన కుమారి గాయత్రీవిభావరి, మృదంగం పై శ్రీ PS. ఫల్గున్ సహకారాన్నందించారు. యీ కార్యక్రమాన్ని కుమారి వంగర శ్యామసుందరి గారు వారి మాతృమూర్తి స్వర్గీయ వంగర కమలమ్మ గారి స్మృత్యర్థం సమర్పించారు. కార్యక్రమం తొలుత భైరవి ఆటతాళ వర్ణంతో శుభారంభం చేసారు. తొలి అంశం లోనే తన సామర్థ్యాన్ని నిరూపించు కొన్నారు శ్రీ రఘురామ్. తరువాత సింహవాహిని లో త్యాగయ్యగారి రచన "నెనరుంచరా" స్వర ప్రస్తారంతో మృదుగంభీరంగా సాగింది. తదుపరి దేవగాంధారి రాగం పాడి త్యాగయ్య గారి కీర్తన 'తులశమ్మ' అద్వితీయంగా ఆలపించారు. అటుపై 'కరుణయేలాగంటే' వరాళిరాగ కృతి హృద్యంగా గానం చేశారు. పాతతరం విద్వాంసులను స్ఫురణకు తెచ్చారు. తరువాత ఆనందభైరవి రాగం పాడి 'మానస గురుగుహ' దీక్షితులవారి రచన మనోహరంగా గానం చేశారు. వీరు ఏరాగం పాడినా SIGNATURE PHRASES.. తో మొదలు పెట్టి ఆ రాగంలోని జీవస్వర సంచారాలను న్యాసం చేసి పాడటం వీరి గాన గుణ విశేషం.తరువాత అంశం "ఏమయ్య రామ" రామదాసు వారి రచన కాంభోజి రాగం, "కామాది రిపువినుత "ఎత్తుగడతో ప్రారంభించి కీర్తన యొక్క స్థాయిని పెంచేసారు అంటే అతిశయోక్తి కాదు. యిక కార్యక్రమంలో ప్రధానాంశంగా కళ్యాణి రాగం విస్తృతమైనరాగ సంచారాలతో, నాదస్వర బాణీని తలపించేలా ఆలపించి,శ్యామశాస్త్రి వారి రచన " తల్లీనిన్ను " నెరవల్ స్వరప్రస్తారాలతో సర్వాంగ శోభితంగా గానంచేశారు. మంచి నాదపుష్టి గల శారీరం, శృతి శుద్ధమైన గాత్రం కావడం చేత కచేరి ఆపాత మధురంగా సాగింది. వాయులీనంపై విశాఖహరి విశేష మైన ప్రతిభను ప్రదర్శించి దీటైన సహకారాన్నందించారు. మృదంగంపై స్వర్గీయ MLN. రాజుగారి అంతేవాసి శ్రీ PS. ఫల్గుణ్ లు కలసి కచేరికి మరింత శోభను చేకూర్చారు. శ్రీ ఫల్గుణ్ తన్యావర్తనం వారి గురువుగారిని తలపింప చేస్తూనే తనదయిన శైలిలో రాణించింది. విద్వాంసుల పరిచయానంతరం, దర్బారి కానడ లో రాజీవ నేత్రాయ– రాగమాలిక పాడి మంగళంతో కచేరి ముగించారు. ఈ కార్యక్రమం గౌరవ కార్యదర్శి శ్రీ కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో సంఘ సభ్యుల సహకారంతో సుసంపన్నం అయ్యింది.

# ప్రముఖ నృత్యకళాకారిణి యామినీ కృష్ణమూర్తి నిధనం




యామినీ కృష్ణమూర్తి ఒక భారతీయ నర్తకి. భరతనాట్యం, కూచిపూడి, ఒడిస్సీ నృత్యాలలో నిష్ణాతురాలు. కూచిపూడి నృత్యానికి దేశవిదేశాలలో పేరు తెచ్చిపెట్టింది. కర్ణాటక సంగీతం కూడా నేర్చుకుని పాటపాడుతూ నృత్యం చేసి ప్రదర్శనలు ఇచ్చింది. ఆమె ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లిలో 1940వ సంవత్సరం డిసెంబరు 20న జన్మించింది. ఈమె తండి కృష్ణమూర్తి సంస్కృత పండితుడు. తాత ఉర్దూ కవి. అటుపై వాళ్ల కుటుంబం తమిళనాడులోని చిదంబరంలో స్థిరపడింది. భరతనాట్యం, కూచిపూడి నృత్యాల్లో ప్రావీణ్యం సంపాదించిన యామిని 1957లో తొలి నృత్య ప్రదర్శన ఇచ్చింది. అప్పటి నుంచి వేలాదిగా ప్రదర్శనలిచ్చి దేశ, విదేశాల్లో పేరు పొందినది.

ఈమె పూర్తి పేరు యామినీ పూర్ణతిలకం. తన తండ్రి ప్రోత్సాహంతో తన 5వ ఏట చెన్నైలోని రుక్మిణీదేవి అరండేల్ కళాక్షేత్రంలో భరత నాట్యము నేర్చుకోవడము ప్రారంభించింది. భరత నాట్యంలో ఈమె గురువులు కాంచీపురం ఎల్లప్ప పిళ్ళై, చొక్కలింగం పిళ్లై, బాలసరస్వతి, తంజావూర్ కిట్టప్ప, దండాయుధపాణి, మైలాపూర్ గౌరి అమ్మ మొదలైనవారు. ఈమె వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రి, చింతా కృష్ణమూర్తి, పసుమర్తి వేణుగోపాల కృష్ణశర్మ వంటి వారి వద్ద కూచిపూడి నేర్చింది. పంకజ చరణ్‌దాస్, కేలూచరణ్ మహాపాత్రల వద్ద ఒడిస్సీ నేర్చుకొన్నది. ఎం.డి.రామనాథన్ దగ్గర కర్ణాటక సంగీతం, కల్పక్కం స్వామినాథన్ దగ్గర వీణ నేర్చుకొంది. ఈమె తన తొలిప్రదర్శనను తన 17వ యేట చెన్నైలో 1957వ సంవత్సరంలో ఇచ్చింది. ఈమెకు 20సంవత్సరాల వయసు వచ్చే సమయానికి ఈమె ఒక ప్రతిభావంతురాలైన నర్తకిగా గుర్తింపు పొందింది. ఆ క్రమంలో ఈమె తన మకామును ఢిల్లీకి మార్చింది.

వివిధ రకాల నృత్యాలను హేమాహేమీలైన గురువుల వద్ద ఎంత నేర్చుకున్నా, ఈమె తన కళతో ప్రేక్షకులను నిలవేసి “ఇది నా ఒరవడి” అని చాటే ఒకానొక విశిష్ట బాణీ నృత్యాన్ని ప్రదర్శిస్తుంది. ఈమె ఏ బాణీ నృత్యం చేసినా వివిధ నృత్య రీతులను కలగాపులగం చేయకుండా ఆయా నృత్య సంప్రదాయాల పరిధిలోనే తన వ్యక్తిత్వాన్ని అభివ్యక్తం చేస్తుంది. అంతర్జాతీయ స్థాయిలో కూచిపూడి నర్తనానికి ఖ్యాతి రావడానికి చాలా కాలం ముందే ఈమె అమెరికా, ఐరోపా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇండోనేషియా, బ్యాంకాక్, సింగపూర్, బర్మా ఇత్యాది ఎన్నోదేశాలు పర్యటించి ఆయా చోట్ల నృత్య ప్రదర్శనలిచ్చి, భారతీయ నాట్య ప్రచారం చేయడం జరిగింది.

ఢిల్లీలో నృత్యకౌస్తుభ కల్చరల్ సోసైటి – యామిని స్కూల్ ఆఫ్ డాన్స్ పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేసి యువతకు భరతనాట్యం, కూచిపూడి నృత్యాల్లో శిక్షణ ఇస్తున్నది. ఈమె తిరుమల తిరుపతి

దేవస్థానం ఆస్థాన నర్తకి. "క్షీరసాగరమథన"మనే నృత్యరూపకాన్ని దేవులపల్లి కృష్ణశాస్త్రి ఆకాశవాణి కోసం రచించాడు. కాని దాన్ని కూచిపూడి సిద్ధేంద్ర కళాక్షేత్రంలో నాట్యాచార్యుడు చింతా కృష్ణమూర్తి ప్రిన్సిపల్‌గా ఉన్న రోజుల్లో అక్కడ ప్రదర్శించ తలపెట్టి ఈ రూపకానికి నృత్యం కూర్చవలసిందిగా ప్రఖ్యాత నర్తకుడు, నాట్యాచార్యుడు వెంపటి చినసత్యంకు అప్పగించాడు. అప్పుడు ఆయన నేతృత్వంలో మొట్టమొదట ప్రదర్శించిన "క్షీరసాగరమథనం"లో యామినీ కృష్ణమూర్తి "విశ్వమోహిని" పాత్రలో, ధన్వంతరి, మహావిష్ణువు పాత్రల్లో వేదాంతం సత్యనారాయణ శర్మ నటించి ఈ ప్రదర్శనను రక్తి కట్టించారు. ఆనాటి నుండి ప్రజలు ఈమెను "విశ్వమోహిని" అని సంబోధించడం మొదలు పెట్టారు. తరువాత ఈమె క్షీరసాగరమథనం నృత్యనాటికను అప్పటి భారత రాష్ట్రపతి సర్వేపల్లి రాధాక్రిష్ణన్ ముందు ప్రదర్శించి అతని నుండి భామావేణీ బిరుదును అందుకున్నది. అంతే కాక ఈమె "భామాకలాపం"లో సత్యభామగా అవతరించే వైఖరి, "మండూక శబ్దం"లో కృష్ణదేవరాయల ప్రశస్తిని లీలగా చూపే అభినయం, భంగిమల్లోని ఠీవి, ఔచిత్యం, "సింహాసనస్థితే" శ్లోకంలో దేవిని కళ్ళకు కట్టిస్తూ పట్టే భంగిమలు, "కృష్ణశబ్దం"లో భావతీవ్రత, లాలిత్యం, వైవిధ్యం ఈమె ప్రతిభకు తార్కాణాలు. వేదాలకు కొన్ని పసందైన జతులతో ఈమె కూర్చిన నృత్యం ఈమె పాండిత్యానికి ఉదాహరణ.యామిని సేవలను గుర్తించిన ప్రభుత్వం 1968లో పద్మశ్రీ, 2001లో పద్మభూషణ్ 2016లో పద్మవిభూషణ్ పురస్కారాలను ప్రదానం చేసింది. 2014లో మహిళా దినోత్సవం సందర్భంగా శాంభవి స్కూల్ ఆఫ్ డాన్స్ సంస్థ యామినికి నాట్య శాస్త్ర పురస్కారాన్ని అందించింది. ఆపై యామిని కూచిపూడి నృత్యానికి సంబంధించి డీవీడీలు విడుదల చేసింది. తన నృత్యప్రస్థానాన్ని "రేణుకా ఖాండేకర్" సహకారంతో "ఎ ప్యాషన్ ఆఫ్ డాన్స్" పేరుతో పుస్తకంగా రాసింది. నృత్యకళ పట్ల జనసామాన్యంలో అవగాహన కలిగించడానికి అభిరుచి పెంచడానికి సుమారు మూడేండ్ల పాటు పరిశోధన చేసి "నృత్యమూర్తి" సీరియల్‌ను పదమూడు భాగాలుగా దూరదర్శన్ ప్రసారం చేసింది. మన సంస్కృతీ వైభవానికి గోపురమై నర్తనశిల్పాల ఆధారంగా, స్థలపురాణాలు, చరిత్ర జోడించి వ్యాఘ్రపాద, పతంజలి సూక్తులు, కర్ణాటక సంగీతం రుచిచూపిస్తూ ఈ సీరియల్‌లో నృత్య సర్వస్వాన్ని ఇమిడ్చి చూపించింది.2017లో విశాఖపట్నంలో విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వారు ఈమెకు స్వర్ణకమలం బహూకరించి "నాట్య విద్యాభారతి" అనే బిరుదును ఇచ్చి సత్కరించారు. న్యూఢిల్లీలోని ఇందిరా ప్రియదర్శిని ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మ్యూజిక్ అండ్ డాన్స్ అనే సంస్థకు ఈమె డైరెక్టరుగా సేవలను అందించింది. ఈమె వివాహం చేసుకోకుండా అవివాహితగానే వుండి నాట్యరంగానికి తన పూర్తి జీవితాన్ని అంకితం చేసింది. ఫిలింస్ డివిజన్ ఆఫ్ ఇండియా 1971లో ఏల్చూరి విజయరాఘవ రావు సంగీత దర్శకత్వంలో "యామినీ కృష్ణమూర్తి" పై 20 నిమిషాల ఒక డాక్యుమెంటరీ సినిమా తీసింది. ఈమె ఉత్పలేందు చక్రవర్తి దర్శకత్వంలో వెలువడిన చందనీర్ అనే బెంగాలీ సినిమాలో తన పాత్రలోనే (డా.యామినీ కృష్ణమూర్తి) నటించింది.

గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె 3 ఆగస్టు 2024 శనివారం మృతి చెందారు.

# నాలుగు దశాబ్దాల నాయకత్వానంతరం స్వచ్ఛందగా పదవీ విరమణ చేసిన డైనమిక్ కార్యదర్శి శ్రీ యమ్మెస్ శ్రీనివాస్



విశాఖ మ్యూజిక్ అకాడమి 28.07.2024 ఆదివారం ఉదయం స్థానిక దసపల్లా హోటల్ లో జరుపుకున్న సర్వసభ్య సమావేశం ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. సుమారు గత నాలుగు దశాబ్దాల కాలంగా విశాఖ మ్యూజిక్ అకాడమి కార్యదర్శిగా అనన్యసామాన్య సేవలనందించిన శ్రీ యమ్మెస్ శ్రీనివాస్,పదవీవిరమణనుకోరుకోవడంపిడుగుపాటు. మరునాడు వార్తామాధ్యమాలలో విషయం తెలుసుకున్న విశాఖ రసజ్ఞులేకాక వివిధప్రాంతల సంగీత సంస్థలనుండి, సంగీతాభిమానుల నుండి ఆశ్చర్యపూర్వక సందేశాలు రావడం గమనించదగినది.

దాక్షిణాత్య సంగీతసభానిర్వాహకులకూ, సంగీతకళాకారులకు విశాఖ మ్యూజిక్ అకాడమి అంటే యమ్మెస్ శ్రీనివాస్ – యమ్మెస్ అంటే విశాఖమ్యూజిక్ అకాడమిగా స్థిరపడిపోయింది. ఒక సంగీతసంస్థకు ఒకేవ్యక్తి నిరాఘాటంగా ఏకగ్రీవంగా ప్రజాస్వామ్య పద్ధతిలో యింత సుదీర్ఘకాలం ఎన్నికవడం, సంస్థను విజయపథంలో నడిపించడం సంగీతసంస్థల చరిత్రలోనే ఒక రికార్డు. దేశంలో ప్రథమస్థానంలోనున్న మద్రాసు మ్యూజిక్ అకాడమి తరువాత స్థానంలో విశాఖ మ్యూజిక్ అకాడమిని నిలబెట్టిన ఘనత శ్రీ శ్రీనివాస్ గారిదేనని అలనాటి విద్వాంసులమొదలు నేటి సంగీతజ్ఞులందరికీ విదితమే.

ప్రతియేటా అకాడమి నిర్వహించే నెలవారీ సంగీతసభలు, యువకళాకారుల సంగీతోత్సవాలు, వార్షికోత్సవాలు, అవార్డుల రూపకల్పన నిర్వహణ విషయంలో శ్రీనివాస్ పోషించిన గురుతరబాధ్యత అకాడమి చరిత్రలో చిరకాలం నిలచిపోతుంది. అంతేకాకుండా తన అకుంఠితదీక్ష, పట్టుదల, సాంఘిక పలుకుబడితో అకాడమికి ఆర్థికంగా తాను చేకూర్చిన పటిష్ఠత, కార్యవర్గంతో కలసి పనిచేసినతీరు, లబ్ధప్రతిష్ఠులైన సంగీతజ్ఞులు మరియు రసికుల హృదయాలలో అకాడమికి కల్పించిన ఉన్నతస్థానం, ఈ సందర్భంలో చెప్పుకోదగినవి. కార్యవర్గ సమావేశంలోనే తానుకూడా అధ్యక్షునిగా పదవీ విరమణ చేస్తూ డా.యస్వీరంగరాజన్ గారు, శ్రీనివాస్ గారిని సత్కరిస్తూ పలికిన మాటలు పై మాటలకు సాక్ష్యాలుగా నిలుస్తాయి. తనశ్రీమతి హాస్పటల్ ఐసియూ లోనుండగా, బయట కూర్చొనికూడా అకాడమి వార్షికోత్సవ సంబంధిత పనులు చేయడాన్ని శ్రీ రంగరాజన్ గుర్తుకు తెచ్చుకున్నారు. భవిష్యత్తులో యింత నిబద్ధతగలిగిన వ్యక్తులు లభించడం సుమారుగా అసాధ్యమంటూ శ్రీ శ్రీనివాస్ ను అభిమాన పూర్వకంగా శాలువతో సత్కరించారు. ఒక సంగీత కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో

మొదటిమెట్టునుండి చివరివరకూ ఎలానడిపించాలో తెలియజేస్తూ కార్యవర్గ సభ్యులను ఒకేత్రాటిపై నడుపగలిగే నేర్పు ఆయనసొంతమన్నారు. నూతన అధ్యక్షునిగా ఎన్నికైన శ్రీ కే.వి. రామ్మూర్తిగారు, తాము పనితనంలో శ్రీనివాస్ స్థాయికి చేరుకోవాలంటే అసాధ్యమే అయినా తప్పక ప్రయత్నించగలమని పలకడం, శ్రీనివాస్ అకాడమికి అందించిన సేవల ఔన్నత్యాన్ని తెలియజేస్తుంది. సంగీత ప్రపంచానికి శ్రీ యమ్మెస్ శ్రీనివాస్ నిర్ణయం చాలా బాధను కలిగించిందన్నమాట మాత్రం నిజం.

**వియెస్సెన్మూర్తి**
గానకళ ప్రతినిధి



**10-08-2024 శనివారం పర్ణిక నృత్యాంజలి,కాకినాడ సంస్థ 7వ వార్షికోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు**

University of Silicon Andhra and SAMPADA proudly presented Vidushi Kanyakumari Avasarala violin concert in the Silicon Valley. It was simply mesmerizing and scintillating that received standing ovation multiple times. Patri Satish Kumar on Mridangam, Sivateja Mallajosyula on Violin and Sarhya Ganesan on Ghatam added magic to the whole concert. Silicon Andhra is very proud to recognize and felicitate her with the highest honor of Maha Puraskaram, the Golden Elephant award. She is the first ever artiste to receive this Maha Purasakar.








# విజయనగరం ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ శాస్త్రీయ సంగీత ఉత్సవం





ఆగస్టు 10,11 12 తేదీలలో 3 రోజులపాటు కొత్తపేట లో గల సంస్థ కార్యాలయంలో అత్యద్భుతంగా జరిగాయి. ఈ ఉత్సవ ముఖ్య ఉద్దేశం విజయనగరం లో సంగీతాన్ని నేర్చుకొని, సాధన చేసి, సంస్థలో అనేక ప్రదర్శనలు ఇచ్చి పేరుప్రఖ్యాతులు సాధించి ఇప్పుడు వేరే వేరే ప్రదేశాలలో స్థిరపడ్డ వారిని ఏకం చేసి నూతనోత్తేజం తో వారు ఇంకా రాణించాలని విజయనగర సంగీత వైభవాన్ని ఇనుమడింప జేయాలని ఏర్పాటు చేయడం జరిగింది.

మొదటి రోజు ఎ గ్రేడ్ విద్వాంసులు ప్రాతా కృష్ణమూర్తి గాత్రకచేరి కి మహదాసు శ్యామ్ నీలాద్రి వయొలిన్ పైన కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత అంతర్జాతీయ మృదంగ విద్వాంసులు డాక్టర్ పత్రి సతీష్ కుమార్ మృదంగతో సహకారాన్ని అందించారు. ప్రధానంగా తొడి రాగంలో '' దాశరథి'' త్యాగరాజ కృతిలో పాటు వివిధ వాగ్గేయకారుల కృతులను గానం చేసి అందరి మన్ననలు పొందారు. సంస్థ అధ్యక్షులు ధవళ సర్వేశ్వర రావు, ఉపాధ్యక్షురాలు ప్రఖ్యాత వీణ విద్వాంసురాలు డాక్టర్ కె.ఎ.పద్మప్రియ విద్వాంసులను పరిచయం చేసి గతంలో వారి జ్ఞాపకాలను ప్రేక్షకులతో పంచుకున్నారు. టీ.మహేశ్వర రావు, మోడెకుర్తి శ్రీనివాస రావు, ప్రఖ్యాత మృదంగ విద్వాంసులు "సంగీత కళామిత్ర" వి.అప్పలస్వామి, వయొలిన్ విద్వాంసులు త్రినాథరావు విద్వాంసులను సత్కరించారు.

2వరోజు ఢిల్లీ కి చెందిన డాక్టర్ మండ వెంకట నాగలక్ష్మి గాత్రకచేరికి హనుమంతు రామ చరణ్ వయొలిన్ పై, టాప్ గ్రేడ్ మృదంగ విద్వాంసులు దన్వాడ ధర్మారావు మృదంగంపై, గొట్టుముక్కల వెంకటేష్ మోర్సింగ్ పై సహకారాన్ని అందించారు. పప్పు సరోజినీ దేవి, కొత్తపల్లి సుబ్బారావు, ప్రముఖ న్యాయవాది శ్రీనివాస రావు, దూసి శివరాం శర్మ, రాంజీలు విద్వాంసులను సత్కరించారు. అనంతరం దన్వాడ ధర్మారావు గారికి ఇటీవల ఆకాశవాణి ద్వారా టాప్ గ్రేడ్ వచ్చిన సందర్భంగా పౌర సన్మానం జరిగింది. ధర్మారావు మాట్లాడుతూ ఎక్కడికి వెళ్ళినా విజయనగరం పేరు చెప్పగానే అందరూ ఎంతో గౌరవిస్తారని, చిన్నప్పుడు ఆయన ఎంత కష్టపడి, ఇష్టపడి నేర్చుకున్నారో వివరించారు. ఎన్నో చోట్ల సన్మానాలు పొందానని కానీ ఎఫ్ ఎఫ్ ఎ ద్వారా జరిగిన సన్మానం జీవితంలో మర్చిపోలేనిది అని భావోద్వేకం చెందారు.

3వ రోజు చెన్నైకి కి చెందిన మల్లాజోస్యుల శ్రీకాంత్ గాత్రకచేరికి వారి ధర్మపత్ని పావని





సహకారగానం తనయులు శివతేజ వయొలిన్ పైన, శ్యామకృష్ణ మృదంగంపై సహకారాన్ని అందించారు. వీరి తండ్రి గారు జగన్నాథరావు గతంలో కొత్తగ్రహారములో నివసించి విద్యాభ్యాసం చేసుకొని పిల్లల్ని సంగీతంలో మంచి ప్రయోజకులను చేసి ఈనాడు వారు దేశవిదేశాలలో అనేక ప్రదర్శనలు ఇస్తూ విజయనగర ఖ్యాతిని పెంచుతున్నారు. వీరు ప్రఖ్యాత వయొలిన్ విద్వాంసురాలు ద్వారం నరసింగరావు పాఠశాలలో ఇవటూరి విజయేశ్వర రావు గారి వద్ద సంగీతాన్ని అభ్యసించిన ‘ పద్మశ్రీ ‘ అవసరాల కన్యాకుమారి యొక్క బంధువులు, శిష్యులు. ప్రఖ్యాత చార్టెడ్ అకౌంటెంట్ ఇ.ఆర్. సోమయాజులు, విద్వాంసులను సత్కరించారు. సంస్థ కార్యదర్శి ప్రముఖ టాప్ గ్రేడ్ మృదంగవిద్వాంసులు డాక్టర్ మండపాక రవి ఈ 3 రోజుల ఉత్సవాన్ని పర్యవేక్షించారు..

## సంగీత లహరి, రాజమండ్రి



నిర్వహణలో శ్రీ యం. ఈశ్వర కుమార్ దేవ్ వీణా వాయిద్య సభ జరిగింది. శ్రీ ఏ. కామేశ్వర రావు మృదంగంపై ఆర్. బాల దినకర్ ఘటంపై కె. అరుణ్ కుమార్ తబలాపై సహకరించారు. వసంతరాగ వర్ణంతో కచేరి ప్రారంభించి సిద్ధి వినాయకం అంశం తరువాత ఉప ముఖ్య రాగంగా కల్యాణి ఆలాపన వీనుల విందుగా వాయించే అమ్మ రావమ్మా అనే ఖండ చాపు తాళ కీర్తన వాయించి అందులో వారు చేసిన స్వర ప్రస్తారం శ్రోతల మన్ననలు పొందింది. అనంతరం అంబావాణి, నాద లోలుడై, దేవాది దేవ మొదలైన కీర్తనలు వాయించారు.

ముఖ్య అంశంగా వారు వాయించిన భైరవి రాగం శ్రోతలను ఆనంద పరవశులను చేసింది. ఈ రాగం లో వారు వాయించిన “ఉపచారము చేసే వారు ఉన్నారని మరవకురా. చాలా రక్తిగా మంచి స్వరప్రస్తారంతో సాగింది. అనంతరం వారు కొన్ని అన్నమయ్య కీర్తనలు వాయించి కచ్చేరి ముగించారు. మృదంగం పై సహకరించిన కామేశ్వరరావు గారు చాల చక్కటి చిక్కటి సహకారం అందించి రక్తి కీ దోహద పడ్డారు. ఘటం పై సహకరించిన దినకర్ గారు అనుగుణంగా సహకరించి పక్క వాయిద్య ధర్మాన్ని చూపారు. అన్నమయ్య కీర్తనలు మరియు లలిత గీతాలకు తబలా పై సహకరించి అరుణ్ కుమార్ గారు తాను కూడా చక్కని విద్వాంసుడు అని నిరూపించుకున్నారు

# శ్రీ విజయ త్యాగ రాజ సంగీత సభ మరియు శ్రీ కంచి కామకోటి శంకరమఠం విశాఖపట్నం




శ్రీ విజయ త్యాగ రాజ సంగీత సభ మరియు శ్రీ కంచి కామకోటి శంకరమఠం విశాఖపట్నం వారి సౌజన్యంతో శ్రీ శంకర మఠం, AC ఆడిటోరియం నందు 21-8-2024 తేదీ బుధవారం నాడు నిర్వహించిన విద్వాన్ శ్రీ సాయి గోవింద్ విజయ రాఘవన్ మాండలిన్ వాద్య సంగీత కార్యక్రమం ఆద్యంతం వీనుల విందుగా జరిగింది.

ముందుగా జరిగిన 'జ్యోతిప్రజ్వలన' కార్యక్రమములో సభ సీనియర్ సభ్యులు శ్రీ లక్ష్మీ పతిగారు, స్థానిక సీనియర్ వయొలిన్ విద్వాంసులు శ్రీ A. సత్యవిశాల్ గారు శ్రీ మహాలింగం (చెన్నై) సభ కార్యదర్శి శ్రీ చాగంటి లక్ష్మణేశ్వర శర్మ పాల్గొన్నారు.

అనంతరం.. మాండలిన్ వాద్య సంగీతం ప్రారంభమయినది. శ్రీ సాయి గోవింద్ ముందుగా.. 'మాతే మలయధ్వజ'-ఖమాస్ రాగం ఆదితాళం పదవర్ణంతో కచేరీని ప్రారంభించారు. తరువాయి 'వందేహం జగద్వల్లభం' హంసధ్వని రాగం ఖండచాపు తాళం లో అన్నమయ్య కీర్తన, తదుపరి త్యాగరాజ కృతులు బిందుమాలిని రాగం, ఆది తాళం లో 'ఎంతముద్దో', 'కమలాప్తకుల'-బృందావన సారంగ, 'ఉపచారము జేసే'-భైరవి, 'చాలా కల్లలాడగ'-ఆరభి, 'నన్నువిడచి కదలకురా'-రీతిగౌళ-మిశ్రచాపు తాళం, అనంతరం ప్రధానాంశంగా కళ్యాణి రాగంలో నిధిచాలా సుఖమా-మిశ్రచాపు తాళం అనంతరం దేశ్ రాగంలో భజన్, బేహాగ్ రాగం లో అన్నమయ్య కీర్తన 'నారాయణతే నమో నమో', సింధుభైరవిలో 'తంబూరి మీటెదవా' పురందరదాస కృతి, చివరిగా శ్రీ శ్రీ మహాస్వామి వారి 'మైత్రీం భజతాం కృతి', పవమాన సుత మంగళం తో కచేరీని ముగించారు. ఈ కచేరీ ఆద్యంతం చాలా చక్కగా వీనుల విందుగా సాగింది.

ఈ సందర్భంగా ప్రముఖ గాత్రవిద్వాంసులు శ్రీ ప్రాతా కృష్ణ మూర్తి, కచేరీ గురించి విశ్లేషిస్తూ శ్రీ సాయి గోవింద్ చిన్న వయసులోనే మంచి మనోధర్మం తో రాగాలాపన స్వర కల్పన, భావయుక్తంగా కీర్తనలను పలికించారని కొనియాడారు. అలాగే వాయులీనం పై ఆకాశవాణి విశ్రాంత కళాకారులు శ్రీ సత్యవాడ వేణుగోపాల్ ప్రతి అంశంలోనూ తన ప్రతిభ కనబరస్తూ చక్కని సహకారాన్ని అందించారని ప్రశంసించారు, అలాగే మృదంగం పై శ్రీ ఆనంద శ్రీహరి మంచి కుడి ఎడమ అనుసంధానం కనబరచి, చక్కని తనియావృత్తం అందించారని ప్రశంసించారు. మంచి కచేరీ ని నిర్వహించిన శ్రీ విజయ త్యాగ రాజ సంగీత సభ వారిని అలాగే విచ్చేసిన శ్రోతలందరినీ అభినందించారు.

కళాకారులను కమిటీ సభ్యులు యధోచితంగా సత్కరించారు.

అనంతరం, ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రం నుండి ఇటీవలే గాత్రంలో 'ఏ' గ్రేడ్ పొందిన విద్వాన్ శ్రీ ప్రాతా కృష్ణ మూర్తి గారిని సభ కార్యదర్శి శ్రీ

చాగంటి లక్ష్మణేశ్వర శర్మ, సభ ఉపాధ్యక్షులు శ్రీ డి.వి. గంగాధరం మరియు ప్రముఖ మృదంగం విద్వాంసులు శ్రీ జి. వెంకట్రావు శాలువ, ఫలములతో సత్కరించారు.

ఈ కార్యక్రమం ఆద్యంతం వీనుల విందుగా సాగింది.

**మంథా జ్వాలాప్రసాద్**
విశాఖపట్నం.

## శ్రీ విజయ త్యాగరాజ సంగీత సభ మరియు శ్రీ శంకర మఠం, విశాఖపట్టణం లో స్వర్గీయ ద్వారం నరశింగ రావు జయంతి వేడుక



శ్రీ విజయ త్యాగరాజ సంగీత సభ మరియు శ్రీ శంకర మఠం, విశాఖపట్టణంలో స్వర్గీయ ద్వారం నరశింగ రావు జయంతి వేడుక సందర్భంగా 5-9-2024 తేది సాయంత్రం 6-30గం.లకు, విశాఖపట్నం శంకరమంఠం నందు, ఆహూతులైన ప్రముఖ సంగీత విద్వాంసులు, రసజ్ఞ ప్రేక్షకుల సమక్షంలో ప్రముఖ వాయులీన విద్వాంసులు శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల మాధవ్ గారికి **"సంగీత సుధానిధి"** బిరుదు ప్రదానం ఘనంగా జరిగింది.

అనంతరం శ్రీ ఎన్.సి. మాధవ్ వాయులీన సభ కచేరీ ఆద్యంతం చాలా హృద్యంగా జరిగింది. వీరికి మృదంగం పై విద్వాన్ శ్రీ మంగళగిరి శ్రీధర్ చాలా చక్కని సహకారం అందించారు.

ఈ కార్యక్రమానికి బ్రహ్మశ్రీ చాగంటి సన్యాసి రాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి గా గౌరవనీయులు విశాఖ మ్యూజిక్ అకాడమీ పూర్వ కార్యదర్శి శ్రీయం.యస్. శ్రీనివాస్, ఆత్మీయ అతిధి గా సంగీత సుధానిధి విదుషి.డా.గౌరీ రామ్మోహన్ సభలో పాల్గొన్నారు.

వాయులీన కచేరీ ముద్దుమోము –సూర్యకాంతి రాగం–త్యాగరాజ స్వామి వారి కృతి, ఆరగింపవే– తోడి రాగం–త్యాగరాజ స్వామి వారి కృతి అనంతరం హైమవతి రాగం లో రాగం తానం పల్లవి "వేంకట దుర్గ విజయేశ్వరం శ్రీనివాస నరసింగం" ఆదితాళం చివరి గా రేవతి రాగం తిల్లాన తో కచేరీ ముగిసింది.

శ్రీ మాధవ్ గారు తోడి రాగాలాపన, హైమవతి రాగం, తానం, పల్లవి లో సాహిత్య విశేషం, ఆలాపన, తానం, స్వర కల్పనా విన్యాసం రసజ్ఞులను బాగా ఆకట్టుకుంది. శ్రీ మంగళగిరి శ్రీధర్ మృదంగం పై చాలా హృద్యంగా అలరించారు. తనియావృత్తం లో తన ప్రతిభ కనబరచి ప్రేక్షకులను ఆకట్టున్నారు.

ఈ కచేరీ ప్రాయోజకులు డా. సి.వి. సూర్యారావు సమస్మరణగా, చెలికాని అప్పారావు సమస్మరణగా శ్రీమతి పద్మిని సమర్పించారు.

**జ్వాలాప్రసాద్**

# శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం, గుంటూరు




శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం, గుంటూరు . వారి ఆధ్వర్యంలో శ్రీ త్యాగరాజకళా వేదికపై 22సెప్టెంబర్ ఆదివారం జరిగిన సంగీత కార్యక్రమాలలో,ఉదయం 9గంటలనుండి 2గంటల వరకు 3 విభాగాలలో సంగీత పోటీలు నిర్వహించ బడినవి.

సాయంత్రం 6:30 కు విశాఖపట్నం కు చెందిన వర్ధమా న గాయనీమణులు కుమారి NVSL. ప్రసన్న, కుమారి KVN. కృష్ణ ప్రియల యుగళ గాత్ర సంగీత కచేరి జరిగింది. తొలుత తోడి వర్ణం తో ఆరంభించి, మంచి పాఠాంతరం, చక్కని విన్యాసాలతో సాగింది. తదుపరి బేగడ రాగ దీక్షితులవారి రచన " వల్లభనాయకస్య" భావగర్భితంగా గానంచేశారు. అనంతరం మాయామాళవగౌళ లో స్వాతి రచన "దేవదేవకలయామి" స్వరసహితంగా గానంచేశారు. ఆపై బాలమురళి గారి ఖమాస్ రాగరచన "అమ్మనిన్ను కోరినకోరిక", తదుపరి సింహేంద్ర మధ్యమం రాగం పాడి మైసూర్ వాసుదేవాచార్యుల వారి రచన "నిన్నే నమ్మితి నయ్య "స్వర సహితంగా గానం చేసారు. కీర్తన గానం స్థిమితంగా పాడి రక్తి కట్టించారు. తదుపరి త్యాగరాజస్వామి వారి అపురూప రాగరచన శృతిరంజని లో " ఏదారి సంచరింతురా" జనరంజకంగా వుంది. ప్రధానాంశంగా మోహన రాగం తానం పల్లవి,పల్లవి ఖండజాతి త్రిపుట తాళం తిశ్రనడలో తీసుకొన్నారు. రాగాలాపన సంగతుల కూర్పుపై మరింత శ్రద్ధ వహించవలసింది. తానం పల్లవి ఇంకా దురితం గాను,సంగతుల కూర్పు పై మరింత దృష్టి ఉంటే బాగుండునని పించింది. మృదంగం పై సురేషబాబు గారు వయొలిన్ తో నందకుమారు గారు తన అనుభవంతో తగిన సహాయ సహకారాల నందించి చిరంజీవుల కు మంచి తోడ్పాటు నిచ్చారు. సురేష్ బాబుగారి మృదంగం, తన్యావర్తనమ్ కార్యక్రమానికి వన్నెతెచ్చింది. నాటి కార్యక్రమానికి ప్రక్కవాయిద్యాలు పక్కా వాయిద్యాలుగా భాసించాయి. కళాకారుల పరిచయం సన్మానం తదుపరి ఒకటి రెండు లలితశాస్త్రీయ అంశాల తరువాత మంగళంతో కచేరి ముగిసింది. భవిష్యత్తులో పరిణితి చెంది మరింత గొప్ప కళాకారులు కాగలరని వారి పాట ఆశలు కలుగ జేసింది.

నాటి కార్యక్రమాన్ని సంఘ గౌరవ కార్యదర్శి శ్రీ కృష్ణ కిషోర్ నూతన యువ కార్యవర్గ సభ్యుల సహకారంతో దిగ్విజయంగా నిర్వహించారు.

**–గిరిజాశంకర్.**

# కార్తికేయ కళాక్షేత్రంలో గురుపూర్ణిమ మహోత్సవాలు







స్థానిక (విశాఖపట్నం) లైబ్రరీ హాల్ యందు గురుపూర్ణిమ సందర్భముగా జూలై 20వ తేదీన కార్తికేయ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ''గురుపూజోత్సవం'' ఘనంగా జరిగింది. సంగీత విద్వన్మణి శ్రీమతి మల్లాప్రగడ జోగులాంబ గారి జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు, శిష్యులు కలసి ప్రముఖ గాయక విద్వన్మణి సంగీత కళాసాగర శ్రీమతి ముట్నూరి జలజాక్షిగారికి 'మహతి నాదనిధి' అని బిరుదుతో సత్కరించిరి. ఈ కార్యక్రమానికి అతిథులుగా శ్రీ కె. సత్యనారాయణ (ఆకాశాణి విశ్రాంత నిర్దేశకులు) డా. జె.వి.యస్.ఎన్. మూర్తి (రిటైర్డ్ ప్రిన్సిపాల్, బి.వి.కె. కాలేజి) విచ్చేసి కార్యక్రమంలో పాల్గొన్నారు. నగరంలో సంగీత విద్వాంసులు, కళాకారులు, విద్యార్థులు, అధిక సంఖ్యలో హాజరై సభను జయప్రదం చేసారు. సన్మాన అనంతరం డా. నిష్టల కృష్ణవేణి చే వీణావాదన కార్యక్రమం సభికులను అలరించింది. వారు శ్రీ డా. మంగళంపల్లి బాలమురళీకృష్ణగారి రచనలు తీసుకొని వాటిని ప్రదర్శించారు. షణ్ముఖప్రియ రాగంలో వర్ణం, శ్రీ సకల గణాధిప – ఆరభిరాగం, బృహదీశ్వర, కానడ, ముఖ్యాంశముగా శ్రీ దక్షిణామూర్తి, కీరవాణి రాగం ప్రదర్శించారు. దీనిలో రాగమాలికా తానంలో బాలమురళీగారి సృష్టించిన రాగములలో (మహతి, మోహనాంగి, రోషిణి) రాగములను ప్రదర్శించి, సభికులను అలరించిరి. చివరగా ఆహిర్ భైరవ్ తిల్లానా, నజానీ, హమీర్ కల్యాణి ప్రదర్శించి, మధ్యమావతి బాలమురళీ మంగళముతో కార్యక్రమమును ముగించిరి. వీరికి శ్రీమతి వేదుల అరుణ వీణపై, శ్రీ యం. ఏడుకొండలు మృదంగంపై, శ్రీ హనుమంతరావు ఘటంపై చక్కని సహకారం అందించారు.



**శ్రీ భారతీ తీర్థ మహాస్వామి వారి పట్టాభిషేక స్వర్ణోత్సవాలలో శృంగేరి శారదా దేవి సన్నిధిలో కథాగానం చేసి స్వామివారి ఆశీస్సులందుకొంటున్న "వాచస్పతి" శ్రీ ముప్పవరపు సింహాచల శాస్త్రి భాగవతార్**

# శ్రీరామ సమాజం (రి) కాకినాడ

## వారి 130వ వినాయక చవితి సంగీత నృత్య హరికథా మహోత్సవాలు

ది. 7-9-2024 వినాయకచవితి నుండి ఆరంభమయి 15-9-2024 వరకు కాకినాడ సూర్యకళామందిరంలో తొమ్మిది రోజుల పాటు దిగ్విజయంగా సాగాయి.

మొదటిరోజు ది. 7-9-2024 సాయింకాలం సరిగ్గా 5.30 గంటలకు స్థానిక సంగీత గురువుల శిష్యులు పాల్గొని నారాయణ తీర్థ తరంగాలను, రామదాసు కీర్తనలను భక్తిగా, రక్తిగా వినిపించారు. మొదటగా సంగీతవిదుషి శ్రీమతి పెద్దాడసూర్యకుమారి శిష్యులు ''మాధవ మామవదేవా; బాలగోపాల బాలపాహిపాహి, పూరయ మమకామం'' వినిపించారు.

తరువాత విదుషి శ్రీమతి చావలి సూర్యకుమారి మరియు వారి శిష్యులు శ్రీమతి టి. పద్మావతి మరియు ప్రశిష్యులు పాల్గొని ''పాహిపాహి జగన్మోహనకృష్ణ'' కృష్ణం కలయసఖీ సుందరం, శరణం భవ వినిపించారు.

అనంతరం సంగీత విద్వాన్ శ్రీ మహేంద్రవాడ నరసింహమూర్తి యానం నుండి తమశిష్యులతో వచ్చి రామదాసు కృతులు ''చరణములే నమ్మితి'', ''ఓ రఘునందన'', ''ఎందుకు కృపరాదశ్రీరామ'' వినిపించారు.

సంగీత విదుషి శ్రీమతి చిలుకూరి సుబ్బలక్ష్మి శిష్యులు ''పాహిపాహిమాం దుర్గే'' ''జయజయ దుర్గే'' తరంగాలను వినిపించారు.

విదుషి శ్రీమతి మండ విజయకుమారి శిష్యులు జయజయ వైష్ణవి దుర్గే అంశం వినిపించారు.

విదుషి శ్రీమతి ప్రభల సూర్యకుమారి శిష్యులు ముగ్గురు రామదాసు కీర్తన ''అదిగో భద్రాద్రి'' వినిపించారు.

క్లారినెట్ పై యువ విద్వాంసుడు శ్రీ ఎన్. శ్రీను రామకృష్ణగోవిందనారాయణ – సింధుభైరవి కృతిని వినిపించారు.

చివరగా వర్ధిష్ణు యువకళాకారుడు చి. యం. యం.యం. ప్రవీణ్ కుమార్ ''రారా నా వెన్నముద్ద'', ''శ్రీరాముల దివ్యనామము'' అంశాలతో శెభాష్ అనిపించుకొన్నారు.

ఈ కార్యక్రమానికి శ్రీ యం. నరసింహమూర్తి, శ్రీ వట్టూరి మహేష్ వైలన్ పై, శ్రీ అనిపిండి అనిల్ కుమార్ మృదంగంపై, శ్రీ తెలుగు పవన్ కుమార్ ఘటంపై సహకరించారు.

ప్రధాన కచేరీలో రాత్రి 6.45 గం.లకు శ్రీ నవనీత కృష్ణన్ – చెన్నైవారు చక్క చక్కని సంప్రదాయ సంగీత కచేరీని వినిపించారు. సిద్ధి వినాయకం, వాడేరా దైవము, కలిగియుంటే కదా! వంటి అంశాలు దీటుగా రాణించాయి. ప్రశాంతమైన – నిజమైన – మనోరంజికమైన వారి గానం విజయపథంలో సాగింది. శ్రీ పప్పు జ్ఞానదేవ్, శ్రీ కమలాకర్ యోగీశ్, శ్రీ సరస్వతుల హనుమంతరావుల (ఘటం) వాద్యసహకారం సహజ రంజకంగా భాసిల్లింది. ఒక చక్కని నిజమైన ప్రశాంతమైన కర్ణాటక సంగీత కచేరీవిన్నామన్న తృప్తితో శ్రోతలు కళాకారులను

అభినందించారు. కళాకారులు, సభ్యుల దీపారాధనతో సభ ప్రారంభమైంది.




8-9-2024 ఆదివారం రెండవరోజు కార్యక్రమం ఒక ప్రత్యేక కార్యక్రమమై భాసిల్లింది.

కాకినాడ వాస్తవ్యులైన శ్రీ ఆకొండి శ్రీనివాస రాజారావు తమ తల్లి సత్యవతి గారివద్ద, పిదప స్వర్గీయ అల్లంరాజు సోమేశ్వరరావు గారి వద్ద సంగీతం నేర్చుకొని కచేరీ స్థాయికి ఎదిగి, ఆకాశవాణి సంగీత పోటీలలో గెలిచి రాణించి, పిమ్మట సంగీత కళానిధి శ్రీ నేదునూరి కృష్ణమూర్తి గారివద్ద మెరుగులు దిద్దుకొన్న సీనియర్ శిష్యులు.

గానమే కాకుండా, సంగీత రచనలలోను మేలుబంతిగా సంగీత విద్వాంసుల, పండితుల మెప్పు పొందినవారు. వారి రచనలు వందకు పైగా సంగీత ప్రియులకు అందుబాటులో వున్నాయి. వారు శ్రీరామ సమాజ అధ్యక్షులు కూడా. వారి షష్టి పూర్తిని పురస్కరించుకొని సమాజం ఒక విశిష్టమైన కార్యక్రమం తలపెట్టి రోజంతా వారి కార్యక్రమాలను ఏర్పరిచింది.

ఇందులో ముందుగా సాయింకాలం 5.30 గంటలకు యువ నాట్యాచార్యులు, ఎమ్.ఏ; కూచిపుడిలో బంగారు పతక విజేత, సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత శ్రీ బి. మల్లికార్జునరావు నిర్వహణలో, నేతృత్వంలో మరికొంతమంది నాట్యాచార్యులు వారి శ్రీమతులు ఎంపిక చేసిన రాజారావుగారి ఐదు రచనలకు నాట్యాభినయాన్ని జోడించి రమ్యంగా ప్రదర్శించి రసమయం చేశారు.

ఇందు వెంకట పైడారావు ఇమంది – అర్చన ఇమంది; పవన్ కుమార్ చక్రవర్తుల – సృజన రవిచంద్రిక చక్రవర్తుల – హేమాద్రి బద్రీనాథ్, గణేష్ హరి హరన్ ఉప్పులూరి, ఆరభి వెంట్రప్రగడ, పట్టనీలిమ, పావని; బచ్చుల మల్లికార్జునరావు – సౌమ్య బచ్చుల; పిల్లి దుర్గారావుగారలు ప్రేక్షకుల ఆనందోత్సవాల మధ్య అద్భుతమైన ప్రదర్శన అందించారు.

"అంబాపరాకు" ప్రార్థనాగీతంతో ప్రారంభించి ఆకొండి శ్రీనివాస రాజారావుగారి రచనలలో ఐదు అంశాలు "లం బీజ రూపాయ" – రాగం గౌళ, ఆది. నట్టువాంగం: చక్రవర్తుల పవన్ కుమార్. గాత్రం: శ్రీమతి సృజన రవి చంద్రిక. నృత్య కల్పన చేసినవారు మరియు ప్రదర్శించినవారు నాట్యాచార్యులు శ్రీమతి & శ్రీ అర్చన పైడారావు (శ్రీ హరిహర ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు, కాకినాడ

2. సదాశివుడు కొలువై ఉన్నాడే... రాగం : సురటి, ఆదితాళం. నృత్య దర్శకత్వం: శ్రీమతి CH. లక్ష్మి శాంతి (స్వరనర్తన నృత్య సంగీత విద్యాలయం, కాకినాడ) నర్తకీమణులు: చి. వైష్ణవీ ఆరభి, నీలిమ, పావని, వర్షిణి.

3.ఉమాతనయ: రాగం హంసధ్వని, ఆదితాళం. నృత్యదర్శకత్వం: శ్రీమతి బి.సౌమ్యారావు

గాత్రం సహకారం: గణేష్ హరిహరన్. ప్రదర్శించినవారు: శ్రీ బి.మల్లికార్జునరావు, శ్రీమతి సౌమ్యరావు.

4.వకుళనందన:రాగంబృందావనసారంగి.ఆది తాళం. నృత్యదర్శకత్వం శ్రీ మల్లికార్జునరావు. ప్రదర్శించినవారు: చిరంజీవులు చంద్రకళ,సుబ్బలక్ష్మి, మేఘన,వెంకటలక్ష్మి.

5.దరి కననైతిని శ్రీరామా రాగం : రంజని, ఆది తాళం. నృత్య దర్శకత్వం: శ్రీ చక్రవర్తుల పవన్. కుమార్. నట్టువాంగం: శ్రీ బి.మల్లికార్జునరావు. ప్రదర్శకులు : శ్రీ హేమాద్రి బదరీనాథ్, శ్రీ చక్రవర్తుల పవన్ కుమార్, శ్రీమతి సృజనరవిచంద్రిక. వాద్య సహకారం: వయొలిన్ పై శ్రీ పురాణం గణపతిరావు. వేణువు పై శ్రీ బి వి ఎస్ శర్మ, మృదంగం–శ్రీ ఎ.అనిల్ కుమార్.











ఓ వాగ్గేయకారుని జీవితంలో ఇది అపురూప ఘట్టమై భాసించింది. కళాకారుల శ్రమ, అంకితభావం వ్యక్తమై కార్యక్రమం చిరస్మరణీయంగా నిలచింది.

నాట్యాచార్యులు, కాకినాడ నృత్య సమాఖ్య బాధ్యులు, సహృదయులు శ్రీ ఆనం ప్రసాద్ నృత్యకళాకారుల పరిచయాన్ని, వారు ప్రదర్శించే కీర్తనాంశాన్ని సభకు పరిచయం చేస్తూ చక్కని వ్యాఖ్యానంతో సహకారం అందించారు.

రెండవ కార్యక్రమంలో శ్రీ ఆకొండి రచించిన మరో అపురూప గ్రంథం "కాకినాడ సంగీత సౌరభం" ఆవిష్కరణ పెద్దలు, సరస్వతీగానసభ అధ్యక్షులు, తూర్పుగోదావరి జిల్లా సంఘం అధ్యక్షులు శ్రీ కె.వి. యస్. ఆంజనేయమూర్తి గారి నిర్మలహస్తాలమీదుగా జరిగి అందరి మెప్పు పొందింది.

కాకినాడ కళలకు కాణాచి. అందునా సంగీతానికి అందించిన సేవ అనన్య సామాన్యం. 130 సంవత్సరాల పూర్వమే మునుగంటి శ్రీరాములు పంతులు చేసిన సంగీత సేవ, అందించిన కార్యభూమి, వారి శ్రీరామ సమాజం, 121 ఏళ్ల సరస్వతీ గానసభ– మరెందరెందరో విద్వన్మణులు – సంగీత సభలు వీటి చరిత్రను సాధికారికంగా గ్రంథస్థం చేసి రాజారావుగారు చరిత్రలో నిలచిపోయారు.

ఈ సందర్భంలో కూచి వెంకట సీతారామాంజనేయమూర్తి (కె.వి.యస్. ఆంజనేయ మూర్తి) వారి గురించి ప్రస్తావించి తీరాలి.

సంగీత ప్రియులు, ఆదరణ శీలి, ప్రముఖ ఆడిటర్ ప్రఖ్యాతమైన సరస్వతీగానసభకు అధ్యక్షులుగా కార్యభారం వహిస్తున్నవారు ఈ గ్రంథం రూపుదిద్దుకొనడానికి, అచ్చుపొందడానికి వారు ఒక్క మాటలో సమస్త సౌకర్యాలు కల్పించారు. తూర్పుగోదావరి సంఘం నుండి పూర్తి ఆర్థిక సహాయం అందించడంలో వారి కృషి అనన్యసామాన్యం. రచయిత వారికి సర్వదా, శతధా కృతజ్ఞుడు.

పుస్తకావిష్కరణ చేసిన శ్రీకూచి ఆంజనేయమూర్తి తమ ప్రసంగంలో "ఈ పొత్తాన్ని మొత్తం చదివాను. అపురూప అంశాలు కనిపించాయి. రాజారావు గారి శ్రమ ఫలించింది. ఇది లోకానికందడంలో మా తూర్పు గోదావరి జిల్లా సంఘసభ్యులు అందించిన సహకారానికి నేను గర్విస్తున్నాను. వారికి అభినందనలని తెలిపారు."

ఈ గ్రంథాన్ని కవి, విమర్శకులు, సంగీతాభిమాని శ్రీ వక్కలంక వెంకటకృష్ణారావు సమీక్ష చేస్తూ ఈ నాటికీ జన బాహుళ్యానికి తెలియని ఎన్నో అంశాలు రాజారావు ఇందులో ప్రోదిచేసి అందించారని, సంగీతలోకం వారికి ఋణపడి వుందని తెలుపుతూ సంగీతానికి మునుగంటి వారి వంశీకులు అందించిన, అందిస్తున్న సేవ, దాతృత్వం కూడా అసామాన్యమని కొనియాడారు. కాకినాడలో అనేక సంగీత సభలు, సంస్థలు, కళాకారుల గురించి పరిశోధించి అందించడం పిహెచ్.డి. కి తక్కువ కాదని ప్రశంసించారు.

శ్రీ ఆకొండి శ్రీనివాసరాజారావు తన ప్రసంగంలో ఈ గ్రంథం వెలుగుచూడటానికి కారణభూతులైన అందరికీ, ఆర్థిక సహాయంకై సహకరించిన శ్రీ కె.వి.యస్. ఆంజనేయమూర్తిగారికి, గురువులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

అనంతరం జరిగిన సంగీత సభలో శ్రీ రాజారావు గారి రచనలను విదుషి శ్రీమతి భమిడి లలితామాధవ్ శృతిపక్వంగా – సహజ సుందరంగా, భావావేశంగా పాడి రంజింపచేశారు.

శ్రీ సరస్వతుల పార్థివ, శ్రీమంగళగిరి శ్రీధర్ చక్కని సహకారం అందించారు.




మేఘరంజని రాగవర్ణం – నీలమేఘవర్ణ; ఉమాతనయ, హంసధ్వని; కాపాడవె కన్నతల్లి

– రీతిగౌళ, ఉపప్రధానాంశం పుట్టకొండలో వెలసిన నరసింహ – పూర్వీకల్యాణి; ప్రధానాంశం "సదా వటతరుమూలవాసినం" – మధ్యమావతి; శుద్ధ ధన్యాసిలో తిల్లనా వంటి అంశాలు చోటు చేసుకొన్నాయి. శ్రోతలు కరతాళధ్వనుల మధ్య గాయని లలితామాధవ్ ను, రచయిత శ్రీ రాజారావును అభినందించారు.

మూడవరోజు 09-09-2024 సాయంకాల సభలో చెన్నై విద్వాంసులు శ్రీ అభిలాష్ గిరిప్రసాద్ చక్కని గాత్ర ధర్మాన్ని ప్రదర్శించి స్పష్టమైన ఉచ్చారణతో వాతాపి గణపతిం, ఉపచారములు చేసేవారున్నారని, వాసుదేవయని, పాలించుకామాక్షి వంటి అంశాలతో కచేరీ రక్తి కట్టించారు. శ్రీ పప్పు జ్ఞానదేవ్ వయొలిన్ పై సహకరించగా యువ కళాకారుడు కాకినాడ వాసి విదుషి శ్రీమతి చిలుకూరి సుబ్బలక్ష్మి, మృదంగ విద్వాంసులు శ్రీ భాస్కర శాస్త్రి కుమారుడు చి. అభిరామ్ చిలుకూరి మొదటిసారిగా పెద్ద కచేరీకి అరంగేట్రం చేశాడు.

వారి గురువులు చెన్నై విద్వాంసులు శ్రీ నైవేలీ వెంకటేష్ గురించి చెప్పుకోవాలి. ఈ కార్యక్రమానికి శిష్యుని సర్వవిధముల సిద్ధం చేసి – గాయకునితో మాట్లాడి అన్ని ఏర్పాట్లు చేసి, సహకరించి, శిష్యుని ఎదుగుదలకు తోడ్పడిన అపూర్వ గురుదేవులు. శ్రీ కె.వి. రామకృష్ణ తెనాలివారు ఘటసహకారం వారి అనుభవాన్ని రంగరించింది.

యువ విద్వాంసులను ప్రోత్సహించడంలో శ్రీరామ సమాజం 130 ఏళ్ళుగా చేస్తున్న సేవ, తెలుగుకళాకారులకు కల్పిస్తున్న అవకాశాలు, అదే సమయంలో సంగీత విద్వాంసులు ఎక్కడి వారైనా, ఏప్రాంతం వారైనా ఆహ్వానించి కార్యక్రమాలను ఏర్పాటుచేయడం సాంప్రదాయంగా కొనసాగిస్తున్నది.

10-09-2024 న ప్రకటించిన హరికథకు బదులుగా శ్రీ పప్పుజ్ఞానదేవ్ వైలన్ సోలో కచేరీ వారికి ఒక సదవకాశంగా, శ్రోతలకు వీనుల విందుగా జరిగింది. ప్రణమామ్యహం, సాధించెనే, తెలియలేరు, ప్రక్కల నిలబడి వంటి అంశాలు శ్రవణ శుభగంగా వారు అందించారు. వారికి లభించిన కచేరీ అవకాశాన్ని సద్వినియోగపరచుకొని తానేమిటో సంగీత లోకానికి చెప్పకనే చెప్పారు.

ఆఖరి క్షణంలో పిలిచినా ఆహ్వానాన్ని మన్నించి మృదంగ విద్వాంసులు శ్రీ వారణాసి శ్రీనివాస్ పెద్ద మనసుతో మృదంగ సహకారం అందించారు. శ్రీ అనిల్ కుమార్ ఘటసహకారం అందించారు.

11-09-2024 న జరిగిన యుగళగాత్ర కచేరీ శ్రోతలు మరువలేనిది. సర్వేపల్లి సోదరీమణులుగా వినుతికెక్కిన కుమారీలు డా. శ్రేయ, డా. రాజలక్ష్మి యం.బి.బి.యస్ చేస్తూ సంగీత రంగాన తమదైన ముద్రను వేసుకొన్నారు. శ్రీ వైజర్స్ బాలసుబ్రహ్మణ్యం, సంగీతకళానిధి, పద్మభూషణ్ శ్రీమతి డా. సుధారఘునాధన్ శిష్యులు వీరు.

చురుకైన సొగసైన, ఇంపైన గాత్రధర్మం పాటిస్తూ శ్రోతలను అలరించారు.

ఓంకార ప్రణవ – శ్రీబాలమురళీగారి పదవర్ణంతో చురుకుగా ఆరంభించి ఆధోరణిలోనే చిదంబర భారతి రచన 'పాహిపాహి బాలగణపతే' హంసధ్వనిలో వినిపించి 'గణపతే' దగ్గర ఒద్దికయిన

స్వరకల్పనతో అలరించారు. నీ చరణాంబుజములు, రాగాలాపన – నెరవల్; రామచంద్రం భావయామి; మధ్యమావతి రాగం తానం పల్లవి ఖండజాతి త్రిపుట తాళం గ్రహభేదంలో హిందోళ – మోహనలను ఆవిష్కరించి 'నాయకం వినాయకం విఘ్నవినాయకం' సిద్ధి బుద్ధి సమేత గణ.... నాయకం'' అనే సాహిత్యం తో నాట, మోహన, కళ్యాణి, బహుదారి రాగాలకు చోటు కల్పించారు.

తద్ధింశంకర – హంసానంది గణపతి సచ్చిదానందుల దివ్యనామ సంకీర్తన, డంగురవ సారిరమ్య – పురందర దాసుల కీర్తన, నానాటి బ్రతుకు, పలుకే బంగారమాయనా, స్వాతితిరునాళ్ ధనశ్రీ తిల్లానా అంశాలతో రసప్లావితంగా ముగించారు.

వైలన్ పై సహకరించిన కుమారి గాయత్రి విభావరి వ్యాకరణం లబ్ద ప్రతిష్టురాలైన యువ వైలన్, గాత్ర కళాకారిణి. యుగళానికి దీటుగా తన సహకారం రంజకంగా సాగింది. తన ప్రతిభను వెలార్చింది. అలాగే మృదంగ విద్వాంసుడు శ్రీ కుందుర్తి అరవింద్ చక్కని సొగసైన, అనుసరణీయమైన వాద్య సహకారం, ముచ్చటైన తన్యావర్తనంతో అలరించాడు.

12-09-2024 ఆనంద్ కె. రాజ్ – త్రిసూర్ – కేరళవారి గాత్రసభ చక్కని గాత్రధర్మంతో సాగింది. శ్రీ మహదాస్ శ్యామనీలాద్రిరావు, శ్రీమహదాసు ఏడుకొండలు వాద్యసహకారం పోషకంగా సాగింది. వారి వారి అవకాశాలను సంపూర్ణంగా వినియోగించుకొన్నారు.

హమీర్ కల్యాణిలో వర్ణం, శ్రీ గణేశ, అభిమాన మెన్నడు గలుగు రామ – బేగడ – పట్నం వారు; శ్రీ కమలాంబ, దుర్మార్గచరాధముల, రామకథ వంటి అంశాలు వీరి కచేరీలో చోటు చేసుకొన్నాయి. వర్ధిష్ణు కళాకారునిగా ప్రోత్సహించదగిన చక్కని కళాకారులు వీరు.

13-09-2024, 7వ రోజు సాయంకాలం శ్రీమతి కస్తూరి కమలదీప్తి గాత్ర సంగీత సభ ప్రత్యేకతను సంతరించుకొన్నది. శ్రీ మహదాస్ శ్యామ నీలాద్రిరావు, శ్రీ మహదాసు ఏడుకొండలు వాద్య సహకారం దీటుగా అందించారు. మహాగణపతింభజే, దేవదేవంభజే, పార్వతినినునే, ననుబ్రోవమని, నగుమోము ప్రధానంశంగా, చివరలో తిల్లానతో కచేరీ ముగించారు. ఆకాశవాణి ఏ గ్రేడు కళాకారిణి అయిన శ్రీమతి కమలదీప్తి తన ప్రతిభనంతా చూపి కచేరీ రక్తివంతం కావడానికి కావలసిన వనరులన్నీ సమకూర్చుకొన్నారు. ప్రతి అంశంలోను ఆమె తన ముద్రను చూపించారు. స్థిమితమైన, రసవంతమైన, క్రమశిక్షణాయుతమైన ప్రదర్శనగా భాసిల్లింది. సంప్రదాయబద్ధమైన శిక్షణ లభిస్తే కళాకారుని కచేరీ ఎలా వుంటుందన్నదానికి ఆనాటి సభ ఉదాహరణ.

14-09-2024 న మొదటగా సా. 5.30 గంటలకు స్థానిక కళాకారులైన సర్వశ్రీ బి.వి.ఎస్. శర్మ నేతృత్వంలో వారు వేణువుపై, బందరు వీరుబాబు శాక్సోఫోన్ పైన, మహేంద్రవాడ నరసింహమూర్తి వైలన్ పైన, నాటకురంజి వర్ణం ఆదితాళంతో మొదలు పెట్టి, వాతాపిగణపతిం – ఎందరో మహానుభావులు, వాసుదేవయని, వెంకటాచల నిలయం తదితర అంశాలను ఒక గంటపాటు వినిపించారు. మూడు వాద్యాల సంపుటీకరణ సరసంగా సాగి శ్రోతలకు

చక్కని అనుభూతిని కల్పించింది. ఇటీవలే వీరు టి.టి.డి. నాదనీరాజనంలోను స్వరకైంకర్యం చేసి మెప్పుపొందారు.

శ్రీ కె. సూరిబాబు – కపిలేశ్వరపురం మృదంగంపై, శ్రీ అనిల్ కుమార్ – కాకినాడ ఘటంపై అనుగుణమైన సహకారం అందించారు. అనంతరం హైదరాబాద్ నివాసులు శ్రీమతి విజయ వల్లీ భరద్వాజ్ భాగవతారిణి "పార్వతికల్యాణం" హరికథను యథా సాంప్రదాయంగా, సమయోచిత చెణుకలతో, సార్వజనీనమైన ముచ్చటలతో రెండున్నర గంటలు చెప్పారు.

శ్రీ పి. భరద్వాజ్, శ్రీవాసుదేవమూర్తి వాద్య సహకారాలు తగువిధంగా సాగాయి. హరికథా సాంప్రదాయాన్ని పరిపూర్ణంగా నిలిపి కథాగానం అందిస్తున్న శ్రీమతి విజయవల్లి భాగవతార్ గారు ప్రసంశనీయులు. సాంప్రదాయం ప్రకారం శ్రోతలు ఆమెకు చదివింపులు కూడా చేసారు.

చివరిరోజైన 15-09-2024 ఆదివారం కార్యక్రమాలలోప్రశంసించదగ్గమరోకార్యక్రమమంగా చోటుచేసుకొన్నది "శాంకరి నాట్యస్థల్" వారి "ఆతడే పరబ్రహ్మము" శీర్షికన సాగిన వివిధ వాగ్గేయ కారుల రచనలతో ఆవిష్కరామైన నాట్యకథాసమాహారం.

నాట్యగురువు 'నాట్యసరస్వతి' ఇత్యాది పలు పురస్కారాల గ్రహీత శ్రీమతి యేలేశ్వరపు విజయవల్లీ భరద్వాజ్ హైదరాబాద్ లో ప్రఖ్యాతమైన సంస్థగా 'శాంకరి నాట్యస్థల్' సంస్థను నడుపుతున్నారు. దాదాపు 25 మంది నాట్యకళాకారిణులు ఇందు పాల్గొని తమ ప్రతిభను, చురుకును, నిబద్ధతను గురువుల నేతృత్వంలో ప్రదర్శించారు.

రెండున్నర గంటల కార్యక్రమంలో ఎక్కడా ఆగకుండా ప్రేక్షకులు మైమరచిపోయేలా సాగిన కార్యక్రమంలో పురాణాంతర్గతమైన ఎన్నోకథలు ఊపిరిపోసుకొన్నాయి. అభినయానికి ఆలంబనమైనాయి. కేవలం ముగ్గురు – గాత్రం నట్టువాంగం – శ్రీమతి విజయవల్లి; వయొలిన్ – శ్రీ పురిహెళ్ల భరద్వాజ్; మృదంగం, కంజిరా తదితర సన్నాహాలు – శ్రీ వేమూరి వాసుదేవమూర్తి ప్రేక్షకులు అవాక్కయ్యేలా వీరు సృష్టించిన నేపథ్యగానం, వాద్య తరంగం కొనలుసాగింది.

ఎన్నెన్నో పాత్రలు వేదికపై ఆవిష్కృతమై పురాణ కథలను ముందు నిలిపాయి.

శ్రీమతి విజయవల్లి పాత్రోచితమైన గొంతుతో, శైలితో పోషణచేసిన తీరు, వైలన్ పై భరద్వాజ్ సహకారం, వాసుదేవమూర్తి విశ్వరూపం మరపుకురానివిగా కాకినాడ రసికులు భావించారు.

కార్యక్రమానంతరం శ్రీమతులు యం. భారతలక్ష్మి (ఉపాధ్యక్షురాలు) చావలి సూర్యకుమారి (సహ కార్యదర్శిని) విజయవల్లిని సత్కరించగా, అధ్యక్షులు శ్రీనివాస రాజారావు భరద్వాజ్ గారిని, సభ సభ్యులు వైణికులు శ్రీనగేష్ బాబు వాసుదేవమూర్తిగారిని సత్కరించారు. కార్యదర్శి, ట్రస్టీ శ్రీ మునుగంటి వెంకట్రావు సభానిర్వహణ జయప్రదం చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

శ్రీరామసమాజానికి భూమిని దానంచేసిన

స్వర్గీయ శ్రీమతి మునుగంటి సుభద్రమ్మ (సంస్థ స్థాపకులు మునుగంటి శ్రీరాములు గారి సతీమణి) పేరున ప్రతిరోజు సభానంతరం ప్రసాద వితరణ కడుపార జరిగింది.

సభవిజయవంతం చేసి వదాన్యులందరికీ కార్యవర్గం ధన్యవాదాలు అందించింది.

శ్రీగట్టి వెంకట్రావు కళాకారులను ప్రతిరోజు సభకు పరిచయంచేసారు. శ్రీ యం.వి.జి. కృష్ణంరాజు, ఆతిథేయ బాధ్యతలను చూసుకొన్నారు. శ్రీ మణిబాబు ప్రసాద వితరణ ఏర్పాట్లు చేయగా అధ్యక్షులు శ్రీ ఆకొండి శ్రీనివాస రాజారావు పర్యవేక్షణంలో కళాకారుల సంగీత సత్కారాలు, వీడ్కోలు జరిగింది.

సంస్థ న్యాయసలహాదారు శ్రీ అయ్యగారి వెంకటేష్ సంస్థ పూర్వభవన విస్తరణకు ఉన్న అవకాశాలు సభకు వివరించారు.
























(రిజిష్టర్డు 1923)
కూడిన ఏకైక ప్రాచీన
15-09-2024




130వ గణపతి సంగీత హరికథా మహోత్సవాలు


130వ గణపతి సంగీత హరికథా మహోత్సవాలు


130వ గణపతి సంగీత హరికథా మహోత్సవాలు




130వ గణపతి సంగీత హరికథా మహోత్సవాలు







# సరస్వతీ గానసభ (రి) కాకినాడ

కీ.శే. శ్రీమతి లక్కరాజు శేషకుమారి స్మారక సంగీత నృత్య పాఠశాల వార్షిక వేడుకలు ది. 22-9-2024 వారి స్వంత భవనం సూర్యకళామందిరంలో జరిగాయి.

శ్రీ లక్కరాజు సత్యనారాయణ సభానిర్వహణ చేసి అతిథులను ఆహ్వానించారు. అధ్యక్షులు శ్రీ కె.వి.యస్. ఆంజనేయమూర్తి సంగీత పాఠశాల స్థితిగతులను, సేవలను వివరించారు. విదుషి శ్రీమతి పెద్దాడ సూర్యకుమారి పాఠశాలలో ప్రవేశపెట్టబోయే పరీక్షలగురించి, కాలేజీగా మార్చే ప్రక్రియ గురించి వివరించారు.

ముఖ్య అతిథి విద్వాన్ శ్రీ మోదుమూడి సుధాకర్ సభలో పాల్గొంటూ విద్యార్థులకు శుద్ధసారంగ రాగంలో జొన్నవిత్తులవారి ఒక చక్కని గీతాన్ని నేర్పి, సంగీతం దైనందిన జీవితంలో ఎంత ఆవశ్యకమో వివరించారు.

జీవితకాల గౌరవాధ్యక్షులు శ్రీ కొమ్మిరెడ్డి శ్రీరామనరసింగరావు ముఖ్య అతిధిని సన్మానించగా, కార్యదర్శి శ్రీ పేపకాయల రామకృష్ణ పరిచయం చేశారు.

విద్యార్థుల విద్యాపాటవ ప్రదర్శనతో సభ ముగిసింది. స్థానిక సంగీత ప్రియులు, తల్లిదండ్రులు, సంస్థ ఉపాధ్యాయులు, సభ్యులు పెక్కు సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులకు ప్రశంసాపత్రాలను, మెమెంటోలను బహూకరించారు.








**కీ.శే. శ్రీమతి లక్కరాజు శేషకుమారి**



## శ్రీ సద్గురు సంగీత విద్వత్ గానసభ, వరంగల్



శ్రీ సద్గురు సంగీత విద్వత్ గానసభ వరంగల్ లో 38 వ నెలవారీ సంగీత కార్యక్రమము 23-6-2024 ఆదివారం ఉదయం శ్రీ టి పి మోహన్ కుమార్ గారి గాత్ర కచేరి వీనులవిందు గా జరిగింది వీరు మొదటగా అభోగి వర్ణంతో ప్రారంభించి గజవదనాబేదువే, సంగీత జ్ఞానము, బంటురీతి, చక్రవాక రాగములో ఎటుల బ్రోతువో, నిధిచాల సుఖమా కీర్తన లో కళ్యాణి రాగాలాపన, స్వరకల్పన తో కచేరిని రక్తి కట్టించారు. వీరికి వయోలిన్ పై శ్రీ బొడ్డుపల్లి సాయి భార్గవ్, మృదంగంపై శ్రీ ఏడిద భీమశంకర్ సహకరించారు. సభకు ముందు జరిగిన జ్యోతి ప్రజ్వలన కార్యక్రమములో శ్రీ పర్లపల్లి వెంకటరమణ, శ్రీమతి సంగీత, శ్రీ ఉమ్మడి లక్ష్మణాచారి, శ్రీమతి మంద సుజన, శ్రీమతి కనక మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




**10-08-2024 శనివారం పర్ణిక నృత్యాంజలి,కాకినాడ సంస్థ 7వ వార్షికోత్సవం లో గానకళ సంపాదకులు మునుగంటి వెంకటరావు దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు నాట్యాచార్య శ్రీ బి.మల్లికార్జునరావు, నాట్యాచారిణి శ్రీమతి సౌమ్య.**

## ఆకట్టుకున్న ద్విభాష్యం నగేష్ బాబు వీణానాదం



ఆలమూరు మండలం చింతలూరు శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా చింతలూరు ఫణీంద్ర కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద నవరాత్రుల ఆరంభం నుంచి నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. గత కాలపు వైభవాన్ని నేటి తరానికి అందించేలా ప్రదర్శించిన వివిధ నాటకాలు, సంగీత కార్యక్రమాలు నాటి, నేటి తరాలను సైతం విశేషంగా ఆకర్షించి ప్రశంసలు అందుకున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా 14-09-2024 శనివారం ఏర్పాటుచేసిన ప్రముఖ వీణా విద్వాంసులు ద్విభాష్యం నగేష్ బాబు వీణానాద కార్యక్రమం ఆహుతులను అలరించింది. ఈ కార్యక్రమంలో మృదంగ సహకారాన్ని శ్రీ యోగీష్ కమలాకర్ అందించారు.



**శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా శ్రీ సద్గురు సంగీత విద్వత్ గానసభ, వరంగల్ లో కర్ణాటక సంగీత కచేరి చేస్తున్న శ్రీ KV బ్రహ్మానందం**
**వయోలిన్:శ్రీ చావలి శ్రీనివాస్**
**మృదంగం:శ్రీ ఏడిద భీమశంకర్**



శ్రీరామ సమాజం 130వ సంగీతోత్సవాలలో 8-9-2024న నృత్య ప్రదర్శన చేసిన నాట్యగురువులు, గౌరవసభ్యులు, శిష్యులు



శ్రీరామ సమాజం 130వ సంగీతోత్సవాలలో 15-9-2024న "ఆతడే పరబ్రహ్మము" సంగీత నృత్య రూపకాన్ని ప్రదర్శించిన కళాకారులు, శ్రీరామసమాజ కార్యవర్గ సభ్యులు



నాట్యగురువు శ్రీమతి విజయలక్ష్మీ భరద్వాజను సత్కరిస్తున్న డా. యం. భారతలక్ష్మి, శ్రీమతి సిహెచ్. సూర్యకుమారి



వాయులీన విద్వాంసులు శ్రీమాన్ పురిహెళ్ళ భరద్వాజను సత్కరిస్తున్న శ్రీరామసమాజ అధ్యక్షులు శ్రీ ఎ. శ్రీనివాసరాజారావు



మృదంగ విద్వాంసులు శ్రీ వేమూరి వాసుదేవమూర్తి గారిని సత్కరిస్తున్న శ్రీరామ సమాజ కార్యవర్గ సభ్యులు విద్వాన్ శ్రీ డి. నగేష్ బాబు

Editor & Publisher : Ganakala, M.Venkatarao
30-1-29, Rangayyanaidu St, Kakinada - 1, Cell, 9441488721